శ్రీకాళహస్తీశ్వర శతకము
రూ॥40/-
పేజీలు:48



నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాద శక్తులను ఓడిద్దాం

24 గంటల్లో 190 మంది ఉక్రేన్ సైనికులు మృతి

వచ్చేనెల 28న కెనడాలో ఎన్నికలు

సాహిత్యానికి రాజకీయ రంగు!

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 114 | సోమవారం | 24-03-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00



## అన్ని రాష్ట్రాలతో చర్చించాల్సిందే

● ఆ తరువాతే డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలి ● పార్లమెంటులో చట్టం ఆమోదం పొందాకే చేయాలి ● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

అన్ని రాష్ట్రాలతో చర్చించాకే కేంద్రం డీలిమిటేషన్‌పై ముందుకెళ్లాలని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం ఆయన తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ డీలిమిటేషన్ అంశంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. పార్లమెంట్‌లో చట్టం ఆమోదం పొందాకే కేంద్రం డీలిమిటేషన్

తరువాయి 2లో

# 11 వేల ఎకరాల్లో పంట నష్టం



## 13 జిల్లాల్లో బీభత్సం సృష్టించిన అకాల వర్షాలు

- వడగళ్లు పడడంతో దెబ్బతిన్న వరి, మొక్కజొన్న
- నేలరాలిన మామిడి, ధ్వంసమైన కూరగాయల పంటలు
- పంటనష్టంపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న అధికారులు
- నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

గడిచిన మూడు రోజుల్లో కురిసిన భారీ ఈదురుగాలులతో కూడిన వడగాళ్ల వానకు రాష్ట్రంలోని 13 జిల్లాల్లో 11 వేల ఎకరాల్లో వివిధ పంటలకు నష్టం జరిగినట్టు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది.ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.గత మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కురిసిన వడగళ్ల వర్షానికి పలు జిల్లాలో జరిగిన పంట నష్టాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. ఇందులో

తరువాయి 2లో





## ఇషాన్ శతక గర్జన

12

## దక్షిణాదికి అన్యాయం తప్పుడు ప్రచారం

- కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌లు రెండూ ఒక్కటే
- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో అసలు నైజం బయటపడింది
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్



కాంగ్రెస్, బిఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక్కటేనని, పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనతో వాటి అసలు నైజం బయటపడిందని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కొన్ని అవకాశవాద పార్టీలు దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయాలకు తెరలేపుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం చెన్నైలో జరిగిన పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభన సమావేశంలో పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై చెన్నైలో జరిగిన సమావేశంలో

తరువాయి 2లో



## బిజెపి, బిఆర్‌ఎస్‌ను అడ్డుకునేందుకే కాంగ్రెస్‌తో జత

● స్థానిక సంస్థల ఎన్నికల్లో సొంతంగానే పోటీ ● రోజుకో పార్టీ మారేవారికి కమ్యూనిస్టులను విమర్శించే హక్కు లేదు ● సూర్యుడు ఉన్నంతకాలం వామపక్ష పార్టీలు సజీవం ● హిందూమతాన్ని అడ్డుపెట్టుకుని బిజెపి నీచ రాజకీయం ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి

సూర్యుడు ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీ సజీవంగా ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. ఆదివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఐ శత జయంతి సభలో ముఖ్య అతిథిగా పాల్గొని వారు ఈ సందర్భంగా మాట్లాడారు. కొందరు కమ్యూనిస్టు పార్టీల పని అయిపోయిందని అంటున్నారని, ప్రజా సమస్యలు ఉన్నంత కాలం కమ్యూనిస్టు పార్టీకి అంతం లేదన్నారు. అధికారం కోసం రోజుకో పార్టీ మారే వారే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని, కమ్యూనిస్టు పార్టీలను విమర్శించే నైతిక హక్కు వారికి లేదన్నారు. దేశంలో, రాష్ట్రంలో అధికారం లేకపోయినా సిపిఐ వందేళ్లుగా సజీవంగా ఉందన్న విషయం వారు తెలుసుకోవాలన్నారు. దేశంలో జనతా పార్టీ,

తరువాయి 2లో



## రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

కారు బస్సు ఢీ

చివ్వెంల మండలంలో ఘటన

ప్రజాపక్షం/చివ్వెంల

కారు ఆర్‌టిసి బస్సు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృతి చెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో పాటు మరో 8మందికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని సూర్యాపేట – ఖమ్మం ప్రధాన రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు,

తరువాయి 2లో

## 28న దేశవ్యాప్తంగా రైతు నిరసనలు

- పంజాబ్ పోలీస్ అరెస్టులు, అణచివేతకు ప్రతిఘటన
- సమస్య ప్రాతిపదికపై కలిసి రావాలని అన్ని రైతు వేదికలకు ఎస్‌కెఎం ఎన్‌సిసి పిలుపు



**చండీగఢ్ :** దేశవ్యాప్తంగా ఈనెల 28వ తేదీన నిరసన ప్రదర్శలు జరపాలని రైతులకు ఎస్‌కెఎం (సంయుక్త కిసాన్ మోర్చా) జాతీయ సమన్వయ కమిటీ (ఎన్‌సిసి) పిలుపు ఇచ్చింది. న్యాయబద్ధమైన డిమాండ్ల సాధనకోసం ప్రజాస్వామ్య పద్ధతులలో నిరసన ప్రదర్శనలు చేస్తున్న రైతులను అణచివేస్తున్న పంజాబ్ పోలీస్ చర్యలను తీవ్రంగా ప్రతిఘటించేందుకు ఎస్‌కెఎం దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలకు పిలుపు ఇచ్చింది. పంజాబ్‌ను నిరసన ప్రదర్శనల రాష్ట్రంగా మార్చేస్తున్నారని ఆమ్ ఆద్మీ ప్రభుత్వం రైతులపై మండిపడుతూ తీవ్ర హెచ్చరికలు చేస్తోంది. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం),ఎస్‌కెఎం (రాజకీయేతర)లు సహా దేశంలో ఉన్న అని రైతు సంస్థలు, రైతు ఉమ్మడి వేదికలు 'సమస్య ప్రాతిపదిక'పై కలిసి రావాలని, దేశవ్యాప్తంగా ఇచ్చిన ఈ పిలుపులో పాల్గొని రైతులపై పోలీసుల అణచివేతను ప్రతిఘటించాలని ఎస్‌కెఎం జాతీయ సమన్వయ

తరువాయి 2లో

## మహానగరంలో సైబర్ నేరాలు పెరుగుతున్నాయ్

- గత మూడేళ్లలో 10 నుంచి 15 శాతం పెరుగుదల
- వందల కోట్లు కొల్లగొట్టిన నేరగాళ్లు
- 2024లో మూడు కమిషనరేట్లలో కలిపి రూ.650 కోట్లు పోగొట్టుకున్న బాధితులు

ప్రజాపక్షం/హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో గత మూడేళ్లలో సైబర్ నేరాలు సగటున 10 నుంచి 15 శాతం కంటే ఎక్కువగా పెరిగాయి. సగటున 9 నుంచి 10 వేల మధ్య ఇళ్లల్లో దొంగతనాలు, వాహన, సెల్‌ఫోన్ చోరీలు రికార్డు అయినట్లు గణాంకాలు చెబుతున్నాయి. బాధితులు పోగొట్టుకున్న సొత్తు రూ. వందల కోట్లలో ఉంటోంది. ఒక్క 2024లోనే హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్లలో కలిపి సుమారు రూ.650 కోట్లు పోగొట్టుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అయితే దొంగతనాలు, చైన్ స్నాచింగ్ తదితర కేసుల్లో కాజేసిన సొత్తు రికవరీ చేసేందుకు ఎక్కువ

తరువాయి 12లో



## భద్రాద్రి బ్రహ్మోత్సవాలకు రండి

● ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేసిన మంత్రి కొండా సురేఖ, దేవాలయ అర్చకులు, అధికారులు ● బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

ప్రజాపక్షం/హైదరాబాద్/భద్రాచలం

భక్తుల కొంగుబంగారం భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ , భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం అర్చకులు, అధికారులు ఈ మేరకు ఆహ్వాన పత్రిక అందించారు. సిఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క , మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా ఆహ్వానం అందించారు. ఈ సందర్భంగా భద్రాద్రి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ ను ముఖ్యమంత్రి డిప్యూటీ సిఎం, మంత్రులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో భద్రాచలం రాములవారి ఆలయ అభివృద్ధికి సంబంధించి అవసరమైన భూసేకరణ, ఇతర వివరాలను ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైన భూసేకరణ, నిధులకు సంబంధించిన పూర్తి వివరాలు

తరువాయి 2లో

## దొంగనోట్లు ముద్రణ విచిత్ర ఆరోపణలు

- బిజెపి, కాంగ్రెస్ పార్టీలు దొందూ దొందే
- ఇందిరమ్మ రాజ్యమంటే పోలీసులు, అణచివేతల రాజ్యం
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి

కరీంనగర్ జిల్లాలో కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన దొంగనోట్ల ఆరోపణలపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ తీవ్రంగా స్పందించారు. కేంద్రమంత్రిగా ఉన్న బండి సంజయ్ తాము దొంగనోట్లను ముద్రించారని ఆరోపించడం విచిత్రమని వ్యాఖ్యానించారు. తమను దొంగలు అంటున్న బండి సంజయ్ అప్పుడు కర్ణాటకలో బిజెపియే అధికారంలో ఉన్నారు కదా? దర్యాప్తు చేసి నిజాలు బయటపెట్టాల్సింది మీరే అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల బాగు కోసం బిఆర్‌ఎస్ మళ్లీ గెలవడం చారిత్రక అవసరమని అన్నారు. బిఆర్‌ఎస్

తరువాయి 12లో

## దక్షిణ గాజాపై ఇజ్రాయెల్ దాడులు



30 మంది పాలస్తీనియన్లు మృతి

ప్రాణాలు కోల్పోయిన హమాస్ అగ్రనేత, మహిళలు, పిల్లలు

**రఫా :** గాజా ప్రాంతంలో ఇజ్రాయెల్ తన దాడులను ఆదివారంనాడు మరింత ఉధృతం చేసింది. ఈ దాడుల్లో హమాస్ సీనియర్ రాజకీయ అగ్రనాయకుడు సలాహ్ అల్–బర్దవీల్ హతుడయ్యాడు. అతడి భార్య కూడా ఈ దాడుల్లో మరణించింది. దక్షిణగాజాలో జరిపిన దాడుల్లో మరో 30 మంది పాలస్తీనియన్లు కూడా మరణించారు. పశ్చిమ రఫా పొరుగున ఉన్న అల్ సుల్తాన్‌ను ప్రజలు ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం హుకుం జారీచేసింది. ఈజిప్టుతో ఇజ్రాయెల్‌కు ఉన్న సరిహద్దుల్లోని ఫిలడెల్ఫీ ప్రాంతం నుండి

తరువాయి 12లో

# ప్రపంచం
WORLD NEWS

## వచ్చేనెల 28న కెనడాలో ఎన్నికలు



**ఒట్టావా :** కెనడా పార్లమెంటుకు ఏప్రిల్ 28వ తేదీన ఎన్నికలు జరుగుతాయి. కెనడా హౌస్ ఆఫ్ కామన్స్‌లో 343 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈనెల 14వ తేదీన దేశ 24వ ప్రధానమంత్రిగా లిబరల్ పార్టీ తరపున బాధ్యతలు చేపట్టిన మార్క్ కార్నీ ఈ ఆకస్మిక ఎన్నికల షెడ్యూలును ప్రకటించారు. దేశ రాజధాని ఒట్టావా నియోజకవర్గం నుండి ఆయన పోటీ చేస్తున్నారు. గడచిన జనవరిలో జస్టిన్ ట్రూడో ప్రధానమంత్రి పదవికి అనివార్యంగా రాజీనామా చేయాల్సి రావడంతో మార్క్ కార్నీని లిబరల్‌పార్టీ ప్రధానిగా ఎన్నుకుంది. మార్క్ కార్నీకి ప్రధాన ప్రత్యర్థిగా కన్జర్వేటివ్ పార్టీ అధ్యక్షుడు పియర్రీ పోయిలివ్రే (45) బరిలోకి దిగుతున్నారు. 2004 నుండి ఆయన పార్లమెంటు సభ్యుడుగా ఉన్నారు. కాగా బ్లాక్ క్యూబెకోవిస్ పార్టీ తరపున ఆ పార్టీ అధ్యక్షుడు వైవ్స్ ఫ్రాంకోయిస్ బ్లాంచెట్ కూడా ప్రధానమంత్రి మార్క్ కార్నీకి గట్టిపోటీ ఇస్తున్నారు. మార్క్ కార్నీ ఆర్థికవేత్త. దేశాన్ని ఆర్థిక సమస్యల నుండి గట్టెక్కిస్తారని, ప్రజలకు విశ్వసనీయమైన వాగ్దానాలు చేసి పార్టీని తిరిగి గెలిపిస్తారని లిబరల్‌పార్టీ నాయకులు ఆశలు పెట్టుకున్నారు.

## 24 గంటల్లో 190 మంది ఉక్రేన్ సైనికులు మృతి



**మాస్కో :** గడచిన 24 గంటల్లో ఉక్రేన్ సాయుధబలగం 190 మంది సైనికులను కోల్పోయింది. ఉక్రేన్‌లో శాంతికి సంబంధించి సోమవారంనాడు సౌదీ అరేబియా నగరంలో చర్చలు ప్రారంభమవుతున్న తరుణంలో రష్యా రక్షణ మంత్రిత్వశాఖ ఈ విషయం వెల్లడించిందని టాస్ వార్తాసంస్థ ఆదివారంనాడు ప్రకటించింది. కుర్స్క ప్రాంతంలో ఉక్రేన్ సాయుధ బలగాలు ఉపయోగించే మూడు యుద్ధ వాహనాలతోపాటు బహుముఖంగా రాకెట్లను ప్రయోగించే రాకెట్ లాంఛర్లు, ఆరు మోర్టార్లు, 16 సాధారణ వాహనాలు, రెండు ఆయుధ డిపోలను కూడా నష్టపోయిందని టాస్ పేర్కొంది. ఇవన్నీ ధ్వంసమయ్యాయని పేర్కొంది. గోగోలెవ్కా, గోర్నాల్, గువో, ఒలేష్నా స్థావరాలున్నచోట యుద్ధ కార్యకలాపాల సమయంలో ఉక్రేన్‌కు సంబంధించిన సాయుధబలగాలపై దాడులు చేసి ఈ తీవ్ర నష్టాని కలిగించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొన్నట్లు టాస్ చెప్పింది. అదేవిధంగా డోనెట్స్ పీపుల్స్ రిపబ్లిక్‌లోని శ్రీబ్నోయ్ ప్రాంతాన్ని ఉక్రేన్ నుండి రష్యా దళాలు విముక్తి చేశాయని కూటా తెలిపింది. గడచిన 24 గంటలలో 138 జిల్లాలో ఉన్న ఉక్రేన్ సైనిక, వైమానిక స్థావర మౌలిక సదుపాయాలు, మానవరహిత వైమానిక వాహన శిక్షణాకేంద్రాలు, వాటి ఉత్పత్తి వర్కుషాపులు, విదేశీ కిరాయి సైనికులను, పరికర కేంద్రాలను ధ్వంసం చేసినట్లు తెలిపింది. బెల్గరోడ్ ప్రాంతంలో 60 మంది సేనలను ఉక్రేన్ కోల్పోయింది, సుమీ ప్రాంతంలోని నోబో డిట్రోవ్కా, ఉగ్రోడీలను స్థావరంగా చేసుకున్న ఉక్రేన్ దళాలకున్న మానవరహిత వ్యవస్థలను బాటిల్ గ్రూప్ నార్త్ యూనిట్లు ధ్వంసం చేశాయని రష్యా రక్షణమంత్రిత్వ శాఖ ప్రకటించింది.

**కీవ్‌పై 147 డ్రోన్లతో దాడి : ఏడుగురు పౌరులు మృతి**

అమెరికా మధ్యవర్తిత్వం ద్వారా రష్యా–ఉక్రేన్‌లు సౌదీఅరేబియాలో సోమవారంనాడు పరోక్ష చర్చలకు సన్నద్ధమవుతున్న తరుణంలో రష్యా సేనలు ఉక్రేన్ రాజధాని కీవ్‌పై భారీ ఎత్తున డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో ఐదేళ్ళ బాలికసహా ఏడుగురు ఉక్రేన్ పౌరులు మరణించారు. మరో పదిమంది గాయపడ్డారు. రాత్రికి రాత్రే ఈ దాడులు జరిగాయని కీవ్ అధికారులు, సహాయ బృందాలు చెప్పాయి. 147 డ్రోన్లను రష్యా ప్రయోగించిందని, వీటిల్లో 97 డ్రోన్లను తాము కూల్చివేశామని, మరో 25 డ్రోన్లు వాటి లక్ష్యాలను ఛేదించలేకపోయాయని ఉక్రేన్ వాయుసేన ప్రకటించింది. రాజధాని కీవ్‌తోపాటు ఖార్కీవ్, సుమీ, ఛెర్నిహివ్, ఒడెశా, డోనెట్స్క ప్రాంతాలలో ఈ దాడులు జరిగాయి. దినోప్రోలో రెండు నివాసిత ప్రాంతాలు దగ్ధమయ్యాయి. కాగా సౌదీఅరేబియాలో అమెరికా అధికారులను ఉక్రేన్ ప్రతినిధిబృందం ముందుగానే అమెరికా మధ్యవర్తులతో సమావేశం జరుపుతుందని అధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పారు. పాక్షిక కాల్పుల విరమణపై చర్చలకు ఒక సాంకేతిక బృందాన్ని పంపుతున్నట్లు చెప్పారు. దాదాపు ప్రతిరోజూ కీవ్‌పై రష్యా సేనలు దాడులు చేస్తున్నాయని జెలెన్స్కీ చెప్పారు. అదేవిధంగా 59 ఉక్రేన్ డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటించింది.

## కోర్టు ఉత్తర్వుతో ఎర్డొగాన్ ప్రత్యర్థి అరెస్ట్





**ఇస్తాంబుల్ :** ఇస్తాంబుల్ మేయర్ ఎక్రెమ్ ఇమామోగ్లూ (54) ను ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం అదుపులోకి తీసుకుంది. ఆదివారంనాటి తాజా పరిణామాలతో కోర్టు ఉత్తర్వుల మేరకు ఆయనను లాంఛనంగా అరెస్టుచేసి జైలులో ఉంచారు. ఆయనమీద వచ్చిన ఆరోపణలపై విచారణ ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. శనివారంనాడు పోలీసులు ఆయనను ఐదుగంటల పాటు ప్రశ్నించారు. ప్రస్తుత దేశాధ్యక్షుడు రెసెప్ తయ్యిప్ ఎర్డొగాన్ (71) కు ప్రతిపక్ష రిపబ్లికన్ పీపుల్స్ పార్టీ తరపున ప్రధాన ప్రత్యర్థిగా ఎన్నిక కాకముందే ఆయనను అవినీతి ఆరోపణలపై అరెస్టు చేశారు. పీపుల్స్‌పార్టీ త్వరలో ఆయనను పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిగా ప్రకటించనున్నది. తదుపరి అధ్యక్ష ఎన్నికలు నిర్ణీత ప్రకారం 2028లో జరుగుతాయి. ప్రస్తుతం ఇమామోగ్లూ ఇస్లాంబుల్ నగర మేయర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇమామోగ్లూ అరెస్టును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు పెల్లుబికాయి. రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని ప్రదర్శకులు విమర్శిస్తున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు ఎర్డొగాన్ 2014 నుండి జస్టిస్ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ తరపున గెలిచి అధికారం చెలాయిస్తున్నారు. అంతకుముందు ఆయన ప్రధానమంత్రిగా కూడా పనిచేశారు.

## తాలిబన్ ఉగ్రవాద నేత హక్కానీపై రివార్డు ఉపసంహరణ ఎందుకు?



**కాబూల్ :** తాలిబన్ ఉగ్రవాద ప్రధాన నాయకుడు, అఫ్గాన్‌స్థాన్ దేశీయాంగమంత్రి ఖలీఫా సిరాజుద్దీన్ హక్కానీ ఆచూకీ చెప్పినవారికి పది మిలియన్ డాలర్లు బహుమతి ఇస్తామని చేసిన ప్రకటనను అమెరికా హోంమంత్రిత్వశాఖ ఉపసంహరించుకుందని ఆఫ్గానిస్థాన్ దేశీయాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ముఫ్తీ అబ్దుల్ మతిన్ క్వానీ ఆదివారంనాడు ధృవీకరించారు. గడచిన రెండు సంవత్సరాలుగా తాలిబన్ చెరలో ఉన్న అమెరికా పౌరుణ్ణి గత గురువారంనాడు ఉగ్రవాద ప్రభుత్వం విడుదల చేసింది.

ఆ తర్వాత రెండు రోజులకు ఈ ప్రకటన రావడంతో అమెరికా పౌరుణ్ణి విడుదల చేస్తే హక్కానీపై రివార్డును రద్దుచేస్తామన్న ఒప్పందం ఉందన్న ఊహాగానాలు పెరిగాయి. సిరాజుద్దీన్ హక్కానీ 13 రకాల మారుపేర్లతో చెలామణీ అవుతున్నాడు. అంతర్జాతీయ ప్రత్యేక ఉగ్రవాద జాబితాలో అతడిపేరును ఎఫ్‌బిఐ నమోదు చేసింది. అతడికి హక్కానీ నెట్‌వర్క్ పేరుతో ఒక సొంత గ్రూపు ఉంది. అదీకాకుండా ఆఫ్గానిస్థాన్ ప్రభుత్వంతోనూ, అల్‌ఖైదా ఉగ్రవాదులతోనూ హక్కానీకి సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. అఫ్గానిస్థాన్‌లో ఇరవై సంవత్సరాలపాటు జరిగిన పోరాటంలో హక్కానీ నెట్‌వర్క్ అమెరికా, ఇతర విదేశీ సైన్యంపై తీవ్రదాడులకు పాల్పడింది. దీంతో హక్కానీ నెట్‌వర్క్‌ను అమెరికా ఎఫ్‌బిఐ ఉగ్రవాద సంస్థగా ప్రకటించి ప్రపంచ ఉగ్రవాద జాబితాలో చేర్చింది.

## కాంగ్రెస్‌తో జత

(మొదటి పేజీ తరువాయి)



లోక్ దళ్ , స్వతంత్ర పార్టీ అధికారంలో కొంత కాలం ఉన్నాయని, అధికారం పోగానే కనుమరుగయ్యాయని విమర్శించారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు దూరినట్లు హిందూ మతాన్ని అడ్డం పెట్టుకొని బీజేపీ రాజకీయం చేయటం నీచమన్నారు. రాముడు హిందూ మతం 500 ఏళ్ల కింద పుట్టిందని, బిజెపి లేక ముందు ప్రజలు రామున్ని దేవునిగా కొలిచారని, హిందూ మతాన్ని ఆచరించారని గుర్తు చేశారు. ప్రజలు గమినంచాలన్నారు. కష్ట జీవుల కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాడుతోందని , సంపన్న వర్గాల వారు ఉండే బిజెపి, కాంగ్రెస్ పార్టీ నేతలకు కమ్యూనిస్టు పార్టీలు అంటే కంటగింపు అన్నారు. కాంగ్రెస్ బీఆర్ఎస్ తదితర పార్టీలు కమ్యూనిస్టు పార్టీని వాడుకోని మోసం చేశారని విమర్శించారు. మోసపోవడం కమ్యూనిస్టు పార్టీల వంతైందన్నారు. పెద్ద దొంగ కంటే చిన్న దొంగ మేలు అన్నట్లు బీజేపీ , బీఆర్ఎస్‌లు అధికారంలోకి రాకుండా అడ్డుకునేందుకు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో జత కట్టామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి ఏడు లక్షల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని దోచుకుందని విమర్శించారు. ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని , కాంగ్రెస్ విమర్శల దాడి చేయటం సిగ్గుచేట అన్నారు. కాంగ్రెస్ పొత్తులు శాశ్వతం కాదని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులు సొంతంగా పోటీ చేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీలను ఆదరించి అభిమానించే వారు కార్యకర్తలు కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహ మాట్లాడుతూ బిజెపి మతతత్వ విధానాలను తిప్పి కొట్టాలన్నారు. దేశ సంపదను సంపన్నులకు దోచిపెడుతోందన్నారు.

సభకు సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు అధ్యక్షత వహించారు. సభకు ముందు వనపర్తి శ్వేతా నగర్ , సిపిఐ ఆఫీస్ నుంచి అంబేద్కర్ చౌక్ రాజీవ్ చౌక్ , ఇందిరాపార్క్, వివేకానందచౌక్ మీదుగా దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ వరకు ఎర్రజెండాలు , ఎర్ర చీరలు కండువాలు ధరించి డప్పు వాయిద్యాలతో మహిళలు నృత్యం చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీరాం, అబ్రహం, మోష, రాబర్డ్, గోపాలకృష్ణ, శ్రీహరి, ఎత్తం మహేష్, రవీందర్, కృష్ణవేణి, గీత, కుతుబ్, నర్సింహశెట్టి, లక్ష్మీ నారాయణ, కుర్మయ్య, యూసఫ్, కాకం బాలస్వామి, నరేష్ , వంశి, భూమిక, శిరీష, సహదేవుడు, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి బ్రహ్మోత్సవాలకు రండి

(మొదటి పేజీ తరువాయి)




అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి , దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, భద్రాచలం ఆలయ ఇఒ రమాదేవి, ఆలయ అర్చకులు, తదితరులు పాల్గొన్నారు.

**మూడ్రోడుల్లో మాడవీధుల స్థల సేకరణ పూర్తి : – మంత్రి పొంగులేటి**

భద్రాచలం రామాలయం చుట్టూ ఏర్పాటు చేయ తలపెట్టిన మాఢవీధుల స్థల సేకరణ ప్రక్రియ మూడ్రోజుల్లోగా పూర్తి చేయాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక ఆర్‌డిఓ కార్యాలయ సమావేశ మందిరంలో శ్రీరామనవమి, పట్టాభిషేకం ఏర్పాట్లపై ఆయన ఎంపి బలరాంనాయక్‌తో కలిసి అధికారులతో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీరామనవమికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్నారని, మాఢ వీధుల విస్తరణ పనులను ఆయన చేతుల మీదుగా ప్రారంభిస్తారని చెప్పారు. శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున మంచినీరు, మజ్జిక ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని, విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, వైద్య సేవలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మద్యం షాపులు ఆ రెండు రోజుల పాటు మూతవేయాలని, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటిడి ఏపిఓ రాహుల్, ఎఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ఆర్డిఓ దామోదర్ రావుతో పాటు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిజామాబాద్‌లో 25 నుంచి 27 వరకు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర తృతీయ మహాసభలు

### 25న రైతు ప్రదర్శన, 26న బహిరంగసభ-, మహాసభలు ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర తృతీయ మహాసభల సందర్భంగా ఈ నెల 25వ తేదీన నిజామాబాద్ పట్టణంలో నిర్వహించనున్న రైతుల ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు బాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ రాష్ట్ర రైతాంగానికి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఎఐకెఎస్) తృతీయ మహాసభలు నిజామాబాద్ పట్టణంలో ఈనెల 25 నుంచి 27వరకు మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

ఇందులోభాగంగా మహాసభల మొదటి రోజు ఈనెల 25న ప్రజల జీవనోపాధిని రక్షించాలని, కార్పొరేట్ దోపిడీ శక్తులను తరిమికొట్టాలని, పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టం రుణ మాఫీ చట్టం చేయాలని, జాతీయ వ్యవసాయ విధాన మార్కెట్ ముసాయిదాను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, పంటల బీమా పథకాన్ని రైతులకు అనుకూలంగా సవరణ చేసి అమలుచేయాలని, తదితర డిమాండ్లతో రైతుల ప్రదర్శన నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ ప్రదర్శన నిజామాబాద్ పట్టణంలో ప్రెస్ క్లబ్ వద్ద ప్రారంభమై గోనె రెడ్డి ఫంక్షన్ హాల్ వద్దకు చేరుకుంటుంది. అక్కడ కంజర భూమయ్య అధ్యక్షతన బహిరంగ సభ జరుగుతుందన్నారు. ముఖ్య అతిథిగా అఖిలభారత కిసాన్ సభ అధ్యక్షులు రాజన్ క్షీర్ సాగర్, వక్తలుగా ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, మహాసభల ఆహ్వాన సంఘ అధ్యక్షులు నర్రా రామారావు, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరి రావు, ప్రముఖ న్యాయవాది వి.ఎల్.నరసింహారెడ్డి, ఎఐయుసి కార్యదర్శి వై.ఓమయ్య, నాయకులు పి.సుధాకర్, ఎల్.దశరథ పాల్గొంటారని చెప్పారు.

**26న మహాసభ ప్రారంభం :**

ఈనెల 26వ తేదీ ఉదయం 10 గంటల మహాసభలను జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ వైస్‌చాన్సలర్ జానయ్య ప్రారంభిస్తారని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సారంపల్లి మల్లారెడ్డి, దొంతి నరసింహారెడ్డి, వ్యవసాయ శాస్త్రవేత్త సోమామర్ల, శ్యాంప్రసాద్‌రెడ్డి, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.కాంతయ్య, ఇతర ప్రజా సంఘాల నాయకులు సందేశం ఇస్తారని తెలిపారు. రైతుల ప్రదర్శనకు రాష్ట్రం నలుమూల నుండి ప్రతినిధులు, నిజామాబాద్ చుట్టూ ఉన్న జిల్లాల నుండి రైతులు ప్రదర్శనలో పాల్గొనున్న రైతుల ప్రదర్శనను, బహిరంగ సభను విజయవంతం చేయాల్సిందిగా వారు కోరారు.

## చర్చించాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

చేయాలన్నారు. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం ఇంకా పెరగాలని కేశవ్ రావు అన్నారు. కొన్ని రాష్ట్రాలు కేవలం సీట్లు గురించి మాత్రమే పోరాడటం లేదని, పార్లమెంట్‌లో తమ గళానికి ప్రధాన్యత ఉండాలని అంటున్నాయని కేశవ్ రావు అన్నారు. డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తూ చెన్నైలో జరిగిన సమావేశానికి తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా మద్దతు ప్రకటించిందన్నారు. డీలిమిటేషన్ వ్యవహారంలో ప్రస్తుత కథానాయకుడు స్టాలిన్ అయినప్పటికీ, హీరో మాత్రం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్‌లో సభ పెడతామని చెప్పడం దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి కీలక పరిణామమని అన్నారు. ఈ సభ రాజకీయ అజెండాను మలుపు తిప్పే అవకాశం ఉందని అన్నారు. డీలిమిటేషన్ అనేది కేవలం పార్లమెంట్ సీట్ల పెంపు గురించి మాత్రమే ఉండకూడదని అన్నారు. జనాభా గణన జరిగిన తర్వాత ప్రతిసారి ఇదే వివాదం తెరపైకి వస్తుందని తెలిపారు. పార్లమెంట్‌లో ప్రతి రాష్ట్రానికి బలమైన ప్రాతినిధ్యం ఉండాలన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఫెడరలిజాన్ని పూర్తిగా మార్చిపోయారని విమర్శించారు. స్టేట్ లిస్ట్‌ను తగ్గించి, సెంట్రల్ లిస్ట్‌ను పెద్దది చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

దీని ఫలితంగా రాష్ట్రాల హక్కులు తగ్గిపోతున్నాయన్నారు. జమ్మూకశ్మీర్, అసోం వంటి ప్రాంతాల్లో సీట్లను పెంచే ప్రయత్నం చేస్తున్నారని, దక్షిణాదికి అన్యాయం జరిగేలా అడుగులు వేస్తున్నారని కేశవ్ రావు విమర్శించారు. అమిత్‌షా వంటి వ్యక్తుల మైండ్ సెంట్‌తో సమస్యలు పరిష్కారం కావన్నారు.

## ముగ్గురు మృతి

(మొదటి పేజీ తరువాయి)

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం కాంటాయపాలెంకు చెందిన గడ్డం రవీందర్ (34) హైద్రాబాద్‌లో నివాసం ఉంటూ కారు డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. ఆత్మకూర్(ఎస్) మండలం కోటపహాడ్ గ్రామంలో తమ బంధువుల ఇంట్లో పండుగ ఉండగా అతని భార్య రేణుక (28), కుమార్తె రిషిత (8)తో పాటు మొత్తం 11 మంది కారులో ప్రయాణిస్తుండగా సూర్యాపేట ఖమ్మం వైపు వెళ్తున్న ఆర్‌టిసి బస్సు వారు ప్రయాణిస్తున్న కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రవీందర్, రేణుక, రిషితలు అక్కడికక్కడే మృతి చెందగా మరో బాలుడి పరిస్థితి విషమంగా ఉండగా ఏడుగురికి గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్న చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకొని రోడ్డు ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గురైన వారిని చికిత్స కోసం సూర్యాపేట జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. మృతి చెందిన వారి పార్థివదేహాలను పోస్టుమార్టం కోసం మార్చురికి తరలించారు. ఈ ప్రమాదంకు సంబంధించిన మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

## తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పోటీ పడి మరీ మాట్లాడరన్నారు. దేశంలో లేని సమస్యను సృష్టించి, బిజెపికి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ రెండు పార్టీలు కలిసి పని చేస్తున్నాయని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనపై ఇప్పటివరకు పార్లమెంటులో గాని, కేంద్ర మంత్రి వర్గంలో కాని ఏలాంటిచర్చ జరగలేదని ఆయన స్పష్టం చేశారు. దక్షిణాదిలో బిజెపి బలపడకూడదనే రాజకీయ కుట్ర కోణంతో కాంగ్రెస్ ,డిఎంకే , బిఆర్ఎస్ దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని తప్పుడు ప్రచారం చేస్తూ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. తమిళనాడులో ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ స్టాలిన్‌ను ముందుపెట్టి నాటకమాడుతోందని, ఆ నాటకంలో కెటిఆర్ భాగస్వామ్యమయ్యారన్నారు. బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ మధ్య సయోధ్య చేసేందుకు మజ్లిస్ పార్టీ ప్రయత్నం చేస్తోందని, ఈ మూడు పార్టీలు ఒక్కటైనా తెలంగాణ ప్రజల మద్దతుతో ఆ వాటిని సమర్థవంతంగాఎదుర్కొంటామని కిషన్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. దక్షిణాది ప్రజల సంక్షేమం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం చిత్త శుద్ధితోకృషి చేస్తోందని చెప్పారు. , భవిష్యత్తులోనూ చేస్తోందన్నారు. వచ్చే శాసనసభ ఎన్నికల్లో కర్ణాటకలో, తెలంగాణలో గెలిచేలా, తమిళనాడులో మరింత పట్టు సాధించేలా అంకితభావంతో పని చేస్తున్నామని చెప్పారు.

## వేల ఎకరాల్లో పంట నష్టం

(మొదటి పేజీ తరువాయి)

భాగంగా పంట నష్టంపై గ్రామాల వారీగా సర్వే చేసి నివేదిక సమర్పించాలని అధికార యంత్రాంగానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేశించారు. దీంతో రంగంలోకి దిగిన వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంటనష్ట సర్వే చేపడుతున్నారు. కాగా అకాల వర్షాలు రైతుల పాలిట శాపంగా మారాయి. గత మూడు రోజులగా కురుస్తున్న ఈదుర గాలులతో కూడిన వడగళ్ల వర్షాలతో రైతులు బిక్కు బిక్కుమంటున్నారు. అసలే ఎండ కాలం కావడం ఒక వైపు ఈ ఏడాది సరిపోను నీరులేక అక్కడక్కడ పంటలు ఎండిపోతుండగా, మరోవైపు అకాల వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. బలమైన ఈదురగాలు వడగళ్ల వర్షానికి చాల ప్రాంతాల్లో చేతికి వచ్చిన పంటలతో పాటు ఇప్పుడిప్పుడే గెలలు వేస్తున్న వరి పంటలకు నేలరాలుతుండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఈ వర్షాలకు మామిడి పంటలు సైతం దారుణంగా దెబ్బతింటున్నాయి.వీటికి తోడుగా టమాట,వంకాయ తదితర కూరగాయల పంటలకు సైతం భారీనష్టం వాటిల్లింది. మరి ముఖ్యంగా వరి పంటలను చాల మేరకు దెబ్బతిన్నాయి. సన్న ధాన్యానికి ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.500ల చొప్పున బోనస్ ప్రకటించిన నేపథ్యంలో రైతులు గత సీజన్‌లో 25 శాతం సన్న ధాన్యం సాగు చేయగా, ఈ సారి అది 45 నుంచి 50 శాతానికి పెరిగింది. అయితే భారీ ఈదుల గాలులు, వడగళ్ల వానకు సన్న ధాన్యం నేలరాలుతుండడంతో భారీగా పంటల నష్టం జరుగుతోంది.



## రైతు నిరసనలు

(మొదటి పేజీ తరువాయి)

కమిటీ ఆదివారంనాడు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది. ''పంజాబ్ పోలీస్ అణచివేతకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జిల్లాల స్థాయిలలో,పునాదిస్థాయిలో మార్చి 28న నిరసన ప్రదర్శనల్లో పాల్గొనాలని కోరుతున్నాం'' అని ఎస్‌కెఎం పేర్కొంది. ''పంజాబ్ రాష్ట్ర ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ ఆదేశాల మేరకు రాష్ట్ర పోలీసులు 350 మంది రైతు నాయకులను, కార్యకర్తలను తెల్లవారుజామునే ఇళ్ళను చుట్టుముట్టి గృహనిర్బంధాలు, అరెస్టులు చేసింది, అరెస్టయిన రైతు నాయకులలో జగజిత్ సింగ్ దల్లేవాల్, సర్వాన్ సింగ్ పంధర్ కూడా ఉన్నారు. ఖన్నౌరీ, శంభు సరిహద్దుల్లో నిరసన ప్రదర్శనలు చేస్తున్న రైతులు వేసుకున్న టెంట్లను, సభాస్థలాలను పోలీసులు బుల్‌డోజర్లతో కూల్చివేశారు, వారి ట్రాక్టర్లను అక్కడి నుండి బలవంతంగా తొలగించారు, రైతుల ఇతర వాహనాలన్నింటినీ అక్కడ లేకుండా తొలగించారు'' అని ఎస్‌కెఎం జాతీయ సమన్వయ కమిటీ ఆ ప్రకటనలో పేర్కొంది.

ఇదిలా ఉండగా సీనియర్ రైతు నాయకుడు జగజిత్ సింగ్ దల్లేవాల్ తోపాటు అనేకమంది రైతు నాయకులను గడచిన బుధవారంనాడు పోలీసులు నిర్బంధించారు. ఆదివారంనాడు వారిని జలంధర్ నుండి పటియాలకు తరలించారు. దేశంలో రైతు సమస్యల పరిష్కారాన్ని కోరుతూ గత ఏడాది నవంబరు 26వ తేదీ నుండి నిరవధిక నిరాహారదీక్షలో ఉన్న దల్లేవాల్‌ను జలంధర్‌లోని పంజాబ్ వైద్యవిజ్ఞానసంస్థ ఆసుపత్రికి తరలించారు. తర్వాత జలంధర్‌లోనే పిడబ్ల్యుడి రెస్ట్‌హౌస్‌కు తరలించారు. అంతకుముందు అనేకమంది రైతు నాయకులను కూడా పోలీసులు నిర్బంధించారు. ఆదివారంనాడు వీరందరినీ పటియాలాలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించి వైద్యపరీక్షలు చేశారు. కేంద్ర వ్యవసాయమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నాయకత్వాన వచ్చిన కేంద్రం బృందంతో చండీగఢ్‌లో చర్చల అనంతరం తిరిగి వస్తుండగా దల్లేవాల్, పంధర్‌తోపాటు పలువురు రైతు నాయకులను బుధవారంనాడు మొహాలీలో పోలీసులు అరెస్టు చేశారు. రైతులు పండించిన పంటలకు ఇచ్చే కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని చాలా సంవత్సరాలుగా దేశంలో రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంజాబ్–హర్యానా సరిహద్దుల్లో శంభు,ఖన్నౌరీ వద్ద జరుగుతున్న రైతుల నిరసన ప్రదర్శనలకు ఎస్‌కెఎం (రాజకీయేతర), కెఎంఎం రెండు సంస్థలూ నాయకత్వం వహించి ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తున్నాయి. పంజాబ్ పోలీసులు రైతు ఉద్యమాన్ని తీవ్రంగా అణచివేస్తున్న తరుణంలో శుక్రవారంనాడు పంజాబ్ ప్రభుత్వం రైతులతో ఒక సమావేశాన్ని తలపెట్టింది. ఐతే ఈ సమావేశానికి హాజరయ్యేదేలేదంటూ ఎస్‌కెఎం, భారతీ కిసాన్ యూనియన్ (ఉగ్రహాన్)లు ప్రభుత్వ ఆహ్వానాన్ని తిరస్కరించాయి. పోలీసు చర్యలను వ్యతిరేకిస్తూ ఆప్ ప్రభుత్వ పనితీరును రైతులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. నిర్బంధించిన రైతు నాయకులను విడుదల చేయాలని, పంజాబ్‌లో రైతులతో చర్చలు జరపడానికి వీలైన వాతావరణాన్ని ఏర్పాటు చేయాలని రైతు నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వారం రోజులపాటు పంజాబ్‌లో ధర్నాలు నిర్వహించాలని రైతు సంఘాలు ఇచ్చిన పిలుపును మార్చి 5వ తేదీన పోలీసులు భగ్నం చేసేందుకు రైతు నాయకులను తెల్లవారుజామునే అరెస్టులు చేశారు. గృహనిర్బంధాలు చేశారు. మూడు రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాల రద్దు, కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత తదితర డిమాండ్ల సాధనకు 2020లో ఢిల్లీ సరిహద్దుల్లో ఏడాదిపైగా జరిగిన నిరసన ప్రదర్శనకు ఎస్‌కెఎం నాయకత్వం వహించింది. ప్రభుత్వ వ్యవసాయ విధానం అమలు చేయాలని, ఆరు పంటలను కనీస మద్దతు ధరలకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేశారు. భద్రతా కారణాలతో ఢిల్లీకి రైతులు తలపెట్టిన ప్రదర్శనను భగ్నం చేసిన తర్వాత గత ఏడాది ఫిబ్రవరి 13 నుండి రైతులు శంభు,ఖనౌరీ సరిహద్దుల్లో మకాంవేసి నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆప్ ప్రభుత్వం వారిని అక్కడి నుండి బలప్రయోగం ద్వారా తొలగించింది. దాంతో రైతుల ఆందోళన మరింత పదునెక్కింది.



# జనరల్

STATE NEWS REGIONAL NEWS

## రైతుల ఆత్మహత్యల నివారణకు కమిటీ వేయాలి



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలను నివారణకు ఉన్నతాధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని బిసి పొలిటికల్ జెఎసి స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన బిసి పొలిటికల్ జెఎసి రైతు విభాగ ఆవిర్భావ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటల బీమా పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతుల వివరాలను జిల్లాల వారీగా సేకరించి, వారందరికీ పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పండించిన పంటకు రైతులే ధర నిర్ణయించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా రైతు విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా మారమోని పాండు రంగ యాదవ్‌ను నియమించారు. సమావేశంలో బిసి పొలిటికల్ జెఎసి నాయకులు గూడు షా, తిరుపతయ్య, శివన్న, నాగన్న, కుమ్మరి తిరుపతయ్య, వెంకటయ్య, రాజు, తిరుమలేశ్, శివ, వెంకటేష్ పాల్గొన్నారు.

## నల్లగొండను నెంబర్‌వన్ జిల్లాగా చేస్తాం

2 వేల కోట్లతో ఉమ్మడి జిల్లాలో రోడ్లు
సాగర్ ఆయకట్టులో చివరిగింజ
చేతికి వచ్చేంత వరకూ నీరు ఇస్తాం
భారీ నీటిపారుదల, పౌరసరఫరాల
శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి,
ఆర్‌అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి
కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ (పాలకవీడు): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నాటి నుండి తెలంగాణ రాష్ట్రంలోని తెల్లరేషన్‌కార్డు ఉన్నవారం దరికీ ఒక్కొక్కరికీ 6 కేజీల చొప్పున సన్న బియ్యం ఉచితంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా హుజూర్‌నగర్ పట్టణం నుండి పంపిణీ ప్రారంభిస్తామని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్‌దర్గాను దర్శించుకున్నారు. డెక్కన్ సిమెంట్ అతిథి గృహం నందు రాష్ట్ర ఆర్‌అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎమ్మెల్యేలతో కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లా అభివృద్ధిపై చర్చించుకున్నారు. అనంతరం ఇట్టి విషయాలను రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రెస్‌మీట్‌లో వివరించారు. గతంలో వేలకోట్లు ఖర్చుపెట్టి దొడ్డు రకం బియ్యం ఇవ్వడంతో ప్రజలు వాటిని తినకుండా కోళ్ల ఫారాలకి, బీర్ల కంపెనీలకి, రీసైకిలింగ్, కాకినాడ పోర్టు ద్వారా అక్రమంగా తరలించి దుర్వినియోగపర్చారని అందుకే ప్రజల కొరకు ప్రతిఒక్కరూ సన్నబియ్యం తినేలా సోనియా గాంధీ నాయకత్వంలో ప్రవేశపెట్టిన ఆహారభద్రత చట్టంని పటిష్ట పరుస్తూ తెలంగాణలోని 3.2 కోట్ల (84శాతం) మందికి కడుపు నింపేలా ఉగాది నాడు ప్రారంభించి ఏప్రిల్ నెల నుండి ప్రతిఒక్కరికీ 6 కేజీల సన్నబియ్యం అందిస్తామని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని అన్ని సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యతనిస్తూ అనుకున్న సమయానికి పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. ఎస్.ఎల్.బి.సి, డిండి ప్రాజెక్ట్,నెల్లికల్లు, నాగార్జునసాగర్ ఎడమ కాల్వకి మరమ్మత్తులు చేపిస్తామని ఇటీవలె గంధమల్లకు క్యాబినెట్ ఆమోదం పొందామని త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కృష్ణనదిలో నీటికొరతకు కారణం గత ప్రభుత్వమేనని 512 టిఎంసిలు ఆంధ్రకి ఇచ్చి, 299 టిఎంసిలు మాత్రమే తెలంగాణకు వచ్చేలా ఒప్పందం చేసుకున్నారని గుర్తు చేశారు. అలాగే పోతిరెడ్డిపాడు కెపాసిటి పెంచిన, ముచ్చికల్లు వద్ద డబుల్ నీళ్లు ఆంధ్ర వారు తరలించేందుకు గత ప్రభుత్వ పాలకులు సహాయం చేశారని, మేము వచ్చాక కృష్ణానది బోర్డు మేనేజ్‌మెంట్‌తో మాట్లాడుతూ తెలంగాణ వాటాని పెంచే విధంగా పోరాడుతున్నామని తెలియజేశారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నుండి నాగార్జునసాగర్ ప్రాజెక్ట్‌కు తరలించే ఎడమకాల్వ, ఏఎమ్‌ఆర్ ద్వారా నీరు విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు రబీసీజన్‌లో వేసిన వరిప్రతిగింజ ఇంటికి చేరేంత వరకు సాగునీరు అందిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు నలమాద పద్మావతి రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, మందుల సామేల్, వేముల వీరేశం, బాలూ నాయక్, బీర్ల అయిలయ్య, కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మదర్ డైరీ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఐఎన్‌టియూసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న గౌడ్, రాష్ట్ర నాయకులు దొంగరి వెంకటేశ్వర్లు, ఈదుల్గంటి సుబ్బారావు, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ తదితరులు పాల్గొన్నారు.

**గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో కాలయాపన...**

మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ... ఆర్‌అండ్‌బి, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.2000 కోట్లతో పలు రోడ్లు నిర్మించి ఉమ్మడి నల్లగొండ జిల్లాను నంబర్‌వన్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగంను గతంలో వైఎస్‌ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించి 30 కిలోమీటర్లు పూర్తి చేయడం జరిగిందని తర్వాత వచ్చిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ళు కాళేశ్వరం పేరుతో కాలయాపన చేసి మిగిలిన ప్రాజెక్టులను వదిలేశారని, తిరిగి మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్‌ఎల్‌బిసి సొరంగం నిర్మాణం పూర్తి చేయడం కొరకు అమెరికా వెళ్ళి ర్యాబిస్ కంపెనీతో చర్చించి పనులు ప్రారంభించామని తెలిపారు. కానీ పనుల్లో సొరంగం కూలడం దురదృష్టకరమన్నారు. బ్రహ్మణవెల్లంలకి 200 కోట్లు పదేళ్ళు ఇవ్వకుండా ఉంచారన్నారు. మేము రాగానే పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించామని తెలిపారు. సోమవారం ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనులపై ముఖ్యమంత్రితో జరిగే సమావేశంలో ఎలా ముందుకు వెళ్ళాలో నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు. దేవాదుల ద్వారా సూర్యాపేట, తుంగతుర్తి నియోజకవర్గాలకు నీరు ఇస్తామన్నారు. 1000 కోట్లతో రైల్వే బ్రిడ్జిలు, 140 కోట్లతో దామరచర్ల వద్ద బ్రిడ్జిను నిర్మించేందుకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. గత పాలకులు 10 టిఎంసిల నీటిని జగన్‌మోహన్‌రెడ్డికి తాకట్టు పెట్టి నీటిని తరలించేలా సహకరించారన్నారు. ప్రజల మధ్యనే ఉంటూ అభివృద్ధి సంక్షేమంపై కృషి చేస్తున్నామని తెలిపారు.

## భగత్‌సింగ్ ఆశయ సాధనను
## విద్యార్థి, యువత కొనసాగించాలి



ప్రజాపక్షం/హైదరాబాద్ : భారత మాత దాస్య శృంఖలాలు తెంచేందుకు తన ప్రాణాలను తృణః ప్రాయంగా త్యాగం చేసి, ప్రతి భారతీయుడిలో విప్లవాగ్నిని రగిలించిన విప్లవ యోధుడు. భగత్ సింగ్ అని ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మ ణ్‌లు అన్నారు. ఆయన ఒక మండే అగ్నిగోళమని, జ్వలించే నిప్పు కణిక అని వారు కొనియాడారు. ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా రామ్‌కోఠిలోని భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్ దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మణికంఠ రెడ్డి, లక్ష్మ ణ్‌లు మాట్లాడుతూ పంజాబ్ ప్రాంతంలోని ఖత్కర్ కలాన్ అనే గ్రామంలో 1907 సెప్టెంబర్ 28న కిషన్ సింగ్, విద్యావతి దంపతులకు జన్మించిన భగత్ సింగ్ 3ఏళ్ల ప్రాయంలోనే తుపాకీ మొక్కలు నాటిన విప్లవ బాలుడని, 20 ఏళ్ల వయస్సులోనే బ్రిటిష్ వారిని గడగడలాడించి, 23 సంవత్సరాల వయసులోనే దేశ స్వాతంత్ర్యం కోసం తన స్నేహితులు రాజ్‌గురు, సుఖ్ దేవ్‌లతో కలిసి ఉరికొయ్యను ముద్దాడిన వీర యోధులన్నారు. వారి స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న నూతన జాతీయ విద్యా విధానానికి, విద్యా కాషాయికరణ, విద్యా ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం భగత్ సింగ్ వర్ధంతి, జయంతులను అధికారికంగా నిర్వహించాలని భగత్‌సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. భగత్‌సింగ్ ఆశయసాధనకు నేటి విద్యార్థి లోకం కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సామిడి వంశీవర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, నాయకులు హరీష్, అరుణ్, నాగుల జ్ఞానేశ్వర్, ప్రవీణ్, నితీన్, హర్ష పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి

మంత్రి పొంగులేటి
శ్రీనివాస్‌రెడ్డి
రూ.5కోట్ల
84లక్షలతో బిటి
రోడ్లకు శంకుస్థాపన



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : వర్షాకాలంలోపు చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర రెవిన్యూ, గృహనిర్మా ణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మంరూరల్ మండ లం ఏదులాపురం మున్సిపాలిటీలో విస్తృత స్థా యిలో పర్యటించారు. ఇందులో భాగంగా గుర్రాలపాడులో కాంగ్రెస్ సీనియర్ నేత కొర్ని సీతరాములు కుమార్తెను పరామర్శించారు. అలాగే గుర్రాల పాడు నుండి కొత్తనారాయణపురం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్ల 85లక్షలతో శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి వెంకటగిరి చేరుకుని అక్కడి ఎస్సీ, బీసీకాలనీ నుండి ఖమ్మం, గుదిమళ్ళ జెడ్పీరోడ్డు వరకు రూ.2కోట్ల4లక్షలతో శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి గుదిమళ్ల చేరుకుని తొర్రివాగు దొంక రైస్ మిల్లు వరకు రూ.95లక్షలతో చేపట్టిన బిటిరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుదిమళ్లలోని తిరుపతమ్మ తల్లి ఆలయంలో జరగుతున్న జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్ బాబు, కాంగ్రెస్ జిల్లా నాయకులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తి, భూక్య సురేష్‌నాయక్, జిల్లా యువజన నాయకుడు తమ్మినేని నవీన్, మండల కాంగ్రెస్ నాయకులు బానోత్ కిషోర్, వెంకటనారాయణ, ఆర్‌అండ్‌బి ఎస్ఇ హేమలత, ఆర్డీఓ నరసింహారావు, పంచాయతీరాజ్ ఇఇ వెంకట్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, తహశీల్దార్ రాంప్రసాద్, విద్యుత్‌శాఖ ఏడీ రామకృష్ణ, ఏఈ జిల్లా ప్రభాకర్‌రావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టుల పూర్తి

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ



ప్రజాపక్షం/చింతపల్లి : నల్లగొండ జిల్లాతో పాటు రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతాంగానికి సాగునీరు అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలోని సాయి సుమంగళి గార్డెన్స్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం నల్లగొండ జిల్లా 15వమహాసభకు ముఖ్య అతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ఎస్‌ఎల్‌బిసి సొరంగం పనులను, బ్రహ్మణ వెల్లంల ప్రాజెక్టు, మూసీనదిపై నిర్మించిన ధర్మారెడ్డి, పిల్లాయపల్లి బునాది కాల్వతో పాటు పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు సరిపడా నిధులు కేటాయించి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని పశ్యపద్మ అన్నారు. సుదీర్ఘ కాలంగా కరువు, ఫ్లోరిన్ పీడిత ప్రాంతంగా ఉన్న నల్లగొండ జిల్లాకు సరిపడా నిధులు కేటాయించి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కెసిఆర్ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన ప్రాజెక్టులలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు న్యాయం చేయకపోవడంతో వారు వీధిన పడ్డారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నాటి ప్రభుత్వం రైతులకు సరైన నష్టపరిహారం అందించకపోవడంతో వారి జీవితం అంధకారంగా మారిందన్నారు. నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రకటించిన రుణమాఫీ రెండు లక్షల రూపాయలపైన ఉన్న రైతులందరికీ రుణమాఫీ చేయక, అనేక కుంటి సాకులతో మాట దాటవేస్తుండడంతో రైతాంగం తీవ్ర నిరాశలో ఉందన్నారు. రైతు భరోసా నిధులు సైతం సకాలంలో విడుదల చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రైతు భరోసా, రుణమాఫీ పూర్తి స్థాయిలో షరతులు లేకుండా అమలు చేయాలని, కౌలు రైతులను గుర్తించి రుణ అర్హత కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓవైపు కాలం కాక మరోవైపు ప్రాజెక్టులలో కాలువలలో నీరు లేక రైతుల పంట పొలాలు ఎండిపోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని పెట్టుబడుదారులకు తాకట్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన మూడు నల్ల చట్టాలు రైతు సంఘాల సుదీర్ఘ పోరాట ఫలితంగా తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు 2024లో పార్లమెంటు ఎన్నికల ముందు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారని, కానీ ఆచరణలో అమలు చేయకపోగా సంస్కరణల పేరుతో రైతాంగాన్ని నిండముంచే చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు. దేశంలో వ్యవసాయరంగ సమస్యల పరిష్కారం కొరకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సూచనలు అమలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విత్తనాలు, ఎరువుల పైన సబ్సిడీలు ఎత్తివేయడంతో రైతాంగం ప్రైవేటు నాసిరకం విత్తనాలు పురుగుమందులతో మోసపోయి అప్పుల పాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఎన్నికల ముందు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం కోసం పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి మాట నిలుపుకోవాలని ఆమె హితవు పలికారు. భూమి కోసం భుక్తి కోసం రైతుల సమస్యల పరిష్కారం కోసం సమరశీల పోరాటాలు నడిపిన చరిత్ర ఆల్ ఇండియా కిసాన్ సభకు ఉందని, దేశవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పై ఉద్యమాలు చేపడుతూ రైతులను సంఘటితం చేస్తూ, రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర, మద్దతు ధర కోసం పోరాడుతున్న రాష్ట్ర రైతు సంఘానికి రైతులు, ప్రజలు బాసటగా నిలిచి భవిష్యత్తులో రైతు సంఘం నిర్వహించే పోరాటాలలో భాగస్వామ్యం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి మైనొద్దీన్, జిల్లా కార్యదర్శి గురజ రామచంద్రయ్య, కౌన్సిల్ సభ్యులు దేప సుదర్శన్ రెడ్డి, పల్లా రంగారెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, బండమీది వెంకన్న, బుర్ర శేఖర్, బిల్ల కనకయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## బిసి బిల్లు ఆమోదానికి ఏప్రిల్ 2న చలో ఢిల్లీ



ప్రజాపక్షం / ఖైరతాబాద్ : బిసిల 42శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్రం ఆమోదించాలని డిమాండ్‌చేస్తూ ఏప్రిల్ 2న నిర్వహించతలపెట్టిన 'చలో ఢిల్లీ ముట్టడి'కి వేలాదిమంది బిసిలు తరలిరావాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్ వద్ద జరిగే ఈ ముట్టడిలో 29 రాష్ట్రాల బిసిలు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని కోరారు. రాష్ట్రంలో రిజర్వేషన్ల పోరాటం ముగిసిందని, ఇక ఢిల్లీకెళ్లి కొట్లాడుతామని చెప్పారు. బిసిల సత్తా ఏంటో తెలిసేలా కేంద్రానికి రుచి చూపిస్తామని చెప్పారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో చలో ఢిల్లీ కార్యక్రమ పోస్టర్‌ను ఆయనతోపాటు బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారపు గణేశాచారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రమ్‌గౌడ్, మహిళా రాష్ట్ర అధ్యక్షులు మణిమంజిర తదితరులు ఆవిష్కరించారు. అనంతరం జాజుల మాట్లాడుతూ కేంద్రం ఏప్రిల్ 2లోపు ఈ పార్లమెంట్ సమావేశాల్లో బిసి బిల్లును ఆమోదించకపోతే ఢిల్లీలో అగ్గి రాజేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బిసి సంఘం నేతలు జనార్ధన్, శ్యాం కురుమ, సింగం గణేశ్, మహిళా సంఘం నేతలు పాల్గొన్నారు.

## తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు రావొద్దు

మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హుస్నాబాద్ : వేసవి కాలంలో నియోజకవర్గంలోని ఎక్కడ కూడ మంచినీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ బిసి, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను అదేశించారు. ఆదివారం ఆయన నియోజకవర్గంలోని కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట జిల్లాల అడిషనల్ కలెక్టర్‌లతో హుస్నాబాద్ సమీకృతభవనంలో అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో ఎక్కడ కూడా మంచినీటి కొరత రాకుండా చూస్తు అలాగే వరికోతలు ప్రారంభం కానున్న సందర్భంగా ప్యాడి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు సిద్ధంగా ఉండాలని అధికారులను కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు కొరత లేకుండా అవసరం అనుకుంటే ప్రయివేటు ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అలాగే కరెంటు కొరత లేకుండ చూడాలని అన్నారు. అలాగే ప్రభుత్వం ప్రవేశపెడుతున్న రాజీవ్ యువశక్తి పథకంలోని లబ్దిదారుల ఎంపిక, ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అధికారులు సమన్వయంతో నిజమైన పేదవారికి లబ్ది చేకుర్చేందుకు పని చేయాలని అన్నారు. అనంతరం పట్టణంలోని రూ.45లక్షలతో ఏర్పాటు చేసి వైశ్యభవనంలో ఏసి కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెర్లు, ఇంజనీర్ అధికారులు, తహశీల్దార్, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## మనువాదంలోనే అసమానతలు



ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న
'డీలిమిటేషన్' సమాఖ్య
స్ఫూర్తిపై దాడే : ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాపక్షం/హన్మకొండ ప్రతినిధి : ప్రపంచంలో ఏ మతంలో మనుష్యుల మధ్య అసమానతలు లేవని, కేవలం మనువాదంలోనే అసమానతలున్నాయని వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న అన్నారు. ఆదివారం హన్మకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో జరిగిన ఎస్ఎఫ్ఐ ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళనానికి ఎస్ఎఫ్ఎ మాజీ నాయకులు డాక్టర్ రంగారావు, సారంపల్లి వాసుదేవ రెడ్డి, ఈసంపల్లి బాబు, అరుణశ్రీలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ఈ సమ్మేళనానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న మాట్లాడుతూ మతం పేరిట జరుగుతున్న దౌర్జన్యాన్ని ఎండగట్టాలన్నారు. మనువాదాన్ని ఓడించడానికి ఎస్సీలు, బీసీలు మాత్రమే కాదని, అగ్రవర్ణాల్లోని ప్రగతిశీల భావాలున్న వారందరినీ కలుపుకుపోవాలన్నారు. ప్రస్తుతం కులం పిచ్చి పెరిగిందన్నారు. కుల రహిత సమాజాన్ని కోరుకోవాలన్నారు. శ్రామిక ప్రజలతో నడవడమే చైతన్యమన్నా రు. వారంలో ఒక్కరోజన్న మీ బిడ్డల్ని పని చేయమని చెప్పండని కోరారు. మనిషిగా సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు.

**డీలిమిటేషన్ భారత సమాఖ్య స్ఫూర్తిపై దాడి : ప్రొఫెసర్ డాక్టర్ కె.నాగేశ్వర్**



కేంద్రం చేయాలను కుంటున్న డీలిమిటేషన్ భారత సమాఖ్య స్ఫూర్తిపై దాడిగా మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ అభివర్ణించారు. చెన్నైలో డిలిమిటేషన్‌పై ఒక సమావేశం జరిగిందని, డీలిమిటేషన్ దేశ సమాఖ్య స్ఫూర్తిపై దాడి చేస్తుందని, ఈ దాడిని ఏ శైలిలో ప్రజలకు వివరించగలం? అని ప్రశ్నించారు. భిన్నత్వంలో ఏకత్వం అనేది భారతదేశ ఔన్నత్యాన్ని చాటిందని, అలాంటి దేశంలో నేడు ఒకే జాతి, ఒకే మతం, ఒకే ఎన్నికలు అం టూ కొత్త విధానాలను ప్రవేశపెడుతున్నారన్నారు. మతాన్ని వ్యతిరేకించడం కాదని, మత ఉన్మాదాన్ని వ్యతిరేకించాలన్నారు. దేశంలో లౌకికవాదం, స్వేచ్ఛపై దాడి జరుగుతుందన్నారు. సమాజంలో జరిగిన ఆలోచనల సంగ్రామంలో భాగస్వాములు కావాలని ప్రొఫెసర్ నాగేశ్వర్ పిలుపునిచ్చారు. ఆధిపత్యాన్ని ప్రశ్నించడం విద్యార్థి ఉద్యమం నేర్పిందన్నారు. మానవసేవే మాధవ సేవ అని ప్రపంచంలో చాలా గ్రంధాలు చెబుతున్నాయన్నారు. ఆచరణలో మాత్రం ఇందుకు భిన్నంగా జరుగుతుందన్నారు. పుట్టుక నీది బతుకంతా సమాజానిది అని చాటి చెప్పిన కాళోజీ కళాక్షేత్రంలో ఈ సమ్మేళనం నిర్వహించుకుంటున్నామని, ఈ సమ్మేళనంలో ఒక కార్యచరణను నిర్దేశించుకొని ముందుకు కదలాలన్నారు.

**నాడు విద్యార్థి ఉద్యమాలు అంతర్జాతీయంగా జరిగాయి : జి.రాములు**

1960–70 మధ్యకాలంలో విద్యార్థి ఉద్యమాలు అంతర్జాతీయ స్థాయిలో జరిగాయని, ఫ్రాన్స్, వియత్నాం, కంపూచియలో ఉద్యమాలు పతాక స్థాయిలో జరిగాయని జి.రాములు తెలిపారు. విద్యా ర్థి ఉద్యమాలే వ్యక్తిత్వ వికాసాన్ని కలిగిస్తాయన్నారు. సమ్మేళనం ప్రారంభానికి ముందు ఎస్ఎఫ్ఐ పతాకాన్ని జి.రాములు ఆవిష్కరించారు. ఈ సమ్మేళనంలో తెలంగాణ గ్రంధాలయ పరిషత్ చైర్మన్ మహ్మద్ రియాజ్, ఎస్ఎఫ్ఐ మాజీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వీరయ్య, కెయు మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ రమేశ్. జి.రాములు. ఎ.నర్సింహారెడ్డి, డాక్టర్ పసునూరి రవీందర్, తాళ్ల నాగరాజు, కె.సారయ్య, జి.ప్రభాకర్‌రెడ్డి, సిహెచ్.రంగయ్య, టి.ఉప్పలయ్య, కోల వెంకటేశ్వర్లు, శేషగిరిరావు, రాగుల రమేష్, మేరుగు అశోక్ పాల్గొన్నారు.

## దొంగ నోట్లు ముద్రించిన ఘనత బిఆర్‌ఎస్‌దే




మోదీపై లిక్కర్ దొంగలంతా దక్షిణాది పేరుతో డ్రామాలు
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి : లిక్కర్ దొంగలంతా ఒకే చోట సమావేశమై డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. స్టాలిన్ ప్రభుత్వం రూ.వెయ్యి కోట్ల లిక్కర్ స్కాం చేసిందని, కేరళలోనూ లిక్కర్ స్కాం బయటపడిందన్నారు. ఆప్, బిఆర్‌ఎస్ నేతలు ఆల్రెడీ లిక్కర్ స్కాం చేసి జైలుకు పోయారన్నారు. వీరంతా కలిసి డీలిమిటేషన్ పేరుతో డ్రామాలాడుతూ మోదీ ప్రభుత్వంపై విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. వారంతా దేశ జీడీపికి, పార్లమెంటులో ప్రాతినిధ్యానికి లింకు పెట్టడంపై మండిపడ్డారు. నిన్న చెన్నైలో స్టాలిన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో లిక్కర్ దొంగల ముఠా ఒకే చోట సమావేశమై విచిత్రమైన తీర్మాణం చేశారని పేర్కొన్నారు. దేశ జీడీపిలో దక్షిణాది వాటా 36 శాతం ఉన్నందున పార్లమెంటులోనూ దక్షిణాదికి 36 శాతం దాకా వాటా ఇవ్వాలని అడుగుతుండడం విచిత్రంగా ఉందన్నారు. దేశ జీడీపికి పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధమేమిటని ప్రశ్నించారు? అట్లనుకుంటే తెలంగాణ జిడిపిలో వెనుకబడ్డ ఆసిఫాబాద్, ఆదిలాబాద్, ములుగు వంటి జిల్లాల ప్రాతినిధ్యం చాలా తక్కువ అని, అంత మాత్రాన అసెంబ్లీలో వాటికి ప్రాతినిధ్యం ఉండకూడదా? ఇదెక్కడి దిక్కుమాలిన ప్రతిపాదన? దక్షిణాది పేరుతో రాజకీయాలు చేస్తూ డీలిమిటేషన్‌ను అడ్డుకునే కుట్రలు చేయడమేంది? అని ఫైర్ అయ్యారు. ఆదివారం కరీంనగర్‌లోని శుభం గార్డెన్‌లో తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బండి సంజయ్ హాజరై ప్రసంగించారు. టీచర్ల దమ్మేందో తపస్ అనే ఉపాధ్యాయ సంఘం తలుచుకుంటే ఏమైతదో మొన్నటి ఎమ్మెల్సీ ఎన్నికల్లో చూపించారన్నారు. తెలంగాణ సాధనలో టీచర్ల, ఉద్యోగుల పాత్ర మరువలేమన్నారు. 42 రోజుల సకల జనుల సమ్మె చేసి తెగించి కొట్లాడి రాష్ట్రం సాధించుకున్నారని, కానీ పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనతో తెలంగాణ అప్పుల పాలయ్యింది. కెసిఆర్ కుటుంబ పాలనతో సర్వనాశనమైందన్నారు. గతంలో కెసిఆర్ మనుషులు బీదర్‌లో ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో దొంగనోట్లు ముద్రించారన్నారు. ఆ ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేసేందుకు మన రాష్ట్ర పోలీసులు వెళితే ఒత్తిడి తెచ్చి అక్కడికి వెళ్లకుండా చేశారన్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికల్లో పంచిన నోట్లన్నీ దొం గనోట్లేనన్నారు. కేంద్రం ప్రతి 6 నెలలకు ఒకసారి డీఏ ఇస్తోందని, నిత్యం మోదీపై విషం కక్కే కాంగ్రెస్ ప్రభుత్వం 5 డీఏలు ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? మరో 3 నెలలైతే జీతాలు సైతం ఇచ్చే పరిస్థితి లేదు.. టీచర్ల, ఉద్యోగుల పెండింగ్ బిల్స్ మొత్తం రూ.8 వేల కోట్లు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ బకాయిలు రూ.11 వేల కోట్లు.. పైసలు ఇవ్వమంటే డబ్బుల్లేవని చెబుతున్న ప్రభుత్వం 18 శాతం కమీషన్ ఇస్తే బిల్స్ క్లియర్ చేస్తోందన్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, డివిజన్-14, జిహెచ్ఎంసి. GHMC
NIT No. 65/E.E.14/GHMC/2024-25 తేది: 22.03.2025
పని పేరు: జిహెచ్ఎంసి, కెజెడ్, గోషామహల్, సర్కిల్ 14 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు. అంచనా విలువ: రూ.59.78 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: 24.03.2025న ఉ.11.00గం.ల నుండి 27.03.2025న ఉ.11.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ – 14, జిహెచ్ఎంసి, 5వ అంతస్తు, అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ 14, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. 12083-PP/CL/ADVT/1/2024-25, Date: 23-03-2025

# సాహితీ విహారి

# సాహిత్యానికి రాజకీయ రంగు!

దేశంలో భావ ప్రకటనా స్వేచ్ఛకు సంకెళ్లు పడుతున్నాయి. సాహిత్యాన్ని కూడా రాజకీయం చేసే వికృత సంస్కృతి తిష్టవేసింది. సాహితీకారులపై ఆంక్షల కొరడా బహిష్కృత బంగ్లాదేశీ రచయిత్రి తస్లిమా నస్రీన్ విషయంలో మోదీ సర్కారు అనుసరిస్తున్న వైఖరే ఇందుకు నిదర్శనం. నిజానికి సమాజంలోని సంఘటనలపై స్పందించే హక్కు అందిరికీ ఉంది. తమ అభిప్రాయాలు చెప్పేవారిని మతాల పరంగా, కులాల పరంగా విడదీయడానికి వీల్లేదు. హేతువాదాన్ని వినిపించడం నేరం కానేకాదు. స్త్రీవాదాన్ని వినిపించడం తప్పిదమనడానికి వీల్లేదు. కానీ, ఇవి కేవలం మాటలకు, కాగితాలకు మాత్రమే పరిమితమైన ఊహాచిత్రం. వాస్తవ పరిస్థితులు దీనికి భిన్నంగా ఉన్నాయి. ఇటీవల పార్లమెంటులో ప్రసంగించిన బిజెపి రాజ్యసభ సభ్యుడు సమిక్ భట్టాచార్య కొత్త డిమాండ్‌కు తెరలేపారు. తస్లిమా నస్రీన్‌ను ఢిల్లీ నుంచి సురక్షితంగా కోల్‌కతాకు పంపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆమె ప్రమేయం లేకుండా, అభిప్రాయం తెలుసుకోకుండా భట్టాచార్య చేసిన సూచన ఇప్పటికే పలురకాల వివాదాల్లో చిక్కుకున్న తస్లిమా నస్రీన్‌ను మరో సమస్యల్లోకి నెట్టడం ఖాయంగా కనిపిస్తున్నది. మానవహక్కుల కార్యకర్తగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె, మత ఛాందసవాదులు తన తలకు వెలకట్టిప్పటికీ తల వంచలేదు. అభిప్రాయాలు మార్చుకోలేదు. విమర్శలను, బెదిరింపులను తట్టుకొని నిలబడ్డారు. 1992లోబాబ్రీ మసీదు కూల్చివేతకు ప్రతిస్పందిస్తూ బంగ్లాదేశ్‌లో హిందువులపై ముస్లింలు జరిపిన దాడులకు వ్యతిరేకంగా ఆమె రాసిన 'లజ్జా ' నవల వివాదస్పదమైంది. మతవాదులు ఆమెను హత్య చేస్తామని బెదిరించారు. తమె తలకు రివార్డు కూడా ప్రకటించారు. బంగ్లాదేశ్ లోని మైమెన్సింగ్‌లో 1962, ఆగస్టు 25న జన్మించిన ఆమె, మతాలకు అతీతంగా వ్యవహరించారు. హేతువాదిగా, నాస్తికురాలిగా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించేవారు. వైద్య విద్యను పూర్తి చేసిన ఆమె 1994 వరకు ప్రభుత్వ డాక్టర్‌గా విధులు నిర్వహించారు. ఆ తర్వాత రచనారంగం వైపు వచ్చారు. 1990 నుంచి తన అభ్యుదయవాద రచనలతో ప్రపంచ ప్రసిద్ధి పొందారు. బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత బంగ్లాదేశ్‌లో జరిగిన ఘటనలు ఆమెను కదిలించివేశాయి. ఒక మతం వారు మరో మతానికి చెందిన వారిపై మానవత్వం లేకుండా దాడులు చేసిన ఘటనలను ఉదహరిస్తూ ఆమె రాసిన 'లజ్జ' నవల ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మందిని ఆకట్టుకుంది. అయితే, అదే సమయంలో మత ఛాందసవాదులు ఈ నవలను వ్యతిరేకించారు. కాపీలను తగులబెట్టారు. ఆమెను హతమార్చాలంటూ ఫత్వా కూడా జారీ చేశారు. 1994లో బంగ్లాదేశ్ నుంచి బహిష్కరణకు గురైన తస్లిమా నస్రీన్ కొంతకాలం ఐరోపా దేశాల్లో, అమెరికాలో ఉన్నారు. ఓ దశాబ్దం తర్వాత, 2004లో భారత్‌కు వచ్చి, కోల్‌కతాలో నివాసం ఉన్నారు. ఆమె రాసిన 'ద్విఖండిత' కూడా మతవాదుల ఆగ్రహానికి కారంమైంది. అందులోని కొన్ని అంశాలు వివాదాస్పదంకావడంతో, 2007 నవంబర్‌లో కోల్‌కతా నగరంలో పెద్దఎత్తున అల్లర్లు చెలరేగాయి. దీనితో ఆమె కొంతకాలం జైపూర్ వెళ్లారు. అనంతరం ఢిల్లీకి చేరారు. ఇప్పుడు ఢిల్లీ నుంచి తిరిగి కోల్‌కతా పంపాలన్నది భట్టాచార్య సూచన. బంగ్లాదేశ్‌లో చోటు చేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో, కేవలం రాజకీయ లబ్ధి కోసమే ఆమెను కోల్‌కతా రప్పించేందుకు భట్టాచార్య ప్రయత్నిస్తున్నారన్న వాదన వినిపిస్తున్నది. పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో తస్లిమా నస్రీన్ పరోక్షంగా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేశారు. ఢిల్లీ నుంచి కోల్‌కతాకు మకాం మార్చడం ఆచరణ సాధ్యం కాదని తేల్చిచెప్పారు. 'కేంద్రం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలు కోల్‌కతాలో జరిగే సాహిత్య కార్యక్రమాలు, పుస్తక ప్రదర్శనలకు హాజరు కావడానికి అనుమతిస్తే చాలు. ఇలాంటి కార్యక్రమాలతో నాకు బలమైన అనుబంధం ఉంది' అంటూ భావోద్వేగ బంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'నా సాహిత్య మరియు ప్రపంచ దృక్పథాల కారణంగా వారి సరిహద్దుల్లో నా ఉనికిని చూసి కొన్ని రాజకీయ శక్తులు ఇబ్బంది పడుతున్నాయి. అందుకే, నన్ను ఫుట్‌బాల్ లాగా తంతున్నాయి. నా జీవితంలోని ఈ దశలో, బంతిగా అటూఇటూ పరుగులు తీయడం నాకు ఇష్టం లేదు. నాకు తరచు ఆహ్వానాలు అందుతుంటాయి. అలాంటి సాహిత్య ఉత్సవాలు, పుస్తక ప్రదర్శనలు, ఇతరత్రా కార్యక్రమాలకు హాజరయ్యేందుకు అటు కేంద్రంగానీ, ఇటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వంగానీ అడ్డంకులు సృష్టించకపోతే చాలు. అంతకు మించి నేను ఏమీ కోరుకోవడం లేదు' అని ఆమె స్పష్టం చేశారు. వృత్తిరీత్యా గైనకాలజిస్ట్ అయిన తస్లిమా నస్రీన్‌కు అన్యాయాలపై, అక్రమాలపై, దౌర్జన్యాలపై స్పందించడం ప్రవృత్తి. 'లజ్జ', 'ద్విఖండిత' వంటి రచనలు ఆమెకు సాహితీ ప్రపంచంలో సుస్థిర స్థానాన్ని సంపాదించిపెట్టాయి. కానీ, మత ఛాందసుల ఆగ్రహానికి గురయ్యాయి. అందుకే విమర్శలు... బెదిరింపులు... ఫత్వాలు... దాడులు. నిజానికి ఆమె ఇస్లాంను కాదు... మతం పేరుతో సాగుతున్న అరాచకాలను, ప్రత్యేకించి మహిళలపై జరుగుతున్న దాడులను విమర్శించారు. వ్యతిరేకించారు. వాటికి విరుద్ధంగా గళమెత్తారు. తన రచనల ద్వారా ఛాందసవాదాన్ని సవాలు చేశారు. హేతువాదాన్ని ప్రచారం చేశారు. ఇప్పుడు బిజెపి తస్లిమా నస్రీన్‌ను పశ్చిమ బెంగాల్‌కు పంపడం ద్వారా, ఆమెను 'ఇస్లాం వ్యతిరేకి'గా అభివర్ణించి, హిందూ మద్దతురాలిగా తెరపైకి తెచ్చే ప్రయత్నం జరుగుతున్నదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆమెకు రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవడానికి రంగం సిద్ధమవుతున్న అనుమానాలు కూడా ఉన్నాయి. కానీ, తస్లిమా నస్రీన్ మాత్రం కోల్‌కతా వెళ్లేందుకు సుముఖత వ్యక్తం చేయలేదు. 'నాకు రాజకీయాలు అర్థం కాలేదు. నాకు ఏ రాజకీయ నాయకుడితోనూ సంబంధాలు లేవు. గతంలో నేను కాషాయ శిబిరం నుండి సాహిత్య అవార్డుల ప్రతిపాదనలను కూడా తిరస్కరించాను' అని పిటిఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె తేల్చి చెప్పారు. తనను బంగ్లాదేశ్, పశ్చిమ బెంగాల్‌గా మారిన నాటి బెంగాల్ ప్రాంతం నుంచి బహిష్కరించిన తర్వాత, గత 18 ఏళ్లలో చాలా తక్కువ మంది మాత్రమే ఈ అంశాన్ని ప్రస్తావించారని చెప్పారు. తనను బలవంతంగా ఎందుకు బహిష్కరించారని ఎవరూ ప్రశ్నించకపోవడం, ఈ విషయాన్ని అసలు ప్రస్తావించకపోవడం ఎంతో బాధకలిగిస్తున్నదని చెప్పారు. 'భట్టాచార్య రాజకీయ అనుబంధాలు పట్ల నాకు ఎలాంటి ఆసక్తి లేదు. అయితే, ఒక మనిషి మరొకరి కోసం మాట్లాడటం, ఒక బెంగాలీ మరో బెంగాలీ కోసం తన స్వరాన్ని పెంచడం నాకు ఆనందంగా ఉంది. కానీ, ఒక రాజకీయ నాయకుడు తన రాజకీయాల కోసం చేస్తున్న ప్రతిపాదనను అంగీకరించడానికి నేను సిద్ధంగా లేను' అని ప్రకటించారు. తస్లిమా నస్రీన్ మతానికి కాదు... మతం పేరుతో జరిగే అకృత్యాలకు వ్యతిరేంగా రచనలు చేశారు. మత విశ్వాసాలను పక్కకుపెట్టి, తాను చనిపోయిన తర్వాత తన శవాన్ని న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కు దానం చేస్తున్నట్టు ప్రకటించారు. 'మతం కన్నా మానవత్వమే మిన్న' అనే సిద్ధాంతాన్ని అనుసరించారు. లౌకికవాదాన్ని వినిపిస్తున్న ఒక రచయిత్రిని బంగ్లాదేశ్ బహిష్కరించడం... మన దేశంలోనూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పరుగులు తీయించడం దారుణం. నాస్తికత్వం ఆమె ఇష్టం. కాదనే హక్కువ ఎవరికైనా ఎవరిచ్చారో అర్థం కాదు. అవకాశవాదిగా మారకపోవడమే తస్లిమా నస్రీన్ చేసిన పాపమా? లౌకిక వాదాన్ని వినిపించడమే ఆమె చేసిన నేరమా? దాడులకు భయపడకపోవడం... దాడులకు బెదరకపోవడం ఆమె చేసిన ఘోరమా? తస్లిమా నస్రీన్ ఆలోచనలను సమ్మతించి, సిద్ధాంతాలను గౌరవించి, రచనలను ఆస్వాదించి, ఆమె మేలు కోసమే ఢిల్లీ నుంచి కోల్‌కతాకు పంపాలని ఎవరైనా కోరితే అభ్యంతరం ఏముంటుంది? కానీ, ఇక్కడ జరుగుతున్నది అదికాదు. బిజెపికి ఆమెపై సానుభూతి లేదు. లౌకికవాదానికి వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్న ఒక రాజకీయ పార్టీ, అదే లౌకిక వాదాన్ని బలంగా వినిపించే రచయిత్రిని సమర్థించడంలో స్వార్థానికి తావులేదని చెప్పలేం. ఆమె కూడా తనను రాజకీయాల్లోకి లాగవద్దని కోరారు. ఆమె కోరికను మన్నించి... ఇబ్బంది కలిగించకపోవడమే మంచిది.

బంగ్లాదేశ్ నుంచి బహిష్కృతురాలైన తస్లిమా నస్రీన్ గొప్ప రచయిత్రి.. అంతకంటే ముందు గొప్ప మానవతావాది. రచయిత్రిగా, కవయిత్రిగా, కాలమిస్టుగా కీర్తిప్రతిష్టలు ఆర్జించారు. బేగమ్ రొఖయ్యా, సాల్మన్ రష్దీ తదితరుల ప్రభావం ఆమె రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె రచయిత్రిమాత్రమేకాదు.. స్త్రీవాద మానవ హక్కుల కార్యకర్త, సెక్యులర్ వాది కూడా. తస్లిమా ముస్లిం కుటుంబంలో పుట్టి, ముస్లింగా పెరిగినప్పటికీ చదువు, వయస్సు పెరిగే కొద్దీ ఆమె హేతువాదిగా, నాస్తికురాలిగా మారారు. కొంతకాలం బంగ్లాదేశ్ ప్రభుత్వ వైద్యురాలిగా పనిచేశారు. 1990 నుండి తన అభ్యుదయ వాద రచనలతో అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించారు. 1994లో స్వేచ్ఛా అభిప్రాయాలకు గాను యూరోపియన్ పార్లమెంటు నుంచి సఖరోవ్ బహుమతిని, 1996లో మానవతా అవార్డు పొందారు. 'ది గేమ్ ఇన్ రివర్స్' పేరుతో ఆమె కవితలు, వ్యాసాల సంపుటి 1995లో విడుదలైంది. 'షికోరే బిపుల్ ఖుధా', 'నిర్బాషితో బాహిరే ఓంతొరే', 'అమర్ కీచూ జాయే అషే నే', 'అతోలే ఓంతొరిన్', 'బేహులా ఏక భాషియేచిలో భేల', 'ఆయ్ కొస్టో ఝేపే, జీబొన్ దేభో మేపే' వంటి ఎన్నో కవితలు తస్లిమా అభ్యుదయ భావాలకు, స్త్రీవాదానికి, నాసికత్వానికి ప్రతీకలు. ఆమె నవలల్లో 'లజ్జ' విశేష ఆదరణ పొందింది. 'ఒపోర్‌పొఖ్ఖో', 'శోధ్' (ప్రతీకారం), 'నిమొంత్రణ్' (ఆహ్వానం), 'ఫేరా' (పునరాగమనం), 'భ్రొమొర్ కైయో గియా' (అతనికి రహస్యం చెప్పు), 'ఫారాషీ ప్రేమిక్' (ఫ్రెంచి ప్రేమికుడు) తదితరాలు తస్లిమాకు ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టారు. ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న తస్లిమాను రాజకీయ ప్రయోజనాలకు వాడుకునే ప్రయత్నం మంచిది కాదు.

## ప్రతి మనిషీ వినాల్సిన 'పిలుపు'

వచన, గేయ కవిత్వ ప్రక్రియల్లో రచనలు చేస్తూ సాగిపోతున్న నేటి తరం కవుల్లో ఒకడు అమృత రాజు. అమృత అతని ఇంటి పేరు, రాజు అతని పేరు. అతను విద్యార్థి ఉద్యమాల్లోంచి కవిగా రూపొందాడు. 2024 ఫిబ్రవరిలో తన మొదటి కవితల సంపుటి 'పిలుపు'తో సాహిత్యరంగంలోకి దూసుకొచ్చాడు. తన కూతురు జీతనకు అంకితమిస్తూ వెలువరించిన ఈ పుస్తకానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. ఇది వచన, గేయ కవితల మిశ్రమం. 45 కవితలున్న ఈ పుస్తకంలో 77% వచన కవిత్వం, 23% గేయకవిత్వం ఉంది. ప్రతి కవితకు తగిన చిత్రాన్ని జోడించి ముద్రించాడు. కవి ఇందులో తన కవిత్వాన్ని స్పష్టంగా విభజించాడు. స్మృతి కవితలన్నీ ఒక దగ్గర, వ్యక్తిగత జీవితానుభవాల్లోంచి రాసిన కవితలన్నీ ఒక దగ్గర, నిరుద్యోగం మీద రాసినవన్నీ ఒక దగ్గర.. ఇలా అన్నమాట.

పుస్తకం వెనుక అట్ట మీదున్న అతని రెండు వాక్యాలు మనకు అతని కవిత్వ నేపథ్యాన్ని చెప్తాయి. ఆ రెండు వాక్యాలేమిటంటే 'కనులది కాదు నా కవిత/ హృదయానిది/ దాని దుఃఖానిది/ సొంతానిది కాదు నా కవిత/ సమిష్టిది/ సమసమాజానిది'. కవి దేని కోసం పరితపిస్తూ ఈ కవిత్వం రాసాడో అర్థమైపోతుందీ మాటతో. ఈ పుస్తకానికి ఒక సీనియర్ కవి(వడ్డెబోయిన శ్రీనివాస్), ఒక జూనియర్ కవి(వి. దిలీప్) ముందుమాటలు రాయడం కూడా ఓ ప్రత్యేకతే. రచయిత ఈ పుస్తకంలోని తన మాటలో తన ఈ కవిత్వం గురించి 'నా తరానికి యాది.. మరో తరానికి పిలుపు' అని ప్రకటించుకున్నాడు.

ఇక పుస్తకంలోని కవిత్వం విషయానికొస్తే ఇది 2015 నుండి 2023 మధ్యకాలంలో అంటే 8 సంవత్సరాల్లో రాసింది. దాదాపుగా ఇందులోదంతా సామాజిక కవిత్వమే.

పుస్తకం తెరువగానే 'అవ్వా...' అనే శీర్షికతో కనబడే మొదటి కవిత తన తల్లి గురించి రాసుకున్నది. కవిత మొదట్లోనే 'దుఃఖాన్ని దుక్కిలో వోసి/ కొడవలితో పొక్కిలి జేస్తూ/ నేను చూసి ఏడుస్తానని/ కొంగు చాటుగా నవ్వి/ పలకరించిన అవ్వా.../ నీ మట్టికాళ్ళకు దండాలే' అంటూ తన అవ్వకు నమస్కరిస్తాడు. కవి అలిశెట్టి ప్రభాకర్ గురించి రాసిన ఓ స్మృతి కవితలో 'దేశ పేదరికమంతో/ నాలుగు వాక్యాల్లో/ జోకినోడు' అంటాడు. చరిత్ర తెలుసుకోకుండా వైభవంగా జరుపుకుంటున్న మహిళా దినోత్సవాన్ని ఉద్దేశించి రాసిన 'సమీక్ష' అనే కవితలో 'చేయాల్సిందిప్పుడు/ ఉత్సవం కాదు/ సమీక్ష/ గతానికైన గాయానికి/ వర్తమాన శిక్షకి/ భవిష్యత్ బాధకి/ సవివరమైన సమీక్ష' అని చెప్తాడు. ప్రయివేటు యూనివర్సిటీలు పెరిగిపోతున్న దుస్థితిని తెలుపుతూ రాసిన 'రండి బాబో.. రండి' కవితలో సర్కార్ మీద వ్యంగ్యంగా దుమ్మెత్తిపోస్తాడు. ఆరు ఖండికలుగా ఉన్న 'గీతాన్ని సృష్టిద్దాం' కవిత విశేషమైనది. ఇందులో మొదటి మూడు ఖండికలు ప్రేమ కవితా ఖండికల్లా ధ్వనిస్తాయి. నాలుగో ఖండిక నుండి కవిత సామాజికమైపోతుంది.

నిరుద్యోగం ఈ దేశంలో యువతను పట్టి పీడిస్తున్న అతి పెద్ద సమస్య. ఇందుకు జనాభా పెరుగుదల ఒక కారణమైతే ప్రధాన కారణం సరైన ప్రణాళికలు రూపొందించని ప్రభుత్వ యంత్రాంగం. ఈ నేపథ్యంలోంచి ఒక నిరుద్యోగ యువకుడిగా తన ఆవేదనను, తనలాంటి ఎందరో యువకుల ఆవేదనను 'మరోసారి నినదిస్తా' అనే కవితగా రాశాడీ కవి. 'నిరుద్యోగం/ నేనే నేరం జేయకున్నా/ నా తప్పేమీ లేకున్నా/ అయ్యవ్వకు, ఊరుకు, సోపతిగానికి/ పరాయిని చేసింది/ పనికిరానివాడిగా/ పంచాయితీలో నిలబెట్టి/ పరువు తీస్తున్నది' అంటూనే అప్పుడు స్వరాష్ట్రం కోసం నినదించినవాణ్ణి ఇప్పుడిక నౌకరి కోసం నినదిస్తానంటూ ధైర్యాన్ని ప్రదర్శిస్తాడు. ఈ కవిత నిరుద్యోగిగా ఉన్న ప్రతి యువకుడి గుండెకు బలంగా తాకుతుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

ఇక 'మనిషీ..' అనే కవితలో మనిషీ... అంటూ పిలుస్తూనే 'నీకు లేదు మరుజన్మ/ దేవుడు, దయ్యం ఖర్మ/ మనువారసుల దోపిడీ పరికరాలవి/ ఊపిరాగి నేలపై పడేదాకా/ కాటే శాయని తెల్వదు' అని చాలా మంది ఒప్పుకోని నిజాన్ని, వ్యతిరేకించే వాస్తవాన్ని కుండబద్దలుగొట్టినట్లుగా నిర్భయంగా చాటాడు. ఓ కవితలో 'మట్టికి విప్లవకారుడంటే ప్రేమ కదా/ ప్రతి విత్తనమూ తలెత్తుతుంది/ ఆ యోధున్ని చూడాలని' అంటాడు. ఎంత గొప్ప ఊహ ఇది.

తెలంగాణ రాష్ట్ర సాధనోద్యమంలో విద్యార్థుల పై పెట్టిన అక్రమ కేసులను నిరసిస్తూ, వాటిని ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ 'ఆనాటి బంధీలం... మేం నేటికి ఖైదీలం' అని సాగే పాట రాసాడు. అధికారులను ధిక్కరిస్తూ విద్యార్థి నాయకులు మాట్లాడినట్టుండే ఈ పాట మనలో పౌరుషాన్ని రగులుస్తుంది. 'మల్లెల్లో మంచి మల్లెల్లో/ ఎర్రమట్టిగుట్ట నీడల్లో' అంటూ మొదలవుతూ సాగే పాట మల్లంపల్లి మండల సాధనకై ప్రజానాయకులు చేసిన కృషిని కళ్ళ ముందు ఉంచుతుంది. అంత్యానుప్రాస అలంకారాలతో ఉండే ఈ పాట మనల్ని బాగా ఆకట్టుకుంటుంది. 'కదలిరా..' అనే శీర్షికతో పుస్తకంలో చివరగా ఉన్న పాటలో 'శాస్త్రీయ విద్యకై పోరు జేద్దము/ సమాజ మార్పుకై దారు లేద్దము/ కదలిరా విద్యార్థి కదలిరా' అంటూ చైతన్య పరుస్తాడు.

ఇంకా ఈ పుస్తకంలో పలువురు మహనీయుల మీద, వివిధ సామాజిక అంశాల మీద రాసిన వచన కవితలతో పాటు; మే డే, ఢిల్లీ రైతుల పోరు, స్త్రీ విముక్తి మొదలగు సామాజిక అంశాల మీద రాసిన పలు పాటలున్నాయి. ఇందులో రెండు అనువాద రచనలు కూడ ఉన్నాయి. ఇవి ఇంగ్లీష్ నుండి తెలుగులోకి కవి ద్వారా అనువాదమయిన పాలస్తీనా విముక్తి గీతాలు.

ఇలా భిన్న అంశాలతో, అందరికీ అర్థమయ్యే సులభ శైలిలో ఈ పుస్తకాన్ని రచించిన కవి అభినందనీయుడు. అతని పిలుపు ప్రతి మనిషీ వినాల్సింది. ఈ పిలుపు మరో తరానికి అందాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

కార్తీక రాజు, 8977336447








## 'జ్ఞానపీఠం'పై నిలిచిన 'శుక్లా'

భారతదేశ అత్యున్నత సాహిత్య పురస్కారమైన జ్ఞానపీఠ్ అవార్డును సాహిత్యం, సృజనాత్మకత, విలక్షణమైన రచనా శైలిలో అద్భుతమైన చేసిన కృషికి గాను ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చిన్న కథా రచయిత, కవి, వ్యాసకర్త, సమకాలీన రచయితలలో ఒకరైన ప్రముఖ హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 59వ గ్రహీతగా ఎంపికయ్యారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా నిలిచారు. ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయితగా శుక్లా గుర్తింపు పొందారు. జ్ఞానపీఠ్ అవార్డు ఎంపిక సందర్భంగా వినోద్ కుమార్ శుక్లా మాట్లాడుతూ 'ఇది ఒక పెద్ద అవార్డు అని, ఈ అవార్డు తన బాధ్యతను కూడా గుర్తిస్తుందని', తనకు ఇలాంటి గుర్తింపు లభిస్తుందని ఎప్పుడూ ఊహించలేదంటూ శుక్లా ఆనందం వ్యక్తం చేశారు. 'నేను జీవితంలో చాలా చూశాను, చాలా విన్నాను, చాలా అనుభవించాను. కానీ నేను కొంచెం మాత్రమే రాయగలిగాను. నేను ఎంత రాయాలో ఆలోచించినప్పుడు చాలా మిగిలి ఉన్నట్లు అనిపిస్తుంది. నేను సజీవంగా ఉన్నంత వరకు, నా మిగిలిన రచనలను పూర్తి చేయాలనుకుంటున్నాను కానీ నా పనిని పూర్తి చేయలేకపోవచ్చు ! దీని కారణంగా నేను చాలా సందిగ్ధంలో ఉన్నాను. నా రచన ద్వారా నా జీవితాన్ని కొనసాగించాలనుకుంటున్నాను. కానీ నా జీవితం వేగంగా ముగింపుకు చేరుకుంటోంది, మరి అంత త్వరగా ఎలా రాయాలో నాకు తెలియదు కాబట్టి నేను కొంచెం విచారంగా ఉన్నాను' 88 ఏళ్ల ఆయన అన్నారు. ఈ గుర్తింపును ఒక బాధ్యతగా అభివర్ణించారు.

### వ్యవసాయంలో పట్టా:

శుక్లా 1 జనవరి 1937న ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్‌లో జన్మించారు. జబల్‌పూర్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ కృషి విశ్వ విద్యాలయం నుండి వ్యవసాయంలో యం.యస్సీ పూర్తి చేశారు. ఆ తర్వాత రాయ్‌పూర్‌లోని వ్యవసాయ కళాశాలలో లెక్చరర్‌గా చేరారు. ఆయన కవి ముక్తిబోధ్ చేత చాలా ప్రేరణ పొందారు. ఆయన అప్పట్లో రాజ్‌నందగావ్‌లోని దిగ్విజయ్ కళాశాలలో హిందీ లెక్చరర్‌గా పనిచేశారు.

### ప్రయోగాత్మక రచనలు:

ఆయన మొదటి కవితా సంకలనం, 'లగ్‌భాగ్ జై హింద్', 1971లో ప్రచురించబడింది. వాహ్ ఆద్మీ చలా గయా నయా గరం కోట్ పెహంకర్ విచార్ కీ తరాహ్ ఆయన రెండవ కవితా సంకలనం. నౌకర్ కీ కమీజ్ (ది సర్వెంట్స్ షర్ట్) ఆయన రాసిన మొదటి నవల. 'ఖిలేగా తో దేఖేంగే', 'దీవార్ మే ఏక్ ఖిడ్కి', ఉత్తమ హిందీ నవలలుగా చాలా ప్రజాదరణ పొందాయి. చిన్న కథల సంకలనం పేడ్ పర్ కమ్రా (రూమ్ ఆన్ ది ట్రీ), సబ్ కుచ్ హోనా బచా రహేగా, మహావిద్యాలయ లాంటివి ఇతర కవితా సంకలనాలు. ఆకాశ్ ధరీ కో ఖటక్తా హై కవితా సే లంబీ కవితా లు అతని కవితలు. శుక్లా పిల్లల కోసం పుస్తకాలు కూడా రాశారు. దాదాపు యాభై ఏళ్లుగా సాహిత్య రచనలో నిమగ్నమై ఉన్నారు. ఆధునిక హిందీ సాహిత్యంలో ప్రయోగాత్మక రచనల కొత్త స్రవంతికి మార్గదర్శకుడు. తన కవితలు, కథలు రోజువారీ జీవితంలోని సూక్ష్మ నైపుణ్యాలను సంగ్రహించి, సామాన్యుడి భావోద్వేగాలను, సమాజంలోని సంక్లిష్టతలను హృదయపూర్వకంగా వ్యక్తపరుస్తాయి. వినోద్ కుమార్ శుక్లా కవితలు విస్తృతంగా అనువదించబడ్డాయి. 2015లో ఢిల్లీకి చెందిన రచయిత అఖిల్ కత్యాల్ శుక్ల 'హతాషా సే ఏక్ వ్యక్తి బైత్ గయా'ని ఆంగ్లంలోకి అనువదించారు.

### అవార్డులు:

1999లో ఉత్తమ హిందీ రచనగా సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్న దీవార్ మే ఏక్ ఖిర్కీ రహతి థి ( ఒక విండో నివసించిన గోడ ) ఉన్నాయి. ఈ నవలను నాటక దర్శకుడు మోహన్ మహర్షి రంగస్థల నాటకంగా రూపొందించారు. ఆయన అనేక ప్రతిష్టాత్మక ప్రశంసలను, ఎన్నో అవార్డులు అందుకున్నారు. వీటిలో గజానన్ మాధవ్ ముక్తిబోధ్ ఫెలోషిప్, రజా అవార్డు ఉన్నాయి. ఆయన రచనలలో నౌకర్ కీ కమీజ్. దీనిని మణి కౌల్ అదే పేరుతో సినిమాగా రూపొందించారు.

### అత్యున్నత పురస్కారం:

భారతదేశపు సాహితీ పురస్కారాల్లో జ్ఞానపీఠ పురస్కారం అత్యున్నతమైంది. దీన్ని టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తా పత్రిక వ్యవస్థాపకులైన సాహుజైన్ కుటుంబం ఏర్పాటు చేసిన భారతీయ జ్ఞానపీఠం వారు ప్రదానం చేస్తారు. వాగ్దేవి కాంస్య ప్రతిమ, పురస్కార పత్రం, పదకొండు లక్షల రూపాయల నగదు ఈ పురస్కారంలో భాగం.1964లో నెలకొల్పబడిన ఈ పురస్కారం మొదటిసారిగా ' ఒడక్కుళల్ ( ది వెదురు వేణువు )' కవితా సంకలనంకు గాను మలయాళ రచయిత జి శంకర కురుప్‌కు 1965లో వచ్చింది. 1976లో బెంగాలీ రచయిత్రి ఆశాపూర్ణ దేవి ఈ బహుమతిని గెలుచుకున్న మొదటి మహిళగా నిలిచారు. 2019 లో, అమితవ్ ఘోష్ ఈ అవార్డును అందుకున్న మొదటి ఆంగ్ల రచయిత అయ్యారు. భారతీయ అధికార భాషలలో దేనిలోనైనా రాసే భారత పౌరులు ఈ బహుమతికి అర్హులు. 1982 నుండి ఈ పురస్కారాన్ని ఒక నిర్దిష్ట రచనకు కాకుండా, సాహిత్యానికి రచయిత చేసిన మొత్తం కృషికి ఇస్తున్నారు. ఒక భాషకు ఒకసారి అవార్డు లభించిన తర్వాత, ఆ భాష తదుపరి రెండు సంవత్సరాల వరకు అవార్డుకు అర్హత పొందదు. ఈ అవార్డు భారత రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చబడిన భారతీయ భాషలలో, ఆంగ్లంలో వ్రాసే భారతీయ రచయితలకు మాత్రమే ఇవ్వబడుతుంది. మరణానంతరం ఎటువంటి ప్రధానం ఉండదు.

జనక మోహన రావు దుంగ
ఫోన్: 8247045230

ఈ వారం కవితలు

## పోకడ

నడుస్తున్న నీవు
నడుస్తున్న దాన్ని చుట్టే చూడు
అపసవ్యాన్ని ప్రశ్నించటం నేర్చుకో
హేతువు లేనిదల్లా అపసవ్యమే!

గమ్యం కడు అందంగా వుంటుందని
కలలు కనకు
ఉన్మాదం నీ చుట్టూ పరిభ్రమిస్తుంది
దాన్ని వలయం లో చిక్కుకోకు

వెనక్కి నడిచి నీది కాని రోజుల్లో
ఏం జరిగిందో నీకు తెలియదు
తెలుసుకునే ప్రయత్నం చేయవు
ఎవడేది చెబితే అదే నిజమని నమ్మి
నవ్వుల పాలు కాకు

ఎవడో ఏదో సినిమా తీసి
రెచ్చగొట్టితే తవ్వుతామనే మౌఢ్యం లో నువ్వు
రాజ్యం అండతో పేట్రేగుతున్నావు
రాజుల చరిత్రంతా వారసులఖైదు
బహుభార్యా విలాసం
మతంలేదు కులం లేదు
ఉభయ మతాతీత రాణులు అంతఃపురాల్లో శయనం
రాజుల మధ్య వివాహాలే గానీ మతాలు పట్టించుకోని ఉభయులు
ఇది వాస్తవ చరిత్ర!

సమాధులు తవ్వితే ఏం వస్తుంది
బైటపడ్డ బొక్కలు మెడలో వేసుకుంటావా?!
నువ్వు కట్టిన సమాధి కాదు
నువ్వు పెట్టిన పైసా కాదు
చారిత్రక కట్టడాలెన్నో గత సాంస్కృతిక వైభవ తార్కాణాలు!
నువ్వు కట్టిన కట్టడాలైతే నువ్వు కూల్చుకో !
అక్షరం జ్ఞానాన్నివ్వకపోగా
మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న వర్తమానం !!

– గిరి ప్రసాద్ చెలమల్లు
9493388201

## ఉలిక్కిపడకు..

ఉలిక్కిపడకు చెబుతున్నా ఉన్నమాటలు

త్రుళ్ళిపడకు తంటాలు తెచ్చుకోకు
మిడిసిపడకు ముందుంది ముసళ్ళ పబ్బము
ఎగిసిపడకు తాడినితన్నితే తలనుతన్నేవాడుంటాడు

తత్తరపడకు గత్తరతెచ్చుకోకు
బిత్తరచూపకు చిత్తయిపోకు
ఆవేశపడకు అనర్థాలు తెచ్చుకోకు
కృంగిపోకు కుతకుతలాడకు

గంతులేయకు గమ్మత్తులుచేయకు
చిందులేయకు చిటపటలాడకు
భంగపడకు జాగ్రత్తగా ప్రవర్తించు
భయపడకు ధైర్యంగా ముందుకెళ్ళు
అతిగా ఊహించుకోకు ఆర్ద్రతనెరిగి అడుగిడు
అందరినీ నమ్మకు బుట్టలో చిక్కకు
పరుగులు తీయకు క్రింద పడకు
అబద్ధాలు చెప్పకు అభాసుపాలు కాకు

కోతలు కొయ్యకు నవ్వులపాలు కాకు
గుంటలు తియ్యకు గోతుల్లో పడకు
అశ్రద్ధ వహించకు కష్టాలు కొనితెచ్చుకోకు
అన్నిట్లో జోక్యంచేసుకోకు అపనిందలు మూటకట్టుకోకు

– గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్,

## భూమి పుత్రుడు రైతు

అన్నదాత అందరికీ అన్నం పెట్టే రైతు
ఎండనకా వాననకా శ్రమించే రైతన్న
తను శ్రమించి అందరికీ అన్నం పెట్టే రైతు
తను చేసే పనిని దైవంగా నమ్మే రైతు!!

బంగారు లాంటి పంటలు పండించే రైతన్న
వ్యవసాయ క్షేత్రమే తన ప్రపంచం
వానలో నానుతూ చలిలో వణుకుతూ నేలను దున్నే రైతు
హాలం పట్టి అందరి కోసం శ్రమించే రైతు!!

రైతు త్యాగానికి ప్రతీకగా నిలుస్తాడు
రైతు నడుము వంచి కష్టించి
పాడిపంటలు పండించే రైతు
రైతు కష్ట ఫలితమే దేశ సౌభాగ్యం!!



సమాజానికి రైతే వెన్నెముక
జై జవాన్ జై కిసాన్
అన్నదాతలకు అండగా నిలుద్దాం
రైతన్నలను గౌరవిద్దాం రైతులకు విలువనిద్దాం!!
ప్రపంచ కవితా దినోత్సవం మార్చి 21 సందర్భంగా...

దేవులపల్లి రమేశ్,
: 9963701294.



# జాతీయం

NATIONAL NEWS GENERAL NEWS

## పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్స్..



**న్యూఢిల్లీ :** అరకు కాఫీకి విస్తృత ప్రచారం కల్పించేందుకు లోక్‌సభ స్పీకర్ అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్‌లో సోమవారం నుంచి అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. సభాపతి ఆదేశంతో రెండు స్టాల్స్ ఏర్పాటు చేసుకోవాలని లోకసభ భవనాల డైరెక్టర్ కుల్ మోహన్ సింగ్ అరో రా ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో సంగం 1, 2 కోర్ట్ యార్డ్ వద్ద స్టాల్స్ ఏర్పా టు చేసేందుకు లోకసభ సచివాలయం అనుమతి ఇచ్చింది. సోమవారం నుంచి ఈనెల 28 వరకు స్టాల్స్ ఏర్పాటుకు అవకాశం కల్పించింది. ఈ క్రమంలో పార్లమెంటు ప్రాంగణంలో అరకు కాఫీ స్టాల్స్ ఏర్పాటు కోసం గిరిజన కోఆపారేటివ్ సొసైటీ అధికారులు ఢిల్లీ చేరుకున్నారు.

**కాఫీ స్టాల్స్‌కు ఏర్పాట్లు పూర్తి..**

సోమవారం నుండి పార్లమెంట్‌లో అరకు వ్యాలీ కాఫీ స్టాల్స్‌కు ఏర్పాట్లు పూర్తి అయ్యాయని విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు తెలిపా రు. తూర్పు కనుమల నుండి భారత దేశ పార్లమెంట్ వరకు అరకు వ్యాలీ కాఫీ ప్రస్థానం దేశంలో ప్రతి ఒక్కరికీ తెలుస్తున్నందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ స్టాల్స్‌ను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, ఇతర కేంద్ర మంత్రులు.. ప్రారంభం చేయబోతున్నారని కలిశెట్టి తెలిపారు.

## ఎన్నికల సంఘం ఒక పనిచేయని, విఫల సంస్థ

### రాజ్యసభ ఎంపి కపిల్‌సిబల్ తీవ్రస్థాయి వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** ఎన్నికల సంఘం ఒక పనిచేయని, విఫలమైన సంస్థ అని ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగ బాధ్యతలకు అనుగుణంగా ఎన్నికల సంఘం తన బాధ్యతలను నిర్వర్తించనందున అధిక సంఖ్యలో ప్రజలకు ఎన్నికల సంఘంపై నమ్మకం లేదని ఆయన తెలిపారు. ఆయన 'పిటిఐ'కి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ లోపించిన నమ్మకాన్ని ఎంత త్వరగా చక్కదిద్దగలిగితే ప్రజాస్వామ్యం రక్షించబడి గొప్పగా పరిఢవిల్లుతుందని అన్నారు. 'ఎన్నికల సంఘం ఒక పనిచేయని సంస్థ. 'రాజ్యాంగం పరిధికి లోబడి ఊహించిన బాధ్యతలను ఎన్నికల సంఘం నిర్వర్తించడం లేదు' అని సిబల్ చెప్పారు. 'ఎన్నికల సంఘం ఒక పనిచేయని సంస్థగా ఈ రోజు మనముందు ఉన్నది. ఈ దేశంలోని అధిక సంఖ్యాక ప్రజలకు దానిమీద ఏమాత్రం నమ్మకం లేకుండా పోయింది' అని రాజ్యసభ ఇండిపెండెంట్ ఎంపి అయిన కపిల్ సిబల్ పేర్కొన్నారు.'అందువల్ల ఈ సమస్యను మనం త్వరగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉంది. అప్పుడు మాత్రమే మనం ప్రజాస్వామ్యాన్ని గొప్పగా రక్షించుకున్నవారం అవుతాం' అని చెప్పారు. 'ఈవిఎంలలో కొన్ని తీవ్రంగా పరిగణించాల్సిన సమస్యలు ఉన్నాయని, అందువల్ల ఎన్నికల ప్రక్రియ కలుషితం అయింది అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చిన ఫలితాలు అనేక స్థాయిలలో ఉండవచ్చని, వాటి ఫలితాలను అనేక స్థాయిలలో అవకతవకలకు గురిఅయ్యి ఉండవచ్చని సిబల్ ఆరోపించారు. ఈ అంశాన్ని అందరూ కలిసికట్టుగా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ కాంగ్రెస్ నాయకుడు అయిన కపిల్‌సిబల్ నొక్కిచెప్పారు. ఓటర్ల జాబితాలో విపక్షాలకు చెందిన అనేక మంది పేర్లను తొలగించడం, డుప్లికేట్ ఓటర్ ఐడి నంబర్లు, అధిక సంఖ్యలో కొందరిని చేర్చడం తదితర అంశాలపై కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు తరచుగా ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో కపిల్ సిబల్ వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఎన్నికల సంఘం శనివారం నాడు తన 4,000మందికి పైగా ఎన్నికల సంఘం ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్స్ వారి వారి అసెంబ్లీ స్థానాలలో పెండింగ్ బూత్ లెవల్ సమస్యలను పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహిస్తున్నారని తెలిపింది. ఇటీవలి కాలంలో వివిధ రాష్ట్రాల ఎన్నికల సంఘాలు ఫిర్యాదులను పరిష్కరించేందుకు అన్ని రాజకీయ పార్టీలతో బహుళ స్థాయిలలో సమావేశాలు ఏర్పాటు చేసింది. జనన మరణ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను నిశితంగా పరిశీలించి ఓటర్ల జాబితాలను ప్రక్షాళన చేయడం, ఓటర్ కార్డులను ఆధార్ కార్డులతో అనుసంధానం చేయడానికి సంబంధించి అన్వేషణ ప్రారంభించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఓటర్ జాబితాలను ప్రక్షాళన చేసేందుకు ఎన్నికల సంఘం సాంకేతిక నిపుణులు, యుఐడిఎఐ మధ్య సంప్రదింపులు జరిపేందుకు అంగీకరించిందని కాంగ్రెస్ గత మంగళవారం నాడు తెలిపింది.

## బలగాలకు సవాల్‌గా మందుపాతరలు

### నక్సల్స్ ఏరివేతకు ముందు ఐఇడిలను ఎదుర్కోవాల్సిందే...



**న్యూఢిల్లీ :** వచ్చే ఏడాది మార్చికల్లా నక్సల్స్ రహిత దేశంగా మార్చుతామన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా క్షేత్రస్థాయిలో భద్రతా బలగాలు తమ ఆపరేషన్‌లను తీవ్రతరం చేశాయి. అందులో భాగంగా మావోయిస్టులను రివేసేందుకు భద్రతాబలగాలు దూకుడును ప్రదర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మూడు నెలల వ్యవధిలోనే దాదాపు 120 మంది మావోయిస్టులను హతమార్చారు. అయితే, యాంటీ నక్సల్స్ ఆపరేషన్ల వేళ రక్షణ దళాలకు మందుపాతర (ఐఇడి)లు సవాల్‌గా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో ఐఇడి పేలుళ్లు, స్వాధీనం ఘటనలు పెరిగాయి. మరోవైపు సిగ్నల్స్ ద్వారా దూరం నుంచి పేల్చగల ఆర్‌సిఐఇడి (రిమోట్ కంట్రోల్డ్ ఐఇడి)లూ లభ్యమవుతుండటం కలవరం రేపుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం గతేడాది ఛత్తీస్‌గఢ్‌లో మందు పాతరలకు సంబంధించి 78 పేలుళ్లు, స్వాధీనం ఘటనలు నమోదయ్యాయి. ఈ ఏడాదిలో మార్చి మధ్య నాటికే ఈ సంఖ్య 100 దాటింది. 2020-22లో సెక్యూరిటీ క్యాంపులకు 37 కిలోమీటర్ల పరిధిలో ఐఇడిలు లభ్యమయ్యేవని, 2023 24 మధ్యకాలంలో అవి మూడు కిలోమీటర్లలోపే వెలుగుచూస్తున్నట్లు ఓ నివేదికలో వెల్లడైంది. 2020-21తో పోలిస్తే 2022-24లో ఈ తరహా ఘటనలు 25 శాతం పెరిగాయని తేలింది. గత ఏడాది కాలంలో ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో 70కుపైగా కొత్త ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్ (ఎఫ్ఒబి)లు ఏర్పాటయ్యాయి. వీటి సంఖ్య పెరిగిన కొద్దీ ఐఇడి ఘటనలూ పెరుగుతున్నట్లు ఓ అధికారి వెల్లడించారు.

**ఆర్‌సిఐఇడిల ముప్పు..!**

ఇటీవల కాలంలో ఆర్‌సిఐఇడిల ముప్పు ఆందోళనకరంగా మారింది. గతవారం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్ జిల్లాలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ సమీపంలో 5 కిలోల పేలుడు పదార్థం వెలుగుచూడటం కలకలం రేపింది. బాంబు వద్ద రెండు ఖాళీ గాజు సీసాలతోపాటు దూరం నుంచి పేల్చేందుకు వీలుగా సమీపంలోని ఓ చెట్టు కింద వైర్‌తో అనుసంధానమై ఉన్న చిన్న యాంటెన్నా కూడా లభ్యమైంది. ఈ ఏడాది జనవరిలో బీజాపుర్ జిల్లాలోనే ఓ వంతెన కింద తొలిసారి ఈ తరహా ఐఇడిని సిఆర్‌పిఎఫ్ స్వాధీనం చేసుకుంది. ఆర్‌సిఐఇడిల వాడకం పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. సాధారణ మందుపాతరలతో పోలిస్తే.. దూరం నుంచి వీటిని పేల్చే వీలుండటంతో మరింత ప్రమాదకరమని హెచ్చరించారు.

**రక్షణ దళాలకు హై అలర్ట్**

మావోయిస్టుల టిసిఓసి (టాక్టికల్ కౌంటర్ అఫెన్సివ్ క్యాంపెయిన్) సమీపిస్తున్న నేపథ్యంలో.. ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్‌లలో ఐఇడి దాడుల విషయంలో రక్షణ దళాలకు హై అలర్ట్ జారీ చేసినట్లు ఓ అధికారి తెలిపారు. వేసవిలో అడవి పరిస్థితులను అనుకూలంగా మలచుకుని భద్రతా దళాలపై దాడులు చేసేందుకు మావోయిస్టులు టిసిఓసి చేపడతారు. మావోయిస్టులను నిర్మూలించాలన్న టార్గెట్‌కు అనుగుణంగా బలగాలు పనిచేస్తున్నాయి. ముఖ్యంగా బస్తర్‌లోని మారుమూల ప్రాంతాలకూ చొచ్చుకెళ్తున్నాయి. కొత్త క్యాంపులు ఏర్పాటు చేస్తున్నాయి. మరోవైపు.. ఆయుధాల కొరతతో మావోయిస్టులు ప్రత్యక్ష దాడులకు వెనుకంజ వేస్తున్నారు. బలగాలకు భారీ నష్టం చేకూర్చే లక్ష్యంతో మందుపాతరల మార్గాన్ని ఎంచుకుంటున్నారు అని ఓ అధికారి తెలిపారు.

## ప్రపంచంతో మన బంధం విభిన్నం

### విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్



**న్యూఢిల్లీ:** ఇంధన వనరులకు సంబంధించి భారతదేశం ప్రపంచదేశాలతో విస్తృతమైన, విభిన్న సంబంధాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. భారతదేశం ప్రపంచంలో ఐదవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నందువల్ల అనివార్యంగా ఇంధన వనరుల సమితిని సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచీకరణ ప్రారంభమైన తర్వాత అనేక దశాబ్దాలుగా బహిర్గతమైన సద్గుణాలను మనం విన్న తర్వాత,ఆ అనుభవాలను చవిచూసిన తర్వాత, పారిశ్రామిక సంబంధాలు, ఎగుమతి నియంత్రణలు, సుంకాల యుద్ధాలతో ఈనాడు ప్రపంచదేశాలు వాస్తవిక పెనుగులాటలో తలమునకలై ఉన్నాయన్నారు. న్యూఢిల్లీలో జరిగిన 'బిజినెస్ టు డే' ఈవెంట్‌లో జైశంకర్ మాట్లాడుతూ, రాబోయే దశాబ్దాలలో భారతదేశ ఇంధన వనరుల అవసరాలు పెరుగుతాయని, అందువల్ల దేశంలో ఇంధనవనరులను అందుబాటులో ఉంచడానికి సానుకూలమైన భరోసా తీసుకురావాలని, దీనిని అర్థం చేసుకుని ముందుకు వెళ్ళడమే భారత ప్రభుత్వ కీలక దౌత్య లక్ష్యమని చెప్పారు. శిలాజ ఇంధనాలకు దూరంగా మనదేశం పునర్వినియోగ ఇంధన వనరులను పెద్దస్థాయిలో అభివృద్ధి చేస్తోందని, వాటిని అవసరాలకు అనుగుణంగా భారీస్థాయిలో మోహరించేందుకు కర్మాగారాలస్థాయిలో ఇంధన అవసరాలు తీర్చేందుకు 300 మెగావాట్ల వరకూ సామర్థ్యంగల చిన్నపాటి అణు ఇంధన రియాక్టర్లను సమకూర్చే అన్వేషణలు చేస్తున్నామని చెప్పారు. దేశం అభివృద్ధి చెందిన అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో చేరేకొద్దీ మన ఇంధన అవసరాలు భారీగా పెరుగుతాయని, అందుకు అనుగుణంగా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భారతదేశ దౌత్యకార్యాలయాలు విదేశాలలో గతంకంటే ఈనాడు ఎంతో చురుగ్గా పనిచేస్తున్నాయనీ, మనదేశ వాణిజ్య ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని మన దౌత్యవేత్తలు బాధ్యతాయుతమైన కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మన వ్యాపారాలు బ్రహ్మాండంగా సాగడానికి ఎక్కడ అనువైన ప్రదేశాలు ఉంటాయో అక్కడ వారు మనకు సమాచారం తెలియజేసి, సలహాలు ఇచ్చి సదుపాయాలు సమకూరుస్తున్నారన్నారు. ''ఉక్రేన్‌లో యుద్ధ ప్రజ్వరిల్లిన తర్వాత మన విధాన రూపకల్పనలో మార్పులు సంభవించాయి, ముఖ్యంగా భవిష్యత్ అవసరాలు దృష్టిలో పెట్టుకుంటున్నాం, మన కు ఆర్థికపరమైన చిక్కులు రాకుండా ఉండటంకోసం ఇటీవలి సంవత్సరాలలో ఇంధన ప్రత్యామ్నాయ మార్గాలకు వీలుగా విధాన నిర్ణయాలకు ప్రాధాన్యత వచ్చిందన్నారు. ప్రతిదేశం సొంత ప్రయోజనాలు, అవసరాలకు అనుగుణంగా ప్రవర్తించినప్పటికీ కొందరు ఇతరత్రా బాహాటంగా ఈ విషయాలు చెబుతారన్నారు.ఉక్రేన్‌లో యుద్ధం కారణంగా భారతదేశం రష్యా నుండి చమురును దిగుమతి చేసుకుంటున్న విషయాన్ని మంత్రి జైశంకర్ ప్రస్తావించారు. ఈ విషయంలో భారత్ వైఖరిని కొన్ని పాశ్చాత్యదేశాలు తీవ్రంగా విమర్శించాయి. అత్యంత విస్తారమైన ఆర్థిక వ్యవస్థ కలిగిన భారతదేశానికి ఇంధన వనరుల అవసరాల విషయంలో ఒక స్పష్టత ఉందనీ, ఒక సమగ్ర వ్యూహం ఉందని చెప్పారు. అటు రష్యా, ఇటు ఉక్రేన్ రెండు దేశాలతో ఈ విషయంలో కార్యకలాపాలలో నిమగ్నమైన కొన్నిదేశాలలో భారత్ కూడా ఒకటిగా ఉందన్నారు.

## వక్ఫ్ బిల్లు రాజ్యాంగంపై దాడి

### శతాబ్దాల నాటి సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే బిజెపి కుట్రలో భాగం : కాంగ్రెస్



**న్యూఢిల్లీ :** వక్ఫ్ (సవరణ) బిల్లును రాజ్యాంగంపై 'దాడి'గా కాంగ్రెస్ అభివర్ణించింది. అదే విధంగా శతాబ్దాల నాటి సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేందుకు బిజెపి చేస్తున్న నిరంతర ప్రయత్నాలలో భాగమే ఈ ప్రతిపాదిత చట్టమనిఆరోపించింది. ప్రచారాన్ని వ్యాప్తి చేయడం, పక్షపాతాలను సృష్టించడం ద్వారా మైనారిటీ వర్గాలను దెయ్యంగా చిత్రీకరించేందుకు బిజెపి చేస్తున్న ప్రయత్నాలలో ఇది కూడా ఒక భాగమని ప్రతిపక్ష పార్టీ ఆరోపించింది. వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024 పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని కాంగ్రెస్ ఇన్‌చార్జ్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ అన్నారు. వక్ఫ్ (సవరణ) బిల్లు 2024 బిజెపి వ్యూహంలో భాగమని, మన ప్రత్యేకమైన బహుళమత సమాజంలో శతాబ్దాల నాటి సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసేందుకు నిరంతరం ప్రయత్నాలు చేస్తోందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల పౌరులకు సమాన హక్కులు రక్షణకు హామీ ఇచ్చే రాజ్యాంగ నిబంధనలను నీరుగార్చడమే ఈ బిల్లు లక్ష్యమని ఆరోపించారు. ఎన్నికల ప్రయోజనాల కోసం మన సమాజాన్ని శాశ్వత ధ్రువణ స్థితిలో ఉంచడానికి మైనారిటీ వర్గాల సంప్రదాయాలు, సంస్థలను కించపరచడాని బిజెపి వ్యూహంలో, నిరంతర ప్రయత్నాలలో ఇది భాగమని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. ప్రతిపాదిత చట్టం ఐదు కారణాల వల్ల పూర్తిగా లోపభూయిష్టంగా ఉందని ఆయన పేర్కొన్నారు. వక్ఫ్ అధికార యంత్రాంగాన్ని బలహీనపరిచేందుకు ప్రస్తుత చట్టంలోని నిబంధనలను ఎటువంటి కారణం లేకుండా తొలగిస్తున్నారని, వక్ఫ్ భూములను ఆక్రమించిన వారిని రక్షించడానికి ఇప్పుడు చట్టంలో మెరుగైన రక్షణలను ప్రవేశపెడుతున్నారన్నారు. వక్ఫ్ ఆస్తుల వివాదాలకు సంబంధించిన విషయాలతో పాటు వాటి రిజిస్ట్రేషన్‌పై కలెక్టర్, ఇతర రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విస్తృత అధికారాలు ఇవ్వబడ్డాయని రమేష్ అన్నారు. ఎవరి ఫిర్యాదుపైనా లేదా వక్ఫ్ ఆస్తి ప్రభుత్వ ఆస్తి అనే కేవలం ఆరోపణపై తుది నిర్ణయం తీసుకునే వరకు రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు ఇకపై ఏదైనా వక్ఫ్ గుర్తింపును రద్దు చేసే అధికారాలను కలిగి ఉంటారని ఆయన పేర్కొన్నారు. 428 పేజీల నివేదికను జెపిసి ద్వారా క్లాజుల వారీగా వివరణాత్మక చర్చ లేకుండానే అక్షరాలా బుల్డోజర్ చేసిందని గుర్తుచేసుకోవాలని, ఇది అన్ని పార్లమెంటరీ పద్ధతులను ఉల్లంఘిస్తుందని మండిపడ్డారు. ముఖ్యంగా, వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024 భారత రాజ్యాంగంపైనే దాడి అని కాంగ్రెస్ నాయకుడు నొక్కి చెప్పారు. వక్ఫ్ (సవరణ) బిల్లుపై పార్లమెంటు ఉమ్మడి కమిటీ తన నివేదికను సమర్పించిన తర్వాత ఆయన వ్యాఖ్యలు చేశారు. ఇంకా షెడ్యూల్‌లో పెట్టనప్పటికీ ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపాదిత చట్టాన్ని పార్లమెంటులో ఆమోదం కోసం తీసుకురావచ్చనే ఊహాగానాలు వివిపిస్తున్నాయి. బిల్లుపై 31 మంది సభ్యుల ప్యానెల్, బహుళ సమావేశాలు, విచారణల తర్వాత, ప్రతిపాదిత చట్టానికి అనేక సవరణలను సూచించింది. అయినప్పటికీ ప్రతిపక్ష సభ్యులు నివేదికతో విభేదించి అసమ్మతి నోట్స్ సమర్పించారు. 655 పేజీల నివేదికను జనవరి 30న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు సమర్పించారు. ఉమ్మడి కమిటీ 15-11 మెజారిటీ ఓట్లతో అధికార బిజెపి సభ్యులు సూచించిన మార్పులను కలిగి ఉన్న నివేదికను ఆమోదించింది. ఈ చర్య ప్రతిపక్షాలను ఈ ప్రక్రియను వక్ఫ్ బోర్డులను నాశనం చేసే ప్రయత్నంగా అభివర్ణించింది. బిల్లుపై కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు లోక్‌సభలో ప్రవేశపెట్టిన తర్వాత, గత ఏడాది ఆగస్టు 8న ఈ బిల్లును ఉమ్మడి కమిటీకి పంపారు.

## ఆహారం వద్దు... డ్రగ్సే

### జైలులో మర్చంట్ నేవీ అధికారి హత్య కేసు నిందితుల విచిత్ర పరిస్థితి



**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్‌లోని మీరట్‌లో వెలుగుచూసిన మర్చంట్ నేవీ అధికారి హత్య కేసులో అరెస్టయిన ముస్కాన్, ఆమె ప్రియుడు సాహిల్‌కు సంబంధించిన కీలక విషయాలను పోలీసులు వెల్లడించారు. వీరిద్దరూ మాదకద్రవ్యాలకు బానిసలుగా మారారని పేర్కొన్నారు. జైల్లో ఆహారం తినకుండా తమకు గంజాయి, మత్తు ఇంజెక్షన్లు ఇవ్వాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు. అరెస్ట్ నాటి నుంచి అవి దొరక్కపోవడంతో విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని.. తరచూ గంజాయి కోసం డిమాండ్ చేస్తున్నారన్నారు. జైలుకు వచ్చిన మొదటి రోజు నుంచి నిందితుల ఆరోగ్యం క్రమంగా క్షీణించడం మొదలుపెట్టిందని అధికారులు పేర్కొన్నారు. దీంతో సాహిల్‌ను ఆస్పత్రికి తరలించగా అక్కడ తీవ్ర గందరగోళం సృష్టించాడని.. గంజాయి ఇవ్వాలని డిమాండ్ చేశాడని తెలిపారు. మానసిక స్థితి సరిగా లేకపోవడం వల్ల వారు తోటి ఖైదీలపై దాడి చేసే ప్రమాదం ఉండడంతో వేరేగా ఉంచినట్లు తెలిపారు. నిందితులు ఇద్దరు ప్రతిరోజు మాదకద్రవ్యాల ఇంజెక్షన్లు తీసుకుంటారని గుర్తించినట్లు.. అవి లేకపోవడంతో ఈ విధంగా ప్రవర్తిస్తున్నారని అన్నారు. హత్య సమయంలోనూ సాహిల్ డ్రగ్స్ మత్తులోనే ఉన్నట్లు అనుమానిస్తున్నారు. దీంతో వారిని జైలులోని డీ అడిక్షన్ సెంటర్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. సౌరభ్ రాజ్ పుత్(29), ముస్కాన్ (27) 2016లో ప్రేమ వివాహం చేసుకున్నారు. అతడు మర్చంట్ నేవీలో పని చేసేవాడు. వారికి 2019లో కుమార్తె జన్మించింది. ఆ తర్వాత సాహిల్ (25)తో ముస్కాన్ వివాహేతర సంబంధం పెట్టుకొంది. దీనిపై వారు విడాకుల వరకు వెళ్లారు. కానీ, కుమార్తె కోసం సౌరభ్ వెనక్కి తగ్గినట్లు తెలుస్తోంది. తర్వాత ఉద్యోగం నిమిత్తం విదేశాలకు వెళ్లిన అతడు.. గతనెల కుమార్తె పుట్టినరోజు కోసం తిరిగొచ్చాడు. ఇది నచ్చని ముస్కాన్.. ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసింది. అతడి శరీరాన్ని ముక్కలు చేసి.. వాటిని ఓ డ్రమ్ములో వేసి సిమెంట్‌తో సీల్ చేసింది. ఇదిలా ఉండగా, ఈ కేసులో ప్రధాన నిందితురాలు ముస్కాన్ తమ తరఫున వాదించడానికి ప్రభుత్వ న్యాయవాదిని కేటాయించాలని కోరినట్లు జైలు అధికారులు పేర్కొన్నారు. భర్త విషయంలో తాను చేసిన పనికి ఇరు కుటుంబాలు తనపై కోపంగా ఉన్నాయని.. కేసును వాదించడానికి లాయర్‌ను ఏర్పాటు చేసే స్థితిలో వారు లేరు కాబట్టి ప్రభుత్వమే తమ తరఫున డిఫెన్స్ లాయర్‌ను ఏర్పాటు చేయాలని ఆమె విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

## యుపిలో భారీ అవినీతి

### సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్



**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో ఉన్నతాధికారులు, అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) అధినేత అఖిలేష్ యాదవ్ ఆరోపించారు. బిజెపి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అవినీతి పట్ల 'జీరో టాలరెన్స్' అనే వాదనను ఆయన తోసిపుచ్చారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలు ఉన్న ఒక ఐఎఎస్ అధికారి దాక్కున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఇది ప్రభుత్వ జీరో టాలరెన్స్ విధానం గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతుందని యాదవ్ పేర్కొన్నారు. ఇటీవల సస్పెండ్ అయిన ఐఎఎస్ అభిషేక్ ప్రకాష్‌ను పరోక్షంగా అఖిలేష్ ప్రస్తావించారు.ఇన్వెస్ట్ యుపి సిఇఒ పదవిలో ప్రకాష్ ... ఒక ప్రాజెక్టును క్లియర్ చేయడంలో అతనిపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. బిజెపి నాయకులు, అధికారులు చట్టవిరుద్ధంగా సంపదను కూడబెట్టారని, భూమిని ఆక్రమించారని , ఆర్థిక దుష్ప్రవర్తనకు పాల్పడ్డారని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రామ్ మనోహర్ లోహియా జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించిన తర్వాత యాదవ్ విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను విమర్శిస్తూ కాషాయ వస్త్రాలు ధరించడం వల్ల నిజమైన యోగి అవ్వరని హితవు పలికారు. పాలనకు నిజాయితీ, జవాబుదారీతనం అవసరమని, అవి ఈ పరిపాలనలో లేవన్నారు. భారీ ఆర్థిక అవకతవకలకు పాల్పడినట్లు తేలిన తర్వాత అండర్‌గ్రౌండ్‌కు వెళ్లిన ఐఎఎస్ అధికారిని ప్రస్తావిస్తూ ఈ ప్రభుత్వం అవినీతి అధికారులను కాపాడుతోందని ఆయన ఆరోపించారు. ఒక ఐఎఎస్ అధికారి కనిపించడం లేదని మనందరికీ తెలియదా? అతను ముఖ్యమంత్రి కార్యాలయం లేదా నివాసంలో దాక్కున్నాడని చెబుతున్నారన్నారు. ముఖ్యమంత్రికి దగ్గరగా ఉంటేనే అధికారులు రాష్ట్రంలో ప్రధాన పదవులు పొందుతారని ఆయన ఆరోపించారు. 'ఇది కమిషన్ల కోసం పోరాటం కాదు, అవినీతి డబ్బు విభజనపై పోరాటం. ఇది ఎంతకాలంగా జరుగుతుందో ప్రభుత్వానికి తెలియదు అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ జీరోటాలరెన్స్ విధానం 'బక్వాస్' (అర్థంలేనిది) అని ఆయన అన్నారు. ఫతేపూర్ వంటి జిల్లాల్లో బిజెపి నాయకులు విస్తారమైన భూములను సంపాదించారని, డంపర్లు, జెసిబిల వంటి భారీ యంత్రాలను కొనుగోలు చేశారని, వివాదాస్పద ఆస్తులను ఆక్రమించుకున్నారని యాదవ్ ఆరోపించారు. అయోధ్య అత్యంత దారుణమైన భూ కబ్జాకు గురైందని, బిజెపి కార్యకర్తలే ప్రధాన లబ్ధిదారులు అని కూడా ఆయన ఆరోపించారు. శాంతిభద్రతల 'వైఫల్యాలు' కేసులను ప్రస్తావిస్తూ, వారణాసి నుండి లక్నోకు ప్రయాణిస్తున్న ఒక మహిళపై దాడి చేసి చంపబడ్డారని ఆరోపించిన ఘటనను ఆయన ప్రస్తావించారు. ఎన్‌కౌంటర్లు మాత్రమే శాంతిభద్రతలను మెరుగుపరచగలిగితే, అలాంటి ఘటనలు ఎందుకు జరుగుతూనే ఉన్నాయని ప్ర శ్నించారు. అయోధ్యలోని సబ్‌డివిజనల్ మేజిస్ట్రేట్ పై వచ్చిన ఆరోపణలను కూడా యాదవ్ ప్రస్తావించారు. 'దీనికి ఎవరు బాధ్యత వహిస్తారు? ప్రభు త్వ అధికారులను ఇంత తీవ్ర స్థాయికి నెట్టివేస్తున్నప్పుడు, సామాన్యులు ఏ న్యాయం ఆశించగలరు?' అని ఆయన ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్ ప్రజలు 'ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పరిపాలనా వైఫల్యాల కు' బిజెపిని జవాబుదారీగా ఉంచుతారని మాజీ ముఖ్యమంత్రి హెచ్చరించారు. 'కాలం మారుతుం ది, ప్రజలు ఆ మార్పును తీసుకువస్తారు' అని ఆ యన నొక్కి చెప్పారు. 'ఎనిమిది సంవత్సరాలపై ఎందుకు దృష్టి పెట్టాలి? గత వారం చూడండి' అని ఆయన రాష్ట్ర ప్రభుత్వ 'వైఫల్యాలను' ఎత్తి చూపుతూ వ్యాఖ్యానించారు.

## ఢిల్లీలోని హౌజ్ ఖాస్‌లో చెట్టుకు వేలాడుతూ ఇద్దరు మృతి

**న్యూఢిల్లీ :** దక్షిణ ఢిల్లీలోని హౌజ్ ఖాస్ ప్రాంతంలోని డీర్ పార్క్ వద్ద ఆదివారం తెల్లవారుజామున 21 ఏళ్ల పిజ్జా షాపు కార్మికుడు, ఒక మహిళ మృతదేహాలు చెట్టుకు వేలాడుతూ కనిపించాయి, దీనిని ఆత్మహత్యగా పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, డీర్ పార్క్‌లోని సెక్యూరిటీ గార్డు నుండి ఉదయం 6:31 గంటలకు మృతదేహాల గురించి పిసిఆర్ కాల్ వచ్చింది. ఆ వ్యక్తి నల్లటి టీషర్టు, నీలిరంగు జీన్స్ ధరించగా, 18 ఏళ్ల మహిళ ఆకుపచ్చ రంగు దుస్తులు ధరించిందని వారు తెలిపారు. ఈ ఘటనకు దారితీసిన పరిస్థితులను తెలుసుకోవడానికి దర్యాప్తు అధికారులు ప్రయత్నిస్తున్నారని, ఇప్పటివరకు ఎటువంటి సూసైడ్ నోట్ లభించలేదని ఒక అధికారి తెలిపారు. ఇక్కడి పిలాంజి గ్రామానికి చెందిన ఆ వ్యక్తి లోధి కాలనీలోని పిజ్జా దుకాణంలో పనిచేస్తున్నాడని పోలీసులు తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో అతను ఇంటి నుండి బయలుదేరాడని అతని కుటుంబం పోలీసులకు తెలిపింది. గత మూడు రోజులుగా హుమాయున్‌పూర్ గ్రామంలో తన అత్తతో కలిసి ఉంటున్న చత్తర్‌పూర్ ఎన్‌క్లేవ్ నివాసి అయిన ఆ మహిళ, పని కోసం తన సొంత ఇంటికి తిరిగి రావడానికి శనివారం అదే సమయానికి ఇంటి నుండి బయలుదేరిందని పోలీసులు తెలిపారు. పార్కు లోపల సిసిటివి కెమెరాలు లేకపోవడం ఈ విషయంపై దర్యాప్తులో ప్రధాన అడ్డంకిగా ఉంది. అయితే, అక్కడ జరిగిన ఘటనల క్రమాన్ని తెలుసుకోవడానికి సమీపంలోని నిఘా కెమెరాల ఫుటేజ్‌లను స్కాన్ చేస్తున్నట్లు వారు తెలిపారు. వారి ఆత్మహత్యపై అనుమానిస్తున్నట్లు కొంతమంది స్థానికులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులు వేలాడుతూ కనిపించిన చోట నుంచి చెట్టు ఎక్కడం కష్టమని, వారిని చంపి, ఆ తర్వాత ఉరి తీసి ఉండవచ్చనే అనుమానం కలుగుతోందని స్థానిక వ్యక్తి ఒకరు పిటిఐతో అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

**శ్రీనగర్ :** జమ్మూ కాశ్మీర్‌లోని గండేర్బల్ జిల్లాలోని శ్రీనగర్-సోనామార్గ్ రహదారిపై ఆదివారం బస్సు, టాక్సీ ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో కనీసం నలుగురు మృతి చెందగా, 17 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. గుండ్ వద్ద ఈ ప్రమాదం జరిగిందని, రెండు వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. ప్రమాదంలో 21 మంది గాయపడ్డారని వారు తెలిపారు. గాయపడిన వారిలో నలుగురు తరువాత మరణించగా, మరో 17 మంది చికిత్స పొందుతున్నారు. మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన టాక్సీలో ప్రయాణిస్తున్న ం దున మరణించిన వ్యక్తులు పర్యాటకులుగా భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు.


SHRIRAM **వాహనముల బహిరంగ వేలం ప్రకటన**

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | AP15TB 8961 | Bashaveni Rakesh | TATA ACE | 2012 |
| 2 | TS02EZ 9024 | Mittapalli Vijay Kumar | INDICA V2 LS BS3 DIESEL 5 SEATER | 2013 |
| 3 | TS19E 4012 | punna Harish | BOLT-1.3L XMS QUADRAJET DIESEL 5 SEATER | 2015 |
| 4 | TS25F 5925 | Renukunta Raju | SONALIKA DI 740 | 2021 |
| 5 | TS26T 9139 | Mahubub Bee Shek | EICHER 380 | 2020 |
| 6 | TS32D 9843 | Mohammad Sajith Pasha | DZIRE TOUR DIESEL 5 SEATER | 2015 |
| 7 | TG02 4575 | Tallapally Rajamouli | DZIRE TOUR DIESEL 5 SEATER | 2015 |

AUCTION DATE: 25-03-2025

VENUE : SHRIRAM AUTOMALL, KARIMNAGAR, ALUGUNURU, HYDERABAD ROAD, KARIMNAGAR

గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును

SHRIRAM FINANCE LIMITED

H.No :12-209/1,1st floor, Upstairs of Telangana Grameena Bank, Warangal Road, Huzurabad. Cell : 9989033815



**డాక్యుమెంట్స్ పోయినవి**

హనుమకొండ జిల్లా వేలేరు మండలములోని పీచర గ్రామ శివారులో ని వేములకుంట తండకు చెందిన **గుగులోతు రవి , తండ్రి ఫకీరా** గారికి సంబంధించిన పట్టాపాస్ బుక్కు గత జనవరి నెలలో రవి పీచర నుండి హనుమకొండకు బస్ లో ప్రయాణం చేయుచుండగా భూమికి సంబంధించిన డాక్యుమెంట్స్ పట్టా పాస్ బుక్ పోయినది, పట్టా పాస్ బుక్ నెంబర్ T21100031608, ఖాతా నెం 60343 గల పాస్ బుక్ దొరికిన వారు ఈక్రింది అడ్రస్ లో ఇవ్వగలరని మనవి.

ఇట్లు:**గుగులోతు రవి, తండ్రి ఫకీర,**
గ్రామం: పీచర, వావిల్లకుంట తండ ,
ఇంటినెంబరు823/A మండలం వేలేరు,జిల్లా:హనుమకొండ,
పిన్ కోడ్ నెంబర్ 506145,
ఫోన్ నంబర్:9912407604.



# జనరల్

STATE NEWS REGIONAL NEWS

## కార్పొరేట్ కంపెనీలు ఆన్‌లైన్ చెల్లింపులపై జాగ్రత్త వహించాలి

టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్



ప్రజాపక్షం/హైదరాబాద్: కార్పోరేట్ కంపెనీలలో ఆన్లైన్ చెల్లింపులపై జగ్రత్త వహించాలని, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నుండి వచ్చినట్లు అనిపించినప్పటికీ, లావాదేవీలు చేసే ముందు అథరైజ్డ్ కమ్యూనికేషన్ ద్వారా ధృవీకరించుకుని చెల్లింపులు చేయాలని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డిజి శిఖా గోయల్ ఆదివారం పత్రిక ప్రకటన ద్వారా సూచించారు. ఇటీవల ఓ కంపెనీ ఎండి పేరుతో అకౌటెంట్‌కి సైబర్ నేరగాళ్లు వాట్సప్ కాల్ చేశారని పెద్దమొత్తంలో అకౌటెంట్ ట్రాన్స్‌ఫర్ చేయగా కంపెనీ ఎండి ఫిర్యాదు మేరకు టిజిసిఎస్‌బి అప్రమత్తతో భారి మోత్తంలో డబ్బులు సేవ్ చేయగలిగినట్లు తెలిపారు. ఫేక్ వాట్సప్ డిపిలతో కాల్స్ చేస్తూ సైబర్ క్రైమ్స్‌కి పాల్పడుతన్నారని ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ స్కామ్‌కు గురైనట్లు గుర్తించిన వెంటనే సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ)లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

# రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి గ్రామంలో పాదయాత్ర

పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి : భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా, రాజ్యాంగ పరిరక్షణ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లేందుకు ప్రతి గ్రామంలో పాదయాత్ర చేయాలని తెలంగాణ ప్రదేశ్‌కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి)అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లిలోని గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాష్ట్ర ఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి, వివిధ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, వీర్లపల్లి శంకర్‌లతో కలిసి టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని తెలిపారు. అంబేద్కర్‌పై అమిత్‌షా వ్యాఖ్యలు దేశ సమాజం క్షమించారని దన్నారు. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ నినాదాన్ని క్షేత్రస్థాయిలో బలంగా తీసుకెళ్ళాల్సిన అసవరం ఉందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానితులు, జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ రాష్ట్ర ఇంచార్జ్ చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ గాంధీజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు 100 సంవత్సరాలు, అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా వారిని స్మరించుకుంటూ, దేశంలో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వానికి అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టాలన్నారు. బిజెపి రాజ్యాంగ మార్పు, మనుస్మృతిని అమలు చేయాలనే కుట్రలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అంబేద్కర్‌ను అవమానిస్తూ, రాజ్యాంగాన్ని కించపరిచేలా బిజెపి, ఆర్ఎస్ఎస్ ఏవిధంగా వ్యవహరిస్తున్నాయో ప్రజలకు వివరించాలని తెలిపారు.

అంతకు ముందు సమావేశానికి అధ్యక్షత వహించిన టియుఎఫ్ఐడిసి చైర్మన్, డిసిసి అధ్యక్షులు చల్లా నరసింహారెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అమిత్‌షా అహంకారపూరిత వ్యాఖ్యలు క్షమించరానివి అన్నారు. అమిత్ షా వ్యాఖ్యలపై కేంద్రం ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కుల, మతాలకు అతీతంగా అంబేద్కర్‌ని అభిమానించే వాళ్లు దేశంలోనే కాదు ప్రపంచంలో ఉన్నారని తెలిపారు. రాజ్యాంగం మార్చాలనే బిజెపి కుట్రలో భాగమే అంబేద్కర్‌పై అమిత్ షా వ్యాఖ్యలు అని చల్లా నరసింహారెడ్డి తీవ్రంగా ధ్వజమెత్తారు. రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని అమలు చేయాలని బీజేపీ ప్రయత్నం చేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు ఒక సంవత్సరం పాటు జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో ప్రతి గ్రామంలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు డిసిసి చల్లా నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కంటెస్టెడ్ ఎమ్మెల్యేలు, జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమ రాజేంద్రనగర్ ఇంచార్జ్ వినోద్ కుమార్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ తీగల అనిత రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్లు, పిసిసి సెక్రటరీలు, మెంబర్లు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ, మహిళ విభాగాల అధ్యక్షులు, నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, డివిజన్ పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జస్టిస్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలపై అంతర్గత విచారణకు త్రిసభ్య కమిటీ:సిజెఐ

న్యూఢిల్లీ : జస్టిస్‌వర్మ ఇంటి ఔట్‌హౌస్ స్టోర్ రూములో తగలబడిన కరెన్సీ నోట్లకట్టలు కనుగొన్న వివాదంపై మరింత లోతుగా దర్యాప్తు చేయడానికి ముగ్గురు సభ్యులతో ఒక అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా నిర్ణయించారు. స్టిస్ షీల్ నాగు (పంజాబ్-హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి), జస్టిస్ జి.ఎస్.సంధావాలియా (హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి), అను శివరామన్ (కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి)లతో త్రిసభ కమిటీని జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఏర్పాటు చేశారు. ఐతే ఈ కమిటీ విచారణ పూర్తి చేయడానికి ఒక తుది గడువు తేదీని ఖన్నా నిర్దేశించలేదు. ఈ వివాదంపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఆదేశం మేరకు ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ 25 పేజీలతో కూడిన ఒక నివేదిక సమర్పించారు. తాత్కాలికంగా జస్టిస్ వర్మకు ఎలాంటి న్యాయపరమైన పనులూ అప్పగించవద్దని నివేదికలో సిఫార్సు చేశారు. ఈ నివేదికలో భాగంగా పోలీస్ కమీషనర్ షేర్ చేసిన, జస్టిస్ వర్మ నివాసంలో తగలబడిపోతున్న నోట్ల కట్టల వీడియో చూసిన తర్వాత ఈ విషయంలో మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గుర్తించారు. ఇందుకోసం అంతర్గత విచారణ చేయడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన నిర్ణయించారు. ఢిల్లీ హైకోర్టులో న్యాయమూర్తి జస్టిస్ వర్మ ఇంట్లో ఈనెల 14వ తేదీ రాత్రి పొద్దుపోయాక అగ్ని ప్రమాదం సంభవించింది. మంటలు అదుపు చేసేందుకు అగ్నిమాపకదళ సిబ్బంది వచ్చారు. ఆ సమయంలో అక్కడ తగలబడిపోతున్న నోట్ల కట్టలను వారు చూశారు. వీడియో తీశారు. దీంతో ప్రపంచానికి తెలియని వర్మ అనైతిక రహస్యం వెలుగులోకి వచ్చింది. దీనిపై సుప్రీంకోర్టు కొలీజియం (ఫుల్ కోర్ట్) సమావేశమై కొన్ని నిర్ణయాలు తీసుకుంది. దాని కొనసాగింపుగా భారత ప్రధాన న్యాయమూర్తిపై నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇచ్చిన నివేదికను అసాధారణరీతిలో సుప్రీంకోర్టు శనివారం సాయంత్రం తన వెబ్‌సైటులో అప్‌లోడ్ చేసింది. న్యాయమూర్తి తన నివేదికను పూర్తిచేశారనీ, ఫొటోలు, ఇతర సంబంధిత వీడియోలు ఉన్నాయనీ, జస్టిస్ వర్మ నివాసం నుండి గణనీయంగా నోట్లకట్టలను స్వాధీనం చేసుకున్నారని సుప్రీంకోర్టు ఆ వెబ్‌సైటు ద్వారా తెలియజేసింది. సగం సగం కాలిపోయిన నాలుగైదు భారతీయ కరెన్సీ నోట్ల కట్టలను జస్టిస్ ఉపాధ్యాయ తన నివేదికలో సాక్ష్యాలుగా చూపించారు. సంబంధిత వీడియోలను కూడా ఆయన సుప్రీంకోర్టుకు సమర్పించారు. పోలీస్ కమీషనర్ ఈనెల 16న ఇచ్చిన నివేదికలో జస్టిస్ వర్మ నివాసం వద్ద విధినిర్వహణ నిమిత్తం ఏర్పాటు చేసిన గార్డు ఇచ్చిన సమాచారం నమోదు చేశారు. మార్చి 15వ తేదీ ఉదయం ఆయన ఇంటి గదిలో అగ్ని ప్రమాదం జరిగాక మిగిలిన ఆ బూడిదను, సగం సగం కాలిపోయిన వస్తువులను వేరుచేసి బయటకు తీసుకువచ్చారు.

"నా ఉద్దేశం ప్రకారం ఈ యావత్ వ్యవహారంలో ఇంకా లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉంది'' అని జస్టిస్ ఉపాధ్యాయ ఈనెల 21న సమర్పించిన తన నివేదికలో స్పష్టం చేశారు. ఈ విషయాన్ని పరిశీలించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్‌ఖన్నా ఈ నివేదికను సుప్రీంకోర్టు వెబ్‌సైటు ద్వారా శనివారం సాయంత్రం ప్రజలముందు ఉంచారు.

### ఇది పెద్ద కుట్ర : జస్టిస్ వర్మ



ఐతే ఈ కేసులో అనుమానితుడుగా ఉన్న జస్టిస్ వర్మ తనపై వచ్చిన ఆరోపణలను చాలా గట్టిగా వ్యతిరేకిస్తున్నారు. తన ఇంటి స్టోర్ రూములో నోట్లకట్టలను తాను ఎప్పుడూ పెట్టలేదనీ, అందుకు ఎలాంటి అవకాశం లేదని ఆయన వాదిస్తున్నారు. ఇది చాలా పెద్ద కుట్ర అనీ, తన ను ఇరికించేందుకు ఇలా చేసినట్టు కనిపిస్తోందని ఆయన అంటున్నారు. జస్టిస్ ఉపాధ్యాయ కమిటీ ఈ నోట్ల కట్టల ఉదంతంపై జస్టిస్ వర్మను వివరణ కోరింది. ఆందుకు ఆయన లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఈ సమాధానాన్ని కూడా జస్టిస్ ఉపాధ్యాయ తన నివేదికలో పొం దుపరచి కొలీజియం ఎదుట ఉంచారు. ఆరోపణలు చేసేముందు మీడియా కూడా కొంత విచారణ చేసి ముందుకు వెళ్ళాల్సి ఉంటుందని జస్టిస్ వర్మ పేర్కొన్నారు. తనకు గానీ, తన కుటుంబ సభ్యులకుగానీ తన ఇంటి ఔట్‌హౌస్ స్టోర్ రూములో ఉన్న ఈ కరెన్సీ కట్టల గురించిన సమాచారం తెలియదని స్పష్టం చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన రోజు రాత్రి తనకుగానీ, తన కుటుంబ సభ్యులకుగానీ ఈ కరెన్సీనోట్ల కట్టున్న విషయాన్ని ఆరోజు రాత్రి అక్కడ ఉన్న సిబ్బంది ఎవరూ చెప్పలేదని, వాటిని చూపించలేదని పేర్కొన్నారు. స్టోర్ రూము నుండి తాము కరెన్సీ కట్టలను వేరు చేయలేదని పేర్కొన్నారు. ఈ ఆరోపణను ఆయన తీవ్రంగా ఖండించారు. తన అధికారిక నివాసం సమీపంలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్ వద్ద ఉన్న స్టోర్ రూములో మంటలు చెలరేగాయని, మార్చి 14 రాత్రి 11.30 తర్వాత ఘటన జరిగిందని ఆయన వర్ణించారు. ఈ గదిని సాధారణంగా అందరూ ఉపయోగిస్తారనీ, స్టోర్ సరుకులు అందులో ఉంచుతారనీ, ఉపయోగంలేని వస్తువులు, సీసాలు, పింగాణీ వస్తువులు, కుర్చీలు, కాళ్ళు తుడుచుకునే పట్టాలు, కార్పెట్లు, తోటపని చేయడానికి ఉపయోగించే పనిముట్లు అందులో ఉంచుతామనీ జస్టిస్ వర్మ లిఖితపూర్వకంగా తెలియజేశారు. తాను గానీ, తన కుటుంబ సభ్యులుగానీ నోట్ల కట్టలను అక్కడ పెట్టలేదని, ఆ అవకాశం లేదని పేర్కొన్నారు. మా నగదు లావాదేవీలు, విత్‌డ్రాయల్స్ అన్నీ బ్యాంకుల ద్వారా జరుగుతాయని, లేదా యుపిఐ ద్వారా జరుగుతాయని పేర్కొన్నారు. అందువల్ల ఈ పరిస్థితుల్లో నా ఇంట్లోంచి నగదు స్వాధీనం చేసుకోవడం సరికాదనీ, నా కుటుంబంలో ఎవ్వరూ కాలిన నోట్ల కట్టలను చూడలేదని పేర్కొన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టు తప్పించుకునే యత్నం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో అటు ఇంటర్ పోల్, ఇటు సిబిఐ నోటీసులతో అమెరికాలో ఉన్న ప్రధాన నిందితుడు ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్ రావుతో పాటు ఓ మీడియా సిఇఒ శ్రవణ్ రావులకు ఉచ్చు బిగిస్తుంది. ఎలాగైనా తమను అదుపులోకి తీసుకుని ఇండియాకు తరలిస్తారని భయపడ్డ వీరిద్దరు అరెస్టు నుంచి తప్పించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తమకు ఈ కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ప్రభాకర్‌రావు ఆదరాబాదరగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇప్పటికే ఈ కేసులో చార్జ్‌షీట్ దాఖలు చేసినందున తనను అరెస్టు చేయవద్దని, విచారణకు పూర్తి స్థాయిలో సహకరిస్తానని తన పిటిషన్‌లో కోరాడు. ముందస్తు బెయిల్ పిటిషన్లో ప్రభాకర్‌రావు కీలక విషయాలు పేర్కొన్నారు. ప్రస్తుతం తనకు 65 ఏళ్ల వయసు ఉందని.. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని తెలిపారు. అంతేకాకుండా.. తాను వైద్యం కోసమే అమెరికా వెళ్ళినట్టు ఇది వరకే నాంపల్లి కోర్టులో మెమో దాఖలు చేశానని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. అమెరికా వెళ్ళినా దర్యాప్తు అధికారితో టచ్‌లో ఉన్నానని.. కేసు దర్యాప్తుకు పూర్తిగా సహకరించడానికి సిద్ధమని తెలిపారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధాలు లేవని పేర్కొన్నారు. ఈ కేసులో పోలీసులు ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు కాబట్టి తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని పిటిషన్ దాఖలు చేశానని తెలిపారు. బెయిల్ లభించిన కేసు దర్యాప్తునకు పూర్తిగా సహకరించడానికి సిద్ధంగా ఉన్నానని పిటిషన్లో పేర్కొన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసు తెలంగాణ రాజకీయాలను కుదిపేసిన విషయం తెలిసిందే. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పెద్దల ఆదేశాలతో పలువురు ప్రతిపక్ష నాయకులు, సెలబ్రెటీలు, వ్యాపారవేత్తలు, న్యాయమూర్తులు, బిల్డర్ల ఫోన్లు ట్యాపింగ్ చేసినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు ఉన్నాయి. అప్పటి స్పెషల్ ఇంటలిజెన్స్ బ్యూరో చీఫ్ ప్రభాకర్ రావు పర్యవేక్షణలోనే ఇదంతా జరిగిందని పోలీసులు ఆయనతో పాటు మరో ముగ్గురు అధికారులపై కేసు నమోదు చేశారు. ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్నలు ఈ కేసులో అరెస్ట్ అయ్యి బెయిల్ మీద బయట ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు మాత్రం అమెరికా వెళ్లిపోయారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీరియస్‌గా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. విదేశాలకు పారిపోయిన ప్రభాకర్ రావు ఇదే కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్ రావులను తిరిగి ఇండియాకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం సాయంతో ఇంటర్ పోల్‌ను ఆశ్రయించింది తెలంగాణ ప్రభుత్వం. ఇటీవలే ప్రభాకర్ రావు, శ్రవణ్ రావులపై ఇంటర్ పోల్ రెడ్ కార్నర్ నోటీస్ జారీ చేసింది. ఏదిఏమైనా ఈ వారంలో ప్రభాకర్‌రావు, శ్రవణ్‌రావులు ఇండియాకు రాక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలి



మంత్రి కొండా సురేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆకాంక్షించారు. ధూప దీప నైవేద్య అర్చక సంఘం రూపొందించిన విశ్వావసు నామ సంవత్సర పంచాంగమును కొండాసురేఖ ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి అర్చకులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని దానికి భగవంతుని కృప ఉండాలని, అర్చకులుగా మీ వంతు సహకారంగా క్షేమంగా సుభిక్షంగా ఉండేందుకు ప్రతి నిత్యం భగవంతుని అర్చన చేయాలని సూచించారు. తెలంగాణలో రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్చకులకు ప్రతినెలా వేతనాలు అందే విధంగా చూస్తున్నామని త్వరలో ధూప దీప నైవేద్య అర్చకులకు మెరుగైన వేతనం అందే విధంగా కృషి చేస్తానని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కార్యదర్శి శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ , అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, రీజనల్ కమిషనర్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ మాట్లాడుతూ నామ సంవత్సరం తెలంగాణ రాష్ట్రం సుసంపన్నంగా వెలుగొందుతుందని అన్నారు. అర్చకుల ఆశయ సాధన కొరకు రాష్ట్ర సంఘం నిర్విరామంగా శ్రమిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు అన్నవజ్జల ప్రసాద్ శర్మ తిరునగరి వెంకటాద్రి స్వామి కోశాధికారి నందనం హరికిషన్ శర్మ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫణి కుమార్ శర్మ కన్వీనర్ అమరేశ్వర శర్మ విశాలాక్షి ఉపాధ్యక్షులు మహేషు, రవికుమార్ లక్ష్మీ కాంతాచార్యులు అధికార ప్రతినిధులు భార్గవాచార్యులు సంతోష్ శర్మ వివిధ జిల్లాల అధ్యక్షులు రమేష్ శర్మ మునగలేటి త్రిపురారి మనోహర్ శర్మ పార్థ సారథి జంగం మహేష్ జయతేర్థ చారి సుబ్రహ్మణ్య శర్మ శిరేష్ శర్మ అంజనప్ప స్వామి రాజప్ప స్వామి అడవయ్య స్వామి సిద్ధాంతి గణేష్ జ్ఞానేశ్వర్ ఇతర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల నుండి కార్యవర్గ సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

# బిజెపికి ఇక చావు డప్పే

ఎంఎల్‌సి అద్దంకి దయాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్: డీ లిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందని ఆయా పార్టీలు అంటున్నా బిజెపి ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి ఏర్పడిందని.. ఇక రానున్న రోజునల్లో బిజెపికి ప్రజలు చావు డప్పు కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక వీడియోలో విడుదల చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ ప్రయోజనాలకు భంగం వాటిల్లితే బిజెపి నాయకులపై తిరుగుబాటు తప్పదన్నారు. దక్షిణాది ప్రజలు బిజెపిని పాతాళానికి తొక్కడం ఖాయమన్నారు. తెలంగాణ బిజెపి నాయకులు పరమానందయ్య శిష్యుల్లా మాట్లాడుతున్నారని విమర్శించారు. బిజెపి కూటమి నాయకుల కుట్రలను ప్రజలు తిప్పికొట్టాలని అద్దంకి దయాకర్ పిలుపునిచ్చారు. టిడిపి అధినేత, ఎపి సిఎం చంద్రబాబు, జనసేన అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, వైసిపి అధినేత, మాజీ ఎపి సిఎం జగన్ బిజెపిని అధికారంలోకి తెచ్చేందుకు సానుకూలంగా ఉన్నారని అన్నారు. బిజెపికి అడుగులకు మడుగులు ఒత్తే పార్టీలుగా మారిపోయారని చెప్పారు. రేపు ఆంధ్రప్రదేశ్‌కు నష్టం జరిగితే.. మీ పార్టీలు గల్లంతు అవుతాయనేది వాస్తవమని హెచ్చరించారు. జనగణన, మహిళా రిజర్వేషన్ల బిల్లు, డిలిమిటేషన్ పట్టకుండ ఉంటున్నారని అన్నారు. అలానే మీరు ఇలాగే కూల్‌గా ఉంటే.. మిమ్మల్నీ ప్రజలు ఫ్రిజ్లో పెట్టి కూల్‌గా ఉంచుతారని సెటైర్లు వేశారు. దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడడం కోసం కాంగ్రెస్, మిగతా పార్టీలు పోరాడడానికి సిద్ధంగా ఉన్నాయని అన్నారు.

# ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జోలికి వెళ్లొద్దు

మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజాపక్షం/హైదరాబాద్: అమెరికా లాంటి దేశాలలో కూడా అప్పులు ఉంటాయని, బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులతో ఆస్పత్రులు, పాఠశాలలు, రిజర్వాయర్లు తదితర అభివృద్ధి పనులు చేపట్టామని బిఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్టంలో కొంత మంది ఐఎఎస్ అధికారులు తప్పు దోవ పట్టిస్తున్నారని, ఉద్యోగులకే ఎక్కువ ఆదాయం పోతుందనే వాదనను తెరపైకి తీసుకురావడం సరికాదని సూచించారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తారని వారంతా ఎంతో ఆశపడితే, ప్రస్తుతం వారిని తొలగిస్తామని చెబుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జోలికి వెళ్ళవద్దని, వారికి ఏమైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసిన తర్వాత అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసేస్తే బాగుంటుందని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని తెలిపారు. సిఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో తాను పర్యటించానని, వడగండ్ల వానతో పంట నష్ట పోయిన రైతులను పరామర్శించానని వివరించారు. పంట నష్టాన్ని లెక్క వేసేందుకు అధికారులు అక్కడికి వెళ్లడం లేదని, కడుపు కట్టుకుని వ్యవసాయానికి పెట్టుబడి పెడితే, వానతో పంట దెబ్బతిన్నదని రైతులు ఏడుస్తున్నారని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. అకాల వర్షాల తో నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

# పరిశీలనలో యూనస్-మోదీ సమావేశం అభ్యర్థన

పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి జైశంకర్ వెల్లడి

న్యూఢిల్లీ : బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం చీఫ్ అడ్వైజర్ ముహమ్మద్ యూనస్, భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ మధ్య రానున్న 'ది బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీసెక్టోరల్ టెక్నికల్, ఎకనామిక్ కోఆపరేషన్' (బిఐఎంఎస్‌టిఇసి)శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ఒక సమావేశం నిర్వహించాలన్న బంగ్లాదేశ్ అభ్యర్థన పరిశీలనలో ఉన్నదని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఇక్కడ జరిగిన పార్లమెంటరీ కమిటీ సమావేశంలో ఆయన ఈ విషయాన్ని చెప్పినట్లు తెలిసింది. విదేశీవ్యవహారాల పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ 2025సంవత్సరానికి సంబంధించిన తొలి సమావేశం శనివారం జరిగింది. కాగా ఈ సమావేశంలో బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల పట్ల పలువురు ఎంపీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ ఈ విషయంలో భారతదేశం ఏవిధమైన చర్యలు జాగ్రత్తలు వహించిందో చెప్పాలంటూ ఎంపీలు నిలదీశారని విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఢాకాలోని తాత్కాలిక ప్రభుత్వం హిందువులపై జరిగిన దాడులను రాజకీయ ఉద్దేశంతో చేసినవి తప్ప 'మైనార్టీ లక్ష్యంగా చేసిన దాడులు కావని) తెలియజేసిందని జైశంకర్ చెప్పినట్లు వారు చెప్పారు. ఈ సందర్భంగా జైశంకర్ బంగ్లాదేశ్, మాల్దీవులు, మయన్మార్, శ్రీలంకతో భారత్ సంబంధాలను విపులీకరించారని, పాకిస్తాన్, చైనాతో సంబంధాల గురించి మరొకరోజు మాట్లాడతానని చెప్పినట్లు వారు వివరించారు. పాకిస్తాన్ ధోరణి కారణంగా ప్రస్తుతం సార్క్ (ఎస్ఎఎఆర్‌సి) క్రియాశీలంగా లేదని జయశంకర్ స్పష్టం చేశారని, అందువల్ల భారత్ ది బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీసెక్టోరల్ టెక్నికల్ అండ్ ఎకనామిక్ కోఆపరేషన్ (బిమ్స్‌టెక్)ను బలోపేతం చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదని సమావేశంలో చెప్పిఉన్నారని వివరించారు. థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ఏప్రిల్ 2నుంచి 4వరకు జరుగనున్న బిమ్స్‌టెక్ శిఖరాగ్రసమావేశంలో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరయ్యే అవకాశం ఉందని కూడా ఆయన చెప్పారని, ఆ సమావేశంలో ప్రధాని మోదీ సందర్శన ఇంకా ఖరారు కాలేదని చెప్పారని ఆ వర్గాలు తెలియజేశాయి. అయితే ప్రధానమంత్రి మోదీ ఏప్రిల్‌లో శ్రీలంకను సందర్శించనున్నట్లు కూడా జైశంకర్ సమావేశానికి చెప్పారు. బిమ్స్‌టెక్ శిఖరాగ్ర సమావేశం సందర్భంగా ప్రధాని మోదీ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం చీఫ్ అడ్వైజర్ యూనస్‌తో సమావేశం అవుతారని భావించవచ్చా అని ఎంపీలు అడిగిన ప్రశ్నకు ఆయన విషయం పరిశీలనలో ఉన్నదని, అది ఖచ్చితంగా ఉంటుందా లేదా అని మాత్రం చెప్పలేమని జైశంకర్ వారికి చెప్పినట్లు విశ్వసనీయవర్గాలు తెలియజేశాయి. కెసి.వేణుగోపాల్, మనీష్ తివారీ (కాంగ్రెస్‌పార్టీ ఎంపీలు) సహా



ప్రియాంక చతుర్వేది (శివ్‌సేనయుబిటి), ముకుల్ వాస్నిక్ (కాంగ్రెస్) తదితరులు హిందువులను బంగ్లాదేశ్‌లో చంపడమే లక్ష్యంగా పెట్టుకుంటుంటే వాటిని నిలువరించేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందనే అంశాన్ని సమావేశంలో లేవనెత్తారు. ఈ లేవనెత్తిన అంశానికి సంబంధించి తాత్కాలిక ఉపశమనం గురించి ఆలోచించడంలో ప్రభుత్వం నిమగ్నమయ్యిందని జైశంకర్ వారికి సమాధానం ఇచ్చారు. అది నిరవధికంగా కొనసాగిస్తుందని కూడా ఆయన సమావేశంలో స్పష్టం చేశారు. ఈ సమావేశంలో దాదాపు అందరు ఎంపీలు కూడా బంగ్లాదేశ్ టాపిక్ గురించే మాట్లాడటం గమనార్హం. దక్షిణాదికి చెందిన కొంతమంది ఎంపీలు మాత్రం మత్స్యకారుల జీవనాధారమైన చేపల వేట విషయంలో శ్రీలంకతో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. 'ది బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టీసెక్టోరల్ టెక్నికల్, ఎకనామిక్ కోఆపరేషన్' (బిమ్స్‌టెక్)లో బంగ్లాదేశ్, భూటాన్, ఇండియా, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయ్‌లాండ్ దేశాలు సభ్యులుగా ఉన్నాయి. 14అంశాలకు సంబంధించి పరస్పరం సాంకేతిక, ఆర్థిక సహకారం సభ్యదేశాల మధ్య అందించుకుంటారు. బంగాళాఖాతం తీరం పొడవునా ఉండే దక్షిణా ఆసియా, దక్షిణ ఆగ్నేయ ఆసియా దేశాలు బిమ్స్‌టెక్‌లో సభ్యదేశాలుగా ఉన్నాయి. బిమ్స్‌టెక్ 1997 జూన్ 6న ఆవిర్భవించింది.

## లోక్‌సభ రహస్య సమావేశం ఎప్పడూ జరగలేదు

న్యూఢిల్లీ : అతి సున్నితమైన విషయాలపై చర్చించేందుకు లోక్‌సభ రహస్యంగా సమావేశమయ్యేందుకు రాజ్యాంగంలో తగిన నిబంధనలు ఉన్నప్పటికీ ఆ నిబంధనను ఏనాడూ లోక్‌సభ ఉపయోగించలేదు. 1962లో చైనా దురాక్రమణ జరిగినప్పుడు ఈ సమస్యపై చర్చించేందుకు రహస్య సమావేశం జరపాలని కొంతమంది ఎంపీలు ప్రతిపాదించారు. కానీ ఆనాటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నె హ్రూ మాత్రం అందుకు అంగీకరించలేదు. ఒక రాజ్యాంగ నిపుణుడు తాజాగా ఈ విషయం వెల్లడించారు. లోక్‌సభ సభాకార్యకలాపాల ప్రవర్తనా నియమావళి నిబంధనల ప్రకారం ఛాప్టర్ 25లో ఈ ర హస్య సమావేశ నిబంధన ఉంది. ఈ నిబంధనద్వారా అతి సున్నితమైన, దేశానికి సంబంధించిన విషయాలు చర్చించేందుకు లోక్‌సబ ఎంపీలు సమావేశం జరపవచ్చు. కానీ పార్లమెంటు ఏర్పడిన తర్వాత ఇప్పటివరకూ ఈ నిబంధనను భారత అత్యున్నత చట్టసభ ప్రతినిధులు ఉపయోగించలేదు. రూల్ 248 ఉపనిబంధన ఒకటి ప్రకారం సభా నాయకుడు స్పీకర్‌కు ఈ మేరకు ఒక సిఫార్సు చేయవచ్చు. అందుకు ఒక తేదీని నిర్ణయించాలని సభా నాయకుడు స్పీకర్‌ను కోరవచ్చు. ఈ ఛాప్టర్‌లో మరో నిబంధన ప్రకారం, సబ్‌క్లాజు 2 ప్రకారం, ఇలాంటి సమావేశం జరుగుతున్నప్పుడు అపరిచితవ్యక్తులు, సభ్యులు కానివారు ఎవ్వరూ లోనికి ప్రవేశించకూడదు. మరో నిబంధన ప్రకారం ఈ రహస్య సమావేశం కార్యకలాపాలను స్పీకర్ ఆలోచన ప్రకారం ఆదేశిస్తే దానికి రిపోర్టు చేయవచ్చు. ఐతే సమావేశం జరిగేటప్పుడు ఇతర వ్యక్తి ఎవ్వరూ ఈ నిర్ణయాలను, మాటలను రికార్డు చేయకూడదు. ఈ సమావేశంలో గనుక ఏదైనా తీర్మానం చేస్తే లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఈ విధంగా ఒక సమావేశమైతే జరిగిందని ఒక నివేదికను తయారు చేయవచ్చు.

## ప్రజలంతా సుభిక్షంగా జీవించాలి

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**ప్రజాపక్షం/ నిజాంపేట్:** పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా జీవించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ లాల్‌సాబ్ గూడ్‌లో శ్రీ కోటగుట్ట పెద్దమ్మ తల్లి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కూన మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహంతో నియోజకవర్గం ప్రజలు సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. ప్రార్థనా మందిరాలను కలిసికట్టుగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య గౌడ్, అశోక్ కుమార్, శ్రీనివాస్ యాదవ్, లక్ష్మన్, యాదయ్య, బాల చిత్తారి, నగేశ్, కృష్ణ పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



**ప్రజాపక్షం/కూకట్ పల్లి :** అసెంబ్లీ లో బీసీ, ఎస్సీ, వర్గీకరణ బిల్లులు ప్రవేశపెట్టి ఆమోదింపజేయడం చారిత్రాత్మక ఘట్టమని మాజీ కేంద్ర మంత్రి సర్వే సత్యనారాయణ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ, ఎస్సీ బిల్లుల ఆమోదాన్ని హర్షిస్తూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చరిత్రలో సీఎం రేవంత్ రెడ్డి చరిత్ర తిరగ రాశారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ తూము వినయ్ కుమార్, తూము మనోజ్ కుమార్, సాధు ప్రతాప్ రెడ్డి, గూడెపు నాగరాజు, జీవిఆర్ హౌసీ తోచర్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, కృష్ణరాజ్ పుత్, పుష్పరెడ్డి, ఫనింద్ర, ప్రకాష్, సంతోష్, శంకర్, శివ చౌదరి, పోడుగు అప్పారావు, బండి సుధా, పోన్నం రజీత, మారుతి, జోజమ్మ, లక్ష్మీ , తదితరులు పాల్గొన్నారు.

## అమరుల ఆశయ సాధనకు పాటుపడాలి: శ్రీనివాస్



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్థంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాస్ భగత్‌సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య సమరయోధులు భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లని, స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన యోధులు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లని అన్నారు. వారి ఆశయాల సాధనకు, వారు చూపిన బాటలో ప్రతిఒక్కరు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వాసు పాల్గొన్నారు.

# 27మంది సైట్ ఇంజనీర్లపై వేటు

### అవినీతికి పాల్పడటంతో ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ విభాగంలో మామూళ్లకు అలవాటుపడి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తు న్న 27 మంది సైట్ ఇంజనీర్లను ఉద్యోగాల్లోంచి తొలగిస్తూ కమిషనర్ ఇలంబర్తి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. జిహెచ్‌ఎంసి కాప్రా సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లు ఈడిగ మేర్లిన్ మరియం, కరణం యోగేశ్వర్, వోంగంటి అశ్విని, అల్వాల్ సర్కిల్ లోని సైట్ ఇంజనీర్లు పాముల శ్రవణ్ కుమార్, పున్యాల సాయి తేజ, మల్కాజిగిరి సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లుగణపురం రమేష్, గుంటుపల్లి రాజేష్‌రెడ్డి,ఉప్పల్ సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లు కుసుముల్ల దివ్య, ఎండి రీమ, జంగం అరుణ, హయత్‌నగర్ సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లు ఎండి గౌస్ పాషా, సంధ్యా శాంతి,తప్పెట్ల సునీల్ కుమార్, ఎల్‌బి నగర్ సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లు కత్తేరశాల నందిని, సాయి రాము ముద్దగోని, సరూర్ నగర్ సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లు యమజ్జుల సాయి పావని లక్ష్మి , బండ శైలజ, పోలెపల్లి నాగరాజు, కుసుమని సుధీక్షన, సంతోష్‌నగర్ సర్కిల్ లోని సైట్ ఇంజనీర్లు సయ్యద్ యూసుపుద్దీన్, కార్వాన్ సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్ సద్దం భరత్, కూకట్‌పల్లి సర్కిల్‌లోని భుక్య వీరన్న, కుత్బుల్లాపూర్ సర్కిల్‌లోని సైట్ ఇంజనీర్లు దాసరి వెంకటేష్, గోపతి జయశ్రీ, గాజుల రామారం సర్కిల్ లోని సైట్ ఇంజనీర్లు నల్లి జశ్వంత్, వెన్నల సాయిరాం, పున్నంచంద్‌లను సస్పెండ్ చేసారు. సస్పెండయిన సైట్ ఇంజనీర్లు వెంటనే కార్యాలయం నుండి లభించిన గాడ్జెట్లు, సిమ్‌కార్డులను వెంటనే అప్పచెప్పాలని పేర్కొన్నారు. వీరి అవినీతి కార్యకలాపల వల్ల సంస్థకు ప్రతిష్టలకు భంగం కలుగుతోందని పేర్కొన్నారు.

## కొత్త పవర్ బోర్లకు ఎంపి లాడ్స్ నిధులు



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** మల్కాజిగిరి డివిజన్‌లో నాలుగు కొత్త పవర్ బోర్లకు ఎంపి లాడ్స్ నిధులను మల్కాజిగిరి ఎంపి ఈటల కేటాయించారని స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ తెలిపారు. ఓల్డ్ మల్కాజిగిరి, సర్దార్ పటేల్ నగర్, భగత్‌సింగ్ నగర్, హరిజనబస్తీ ప్రాంతాల్లో పవర్ బోర్లు అవసరం ఉందన్న విషయాన్ని స్థానిక నేతలు సునీల్ యాదవ్, రాంలీల ఇందిరా, అటలక్క, వైష్ణవి, సుభాషిణి, ప్రేమ్‌ముదిరాజ్‌లతో కల్సి ఈటెలను కల్సి వినతిపత్రం ఇవ్వటంతో ఎంపి లాడ్స్ నుండి నిధులు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

## కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తాం:హన్మంత్ రెడ్డి



**ప్రజాపక్షం/దుండిగల్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ గండిమైసమ్మ బిఎస్‌ఆర్ విల్లాస్ లో మౌలిక సదుపాలయాలు సరిగా లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కోలన్ హన్మంత్ రెడ్డీను మర్యాదపూర్వకంగా కలిసి వారి సమ్యసలు పై వినతిపత్రం అందజేశారు. సదరు కమిషనర్ తో మాట్లాడి వీలైనంత త్వరలో సిసి రోడ్, డ్రైనేజీ స్పెషల్ ఫండ్స్ ద్వారా వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రంగ రావు, బిఎస్‌ఆర్‌ఎస్ శ్రీహరి కల్చరల్ వెల్ఫేర్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్ రెడ్డి ఉపాధ్యక్షులు వేణు గోపాల్, జనరల్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, రాజ్ కుమార్, సురేష్ కుమార్, రామ రావు, అవినాష్ రెడ్డి, కాలనీ సభ్యులు పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ వాసులు దొడ్ల శ్రీకాంత్ రెడ్డి తండ్రి కి.శే. దొడ్ల అప్పి రెడ్డి, దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి ఘననివాళులు అర్పించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోలన్ హన్మంత్ రెడ్డి, ఈ కార్యక్రమంలో కోలన్ వీరేందర్ రెడ్డి, కోలన్ రాజశేఖర్ రెడ్డి, కోలన్ జీవన్ రెడ్డి, కోలన్ బల్ రెడ్డి, చిట్ల దివాకర్, సిద్దనోల సంజీవ్ రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ త్యాగయోధుడు భగత్‌సింగ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** స్వాతంత్ర సమర యోధుడు, ప్రఖ్యాత ఉద్యమకారుడు షహీద్ భగత్‌సింగ్ ఆదర్శాలను ముందుకు తీసుకుని వెళ్ళాలని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ కార్యదర్శి తోటపల్లి శంకర్ పిలుచ్చారు. జవహర్‌నగర్‌లోని గిరిప్రసాద్ కాలనీలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన భగత్‌సింగ్ 94వ వర్థంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్ అత్యంత ప్రభావశీలి విప్లవకారుడని కొనియాడారు. హిందుస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ పార్టీ వ్యవస్థాపక సమితిలో ఆయన ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ గిరిప్రసాద్ నగర్ కార్యదర్శి మోతె రాజేశ్వరి, గిరిజన సమైక్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్యామల లత, స్వరూప నాయక్, ఎఐటియుసి మండల అధ్యక్షుడు అంబాల ఎల్లయ్య, సిపిఐ సీనియర్ నేతలు కూచమల్ల కుమార్, మహిళా సమైక్య మండల కార్యదర్శి కొత్తపెల్లి కవిత, మహిళా సమైక్య ప్రచార కార్యదర్శి అనసూయ, శ్రీదేవి, ఎఐటియుసి నాయకులు మహేష్, దివాకర్,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**ఇసిఐఎల్‌లో...** ఇసిఐఎల్‌లోని నీలం రాజశేఖర రెడ్డి భవన్ వద్ద ఎఐవైఎఫ్,ఎఐఎస్‌ఎఫ్‌ల ఆధ్వర్యంలో జరిగిన భగత్‌సింగ్ వర్థంతి వేడుకల్లో ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్‌బేగ్, టి.సత్యప్రసాద్‌లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 12 ఏళ్ల చిన్న వయసులోనే స్వాతంత్ర ఉద్యమ పోరాటంలో చేరి 23 ఏళ్ల ప్రాయంలో దేశం కోసం ప్రాణాలర్పించిన సమర యోధుడన్నారు. ఆయన ఆదర్శంలో మతోన్మాద రాజకీయాలను సమూలంగా తిప్పి కొట్టటానికి పోరాటం చేయటమే భగత్‌సింగ్‌కు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శేఖర్, గిరిబాబు, రాజ్‌కుమార్, రాజ్‌కుమార్, సందీప్, ఎఐఎస్‌ఎఫ్ నేతలు సతీష్‌కుమార్, కళా సతీష్, మహేష్ బాబు, రవి, గిరి తదితరులు పాల్గొన్నారు.

**వినాయకనగర్‌లో...** సిపిఐ మల్కాజిగిరి మండల సహకార్యదర్శి కాసర్ల నాగరాజు అధ్యక్షతన వినాయకనగర్‌లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన భగత్‌సింగ్ వర్థంతి కార్యక్రమంలో మల్కాజిగిరి మండల కార్యదర్శి యాదయ్య గౌడ్, ఏఏ అశోక్, జె.రాములు, ఏ.నిరంజన్‌గౌడ్, ఎస్.కె అజీజ్, ఆర్ వెంకటేష్ గౌడ్, ప్రభాకర్, ఎండి యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పోరాటానికి సంపూర్ణ మద్దతు

రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మాజి సిఎం కెసిఆర్‌పై గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంక్షారెడ్డి చేస్తున్న పోరాబాట పాదయాత్ర శామీర్‌పేట శివారుకు చేరుకుంది. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయాంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయా లు, అమలు చేసిన పథకాలు, వివిధ శాఖలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరుగుతున్నట్లు స్పష్టం చేశారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని తప్పు చేస్తే ఎలాంటి వారికైన శిక్షలు తప్పవని హెచ్చరించారు. గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, వెన్నెల, డిసిసి ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, భూంరెడ్డి, ఎల్లక్షన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి పాదయాత్రతో పోరుబాట



**ప్రజాపక్షం/అల్వాల్ :** సంవత్సర కాలంగా ప్రజలకు అందుబాటులో లేని గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెసిఆర్‌ను పదవీ నుంచి తొలగించి గజ్వేల్ నియోజకవర్గంకు తిరిగి ఉపఎన్నికలు నిర్వహించాలని కోరుతూ గవర్నర్‌కు మెమొరాండం ఇవ్వనున్నట్లు సిద్దిపేట డిసిసి అధ్యక్షులు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి రాష్ట్ర మహిళా యూత్ వైస్ ప్రెసిడెంట్ అంక్షారెడ్డి వెల్లడించారు. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ తీరును ఎండగడుతూ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సిద్దిపేట కలెక్టరేట్ నుంచి రాజభవన్‌కు చేపట్టిన పోరుబాట పాదయాత్ర ఆదివారం అల్వాల్ సర్కిల్ లోతుకుంటా చేరుకున్నారు. లోతుకుంటలోని చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహానికి వారు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయనకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ నాయకులు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అంక్షారెడ్డి మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు మాజీ సిఎం కెసిఆర్ అందుబాటులో ఉండటం లేదని అసలు ఆయన ఉన్నారా అని ప్రశ్నించారు. . ఈ కార్యక్రమంలో నాచారం టెంపుల్ మాజీ చైర్మన్ లక్ష్మి నర్సింలు గౌడ్, గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

## సోషలిస్టు రాజ్య స్థాపన కోసం ప్రాణాలర్పించిన యోధుడు భగత్‌సింగ్

సిపిఐ రాష్ట్ర నాయకుడు కె.యేసురత్నం



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** సమ సమాజ స్థాపనే ధ్యేయంగా సోషలిస్టు రాజ్య స్థాపన కొరకు తన ప్రాణాలను అర్పించిన యోధుడు షహీద్ భగత్ సింగ్ అని సిపిఐ రాష్ట్ర నాయకులు కె.యేసురత్నం అన్నారు. భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్‌లో గల భగత్‌సింగ్ విగ్రహానికి సిపిఐ రాష్ట్ర నాయకులు కె.యేసురత్నం పాల్గొని పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రగ్స్‌పై కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడంతో యువత పెడ దారిపడుతున్నారన్నారు. దేశ భవితకు పట్టు కొమ్మలైన యువత నేడు దేశ భక్తిని విస్మరించి దైవ భక్తికి లోనౌవుతున్నారన్నారు. ఊక దంపుడు ఉచితాలను మాని ఉపాధి కల్పించాలన్నారు. కుల, మత వర్గ వర్ణ ధనిక పేద తేడా లేని సమా సమాజ నిర్మాణం జరుగాలంటే సోషలిస్టు రాజ్య స్థాపన తోనే వస్తుందన్నారు. సోషలిస్టు రాజ్య స్థాపన తో భగత్‌సింగ్‌కు నిజమైన నివాళ్ళులర్పించిన వారమవుతామన్నారు. గోదా వెంకటేష్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కత్తుల దుర్గయ్య, జార్జ్, శ్రీనివాస్, బీమేష్, సిపిఐ, ఎఐవైఎఫ్ నాయకులు పి.నర్సయ్య, బాబురావు, రాములు, హరినాథ్ రావు, యాదయ్య, ఆవుల కృష్ణ, వంగాళ శ్రీనివాస్, సహదేవ్‌రెడ్డి, యాదగిరి, సామ్యూల్, ఇమామ్, జంబూ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# స్థిరాస్థి వ్యాపారానికి ఊతం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా నుండి 54 గ్రామాలు మహ హైదరాబాద్‌లో పరిధిలోకి , వికారాబాద్ నుండి బూర్గపల్లి, సిద్దులూర్, చించలం, మునుగాల్, పాతుర్, పిరంపల్లి, పులుసుమామిడి, ధన్నారం, గిరిగెంటి పల్లి, కొంపల్లి, గుడుపల్లి, మద్గుల్‌చిట్టెంపల్లి, వికారాబాద్, పూడుర్ మండల నుండి అంగడిచిట్టేపల్లి, చెన్‌గోముల్, చిలాపూర్, చింతలపల్లి, ఎన్కెపల్లి, మెన్నగూడ, పూడుర్, సోమన్‌గుర్తి, మేడిపల్లి, మీర్జపూర్, మిట్టకంకల్, నిజంపేట్, రేగడిమామిడిపల్లి, పెద్దఉమ్మెత్తల్, కుత్బుల్లాపూర్, తిరుమాలాపూర్, తుర్కెన్నెపల్లి, నవాబుపేట్ మండలం నుండి అక్నాపూర్, చించల్‌పేట్, గంగ్యాడ, గుబ్బడిపత్తేపూర్, లింగంపల్లి, మాదారెడ్డి పల్లి, ముమారక్‌రూ, నవాబుపేట్, పూలపల్లి, పులుసుమామిడి, ఎల్లకొండ, మోమిన్‌పేట్ మండల నుండి చక్రంపల్లి, చీమల్‌దరి, దేవరంపల్లి, పరిగి నుండి చిట్యాల్ మాదారం, రాపోల్, తొండపల్లి గ్రామలను మహనగరం హైదరాబాద్‌ను సువిశాలం చేయాలన్నా లక్ష్యంతో ప్రభుత్వం హెచ్‌ఎండిఏ పరిధిని విస్తరిస్తూ, నూతనంగా హైదరాబాద్ మెట్రోపొలిటన్ రీజయన్‌కు రూపకల్పన చేసింది. వికారాబాద్ జిల్లాలోని 54 రెవెన్యూ గ్రామాలను హెచ్‌ఎంఆర్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. తాజా పరిణామంతో ఇప్పటి వరకు హెచ్ఎండి వరకే కేంద్రీకృతమైన అభివృద్ధి ఇతర ప్రాంతాలకు విస్తరించనుండి, రీజినల్ రింగ్ రోడ్డు ఆర్‌ఆర్‌ఆర్‌వరకు పట్టణీకరణను పెంపోందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకునట్లు తెలుస్తుంది. బాహ్య వలయ రహదారికి ఆరువైపుల పట్టణీకారణ ఎలాగైతే పెరిగిందో, అదే మాదిరాగా రీజినల్ రింగ్‌రోడ్డు పరిసరాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం బావిస్తోంది. ఆర్ఆర్‌ఆర్‌కు బాయటి వైపు ఐదు కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేసే బాధ్యతను మహ హైదరాబాద్ అప్పగించారు. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి జిల్లా పరిధిలోకి వచ్చే గ్రామాలను మహహైదరాబాద్ పరిధిలోకి చేర్చి ఈ పరసర ప్రాంతాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లా వేగంగా అభివృద్ధి చెందడానికి అవకాశం కలుగుతుంది అని గ్రామ ప్రజలు భావిస్తున్నారు. గత రెండేళ్లుగా స్తిరాస్తి వ్యాపారం మందగించిన భూముల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఐదు మండలాలు 54 రెవెన్యూ గ్రామాలను హెచ్‌ఎంఆర్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం తాజా నిర్ణయంతో మళ్లీ స్థిరాస్తి వ్యాపారం ఉపందుకుంటుందని వ్యాపాలు మాట్లాడుకుంటున్నారు.

## రైతు సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం / కొడంగల్:** తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతు ఈ నెల 25వ నుంచి 27వ వరకు నిజామాబాద్‌లోని బిఎల్‌ఎన్ గార్డెన్‌లో మూడు రోజుల పాటు కొనసాగే రైతు సంఘం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. దేశంలోని వివిధ రంగాలకు చెందిన మేదావులు కళాకారులు, కమ్యూనిస్టులు అతిరథ మహారథులు ఈ సభలకు రావడం జరుగుతుందని అందుకు జిల్లాలోని ప్రతి ఒక్కరు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

## నిత్య వ్యాయామంతో శారీరక దృఢత్వం : ఎమ్మెల్యే వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిత్య వ్యాయామంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల డివిజన్ రుక్మిణి ఎస్టేట్స్ కాలనీలోని పార్కులో రూ. 11 లక్షల వ్యయంతో నిర్మించిన ఓపెన్ జిమ్‌ని ఎమ్మెల్యే కెపి వివేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ కాలనీ వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతో పాటు ప్రజలకు ఉపయోగపడే విధంగా ఓపెన్ జిమ్‌లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం వలన శరీరం ఎంతో ఆరోగ్యంగా ఉండడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని చెప్పారు. కాలనీలు, బస్తీలలోని పార్కులను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ప్రజలు పార్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీ వాసులు శేఖర్, నాగరాజు, నర్సింహులు, ప్రేమానందం, ప్రదీప్, శంకర్ రెడ్డి, ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

## ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలు

**ప్రజాపక్షం /కుత్బుల్లాపూర్:** ఆలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని బిఆర్‌ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. చింతల్ డివిజన్ పరిధిలోని రంగానగర్ లో గల శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శి జన్ను లక్ష్మణ్ రావు, కోశాధికారి సరోజ, సత్యనారాయణ, రాం ప్రసాద్, గుమ్మడి రామకృష్ణ, ఆనంద్, కరుణాకర్, ఎళ్లప్ప, హన్మంత్ రావు, రాఘవులు, శాంత, పద్మజారెడ్డి, దుర్గయ్య నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/దుండిగల్ :** తెలంగాణ ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ నాగారగారి ప్రీతంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన దుండిగల్ మున్సిపాలిటీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు చింతకింది సురేష్ ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** ప్రభుత్వానికి ప్రజలకు ఇందిరమ్మ కమిటీ సభ్యులు వారదిగా పనిచేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సూచించారు. ఆదివారం తాండూరు పట్టణ శివారులోని ఎస్‌విఆర్ గార్డన్స్ లో తాండూరు నియోజకవర్గ ఇందిరమ్మ కమిటీ సభ్యుల సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅథితిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళ మంజూరు చేయాలనేదే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేరే సమయం ఇదన్నారు. వాస్తవాలను జనాలకు చేరవేసే బాధ్యత ఇందిరమ్మ కమిటి సభ్యుల బాధ్యతన్నారు. రైతులకు, విద్యార్థులకు, నిరుద్యోగులను, మహిళలను ఉద్యోగస్తులను ఇలా అన్ని వర్గాల సంక్షేమానికై ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ స భ్యు లు రమేష్ మహారాజ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, డిసిసిబి వైస్ చైర్మన్ రవిందర్‌గౌడ్, కోట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అం జయ్య, వైస్ చైర్మన్‌లు నర్సిరెడ్డి, నారాయణరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్‌లు సు రేందర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, అజయ్ ప్రసాద్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ వడ్డే శ్రీనివాస్, మాజీ జడ్పిటిసి శ్రీనివాస్‌రెడ్డి, మంల పార్టీల అధ్యక్షులు గోపాల్, కలాల్ నర్సిములు,నాగప్ప, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## శామీర్‌పేటలో బిఆర్‌ఎస్ కార్యకర్తలకు కెటిఆర్ అభివాదం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సిరిసిల్ల నియోజకవర్గానికి వెళ్తు శామీర్‌పేట పెద్ద చెరువు వద్ద రాజీవ్ రహాదారిలో కొద్దిసేపు ఆగారు. ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు వెళ్తున్న కెటిఆర్‌కు శామీర్‌పేట బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు. కెటిఆర్ కాన్వయ్ నుంచి ప్రజాప్రతినిధులకు, కార్యకర్తలకు చేతులు ఊపుతు అభివాదం చేశారు. డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, మాజీ గ్రంథాలయ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ ఎంపిపి ఎల్లుబాయి, మాజీ జడ్‌పిటిసి అనితలాలి, బిఆర్‌ఎస్ శామీర్‌పేట అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఇతర నాయకులు కెటిఆర్ సిఎం.. సిఎం అంటు పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఆయనకు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కేటిఆర్ తమ కాన్వాయ్‌లో సిరిసిల్ల వైపు వెళ్లారు.

## ఉచిత వైద్య శిబిరంతో పేదలకు మేలు

**ప్రజాపక్షం/అల్వాల్:** పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అల్వాల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అన్నారు. ఆదివారం అల్వాల్ పట్టణ కేంద్రంలోని హరిజన బస్తిలో రెడ్ క్రాస్ హాస్పిటల్ సహకారంతో పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 200 మందికి వికలాంగులు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. ఇలాంటి వైద్య శిబిరాలు పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సిపాలి, మహమ్మద్ అబ్దుల్ హలీం, అల్వాల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షులు సౌందర్యషన్, కేశవరావు, రాజసింహారెడ్డి, నాగేశ్వర రావు, సూర్యప్రకాష్, రామచంద్రయ్య, రమేష్, బిక్షపతి, వెంకటనారాయణ, బాలయ్య, సిపి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## నార్సింగి సమీపంలో రోడ్డు ప్రమాదం

### క్యాబ్ డ్రైవర్ దుర్మరణం.. ఐదుగురికి తీవ్రగాయాలు

**ప్రజాపక్షం/గండిపేట :** మితిమీరిన వేగంతో వెళ్తున్న మహీంద్రా జైలో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ అవతలి రోడ్డుపై దూసుకొచ్చి టాటా సఫారీ కారును ఢీ కొట్టింది. ఈఘటనలో మహీంద్రా జైలో కారు నడుపుతున్న క్యాబ్ డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందగా టాటా సఫారీ కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన ఆదివారం తెల్లవారుజామున ఒంటిగంట ప్రాంతంలో నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గచ్చిబౌలి వైపు మహీంద్రా జైలో కారులో శివరాంపల్లికి చెందిన క్యాబ్ డ్రైవర్ ఆనంద్(34) వెళ్తున్నాడు. మితిమీరిన వేగంతో అతడు తెలంగాణ పోలీస్ అకాడమీ దాటగానే కారు టైరు పేలింది. దీంతో ఒక్కసారిగా కారు పల్టీలు కొట్టుకుంటూ అవతలి వైపు రోడ్డులో పడి ఎదురుగా వస్తున్న టాటా సఫారీ వాహనాన్ని అతివేగంతో ఢీకొంది. ఈ సంఘటనలో రెండు కార్లు నుజ్జు నుజ్జు కావడంతో క్యాబ్ డ్రైవర్ ఆనంద్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సఫారీ కారు ఉన్న ఐదుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన వారందరినీ చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మితిమీరిన వేగంతోను ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

### ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి



**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** మాసబ్ చెరువును కబ్జా చేస్తే ఉపేక్షించేది లేదని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించినందుకే హైడ్రా అధికారులు స్పందించి మాసబ్ చెరువు పరిరక్షణ పనులు ప్రారంభించారని ఆదివారం మాసబ్ చెరువు పరిరక్షణ సమితి అధ్యక్షుడు బచ్చిగళ్ళ రమేష్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను వారి నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. మాసబ్ చెరువులో కబ్జా అయినా ప్రాంతాన్ని గుర్తించి మట్టిని, వ్యర్థాలను తొలగించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాసబ్ చెరువు పరిరక్షణ సమితి సభ్యులు కొంతం యాదిరెడ్డి, గుత్త మహేందర్ రెడ్డి, బొక్క వంశీధర్‌రెడ్డి, ఆశీర్వాదం, భాస్కర్, శ్యామల, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు

## నటరాజ రామకృష్ణకు నీరాజనం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** భరత కళాప్రపూర్ణ పద్మశ్రీ డాక్టర్ నటరాజ రామకృష్ణ 102వ జయంతి, స్వరనర్తన సంస్థ 10వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఎన్టీఆర్ కళాప్రాంగణంలో సంస్థ వ్యవస్థాపకులు దెందులూరి పద్మమోహన్, కర్నాటి నవత ఆధ్వర్యంలో రామకృష్ణకు నృత్య నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఐఎఫ్ఎస్ దెందులూరి నళిని మోహన్, కూచిపూడి నాట్య గురువులు డాక్టర్ భాగవతుల సేతురామ్ కథక్ నాట్య గురువులు అంజిబాబు గురువు మాట్లాడుతూ నటరాజ రామకృష్ణతో ఉన్న అనుబంధాన్ని పంచుకొని, ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా గురుశ్రీ కళాకృష్ణ నేతృత్వంలో నటరాజ రామకృష్ణ శిష్యులలో 12 మంది కళాకారులు ఆంధ్రనాట్యం, పేరిణిలోని వివిధ అంశాలపై చేసిన ప్రదర్శనలను సభికులు వీక్షించి, అభినందించారు.

## రోడ్డుపై బైఠాయించి ఒయులో విద్యార్థుల నిరసన



**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థినులు రోడ్డుపై బైఠాయించారు. సెంటినరీ లేడీస్ హాస్టల్‌లో నీళ్లు రావడంలేదంటూ నిరసనకు దిగారు. గత మూడు రోజులుగా హాస్టల్‌లో ఇబ్బందిగా ఉందని.. అధికారులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడంలేదని వారు వాపోయారు. వేసవి కావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న సెంటినరీ హాస్టల్ డైరెక్టర్ కల్యాణ లక్ష్మి, సూపరింటెండెంట్ పద్మ అక్కడికి చేరుకొని విద్యార్థినులతో మాట్లాడారు. సమస్య పరిష్కరిస్తామని.. విద్యార్థినులు ధర్నా విరమించుకోవాలని వారు సూచించారు.

## లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మించి తీరుతాం

### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కొందుర్గు:** లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ నిర్మించితీరుతామని ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పర్యటించారు. లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌కు పరిపాలన అనుమతులతోపాటు నిధులు కేటాయించడంపై కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేయడంతో పాటు అన్నదాతలకు సాగునీరు, తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట చౌరస్తా నుండి లాల్‌పహాడ్ వరకు నాలుగైన్ల రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. త్వరలోనే నిధులు మంజూరు చేయించడంతో పాటు రోడ్డు విస్తరణ పనులు చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గత ముఖ్యమంత్రి కెసిఆర్ లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్ వద్ద కూర్చీ వేసుకొని నిర్మిస్తామని చెప్పి అన్నదాతలను పూర్తిగా మోసం చేశారని మండిపడ్డారు. ఈ రిజర్వాయర్ పూర్తి చేస్తే ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు శాశ్వత నీటి సమస్య తీరుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్ర బడ్జెట్‌లో ఏనాడు కూడా లక్ష్మీ దేవిపల్లి రిజర్వాయర్‌ను నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం ఎంతో అద్భుతమైందని, బడ్జెట్‌లో నీటి పారుదలకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించడం అభినందనీయమని అన్నారు. షాద్‌నగర్ చరిత్రలోనే కొత్త అధ్యాయమనే విషయాన్ని ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలని సూచించారు. శాసన సభ ఎన్నికల్లో హామీ ఇవ్వడం..ఏడాదిన్నర కాలంలోనే పాలన పరమైన అనుమతులు ఇవ్వడం హర్షనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, మహిళా కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షురాలు పిట్ట రజిత, కాంగ్రెస్ శ్రేణులు పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యమైన వైద్యం అందించాలి

### మంత్రి శ్రీధర్‌బాబు

**ప్రజాపక్షం/ఎల్బీ నగర్ :** ప్రజలకు నాణ్యతమైన వైద్యం అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని, ప్రజాప్రభుత్వంలో ప్రజలకు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం వనస్థలిపురంలోని ఎఫ్‌సిఐ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయూస్‌మన్ రిహబిలిటేషన్ సెంటర్‌ను స్థానిక కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, నిర్వహకులు డా,, జీవికేఆర్ గౌడ్, డా, ఎం రాజేందర్‌రెడ్డి, డా, బి. విజయ్‌కుమార్, డా, కే. కిషోర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ రిహబిలిటేషన్ ఏర్పాటు చేయడం పేదలకు, మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆసుపత్రి తీసుకోరావడం అభినందనీయమన్నారు. న్యూరో, ఫిజీయే థేరఫి అనేక వసతులతో సంబంధించిన పరికరాలు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్యం అదించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## 'స్థానిక' ఎన్నికలే లక్ష్యం

### కాంగ్రెస్ నేతలు ఎంపి అనిల్, నీలిమ పిలుపు



**ప్రజాపక్షం/ ఖైరతాబాద్ :** స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని రాజ్యసభ ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, పిసిసి ప్రధానకార్యదర్శి డా.కోట నీలిమ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త పిలుపు మేరకు 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమం లో భాగంగా ఆదివారం గాంధీభవన్‌లో సికింద్రాబాద్ పరిధి లోని ఐదు నియోజకవర్గాల నాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపి అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో స్థానిక నాయకులు పాదయాత్ర చేపట్టాలన్నారు. వచ్చే ఏడాది జనవరి 26 వరకు ఈ కార్యక్రమం నిరంతరాయంగా జరగాలని సూచించారు. కోట నీలిమ మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పెంచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎంఎల్ఎ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వాలి : సిపిఐ డిమాండ్

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** అర్హులైన పేదలకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం మండల కార్యాలయం ముందు 24న సిపిఐ నిర్వహించ తలపెట్టామని మహాధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు విచ్చేయుచున్నారని తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళకు అప్లై చేసుకుని ఇళ్ళు రాని వారు, ఇళ్ళు లేని వారు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రామకృష్ణ కోరారు.

## రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

### రంగారెడ్డి జిల్లా రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు టి.రాంరెడ్డి విమర్శ



**ప్రజాపక్షం/షాబాద్:** రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాల్సిన సమయం అసన్నమైందని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు టి.రాంరెడ్డి అన్నారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంబేద్కర్ భవన్‌లో రైతు సంఘం రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభ జరిగింది. రాష్ట్ర రైతు సంఘం నాయకుడు టి.రామకృష్ణారెడ్డి, సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరై రైతు సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టి.రాంరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం కార్పోరేట్ శక్తులకు అమ్ముడుపోయి రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఆరోపించారు. రైతు చట్టాలను తుంగలో తొక్కి తెరపైకి నల్ల చట్టాలను తీసుకువచ్చారన్నారు. రాష్ట్రంలో ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన రైతు బంధు, ఆసరా పింఛన్ల పెంపు, ఇండ్ల స్థలాలు ఇవ్వడంతో వైఫల్యం చెందారని ఆరోపించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల మండల కేంద్రంలోని సర్వే నంబర్ 75లో వేసుకున్న గుడిసెలకు రెండేళ్ళు పూర్తి అయ్యాయని, వారికి ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాలతోపాటు రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మహాసభలో రైతు సంఘం నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా టి.రాంరెడ్డి, అధ్యక్షుడిగా మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ప్రభులింగంతోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘం సీనియర్ నాయకుడు భాను సుభాన్‌రెడ్డి, రైతు సంఘం కౌన్సిల్ సభ్యులు, చేవెళ్ల నియోజకవర్గ బాధ్యుడు ఎం.సుభాకర్‌గౌడ్, బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, మహిళా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్ల మంజుల, చేవెళ్ల రైతు సంఘం నాయకులు మల్లారి సత్తిరెడ్డి, నక్క జంగయ్య, శ్రీను, గుండాల శివుడు, వినోద, చంద్రకళ, పుష్పమ్మ, మంగళి శాంతమ్మ, అబ్దుల్లాపూర్ మెట్టు మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, అంజయ్య, నారాయణరెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హాస్టల్ భవనంపై నుంచి దూకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** హాస్టల్ భవనంపై నుంచివెఫకి ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్న సంఘటన ఆదివారం షాద్‌నగర్‌లో చోటు చేసుకుంది. షాద్‌నగర్ మున్సిపల్ పరిధిలోని పాత జాతీయ రహదారి సిఎంఆర్ షాపింగ్‌మాల్ సమీపంలోని ఓప్రైవేట్ హాస్టల్‌లో ఇంటర్ చదువుతున్న విద్యార్థి భవనంపై నుండి దూకి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన చందు అనే విద్యార్థి ఇటీవలే ఇంటర్ పరీక్షలు రాసినట్లు తోటి విద్యార్థులు తెలిపారు. తన గదిలోని ఫ్యాన్‌కు మొదటగా బెడ్‌షీట్‌లో ఉరి వేసుకునేందుకు ప్రయత్నించినట్లు తోటి విద్యార్థులు వివరించారు. ఆ తరువాత అక్కడి నుండి భవనం పై నుండి దూకి ఆత్మహత్యయత్నం చేసుకున్నట్లు తెలిపారు. ఆది చూసిన సిఎంఆర్ సెక్యూరిటి సిబ్బంది చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటర్ పరీక్షలు పూర్తి చేసుకున్న చందు ఎందుకు ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు..ఇందుకు కారణాలు ఏమిటీ అనే విషయాలపై పోలీసులు దర్యాప్తు చేశారు. కానీ తోటి విద్యార్థులు చందు ఆత్మహత్యయత్నంకు ప్రేమ వ్యవహారమే కారణమంటున్నారు. ఇంటర్ పరీక్షలు పూర్తి అయిన విద్యార్థి చందు ఎందుకు ఇంటికి వెళ్ళలేదనే విషయంపై విద్యార్థి సంఘాల నేతలు ఆరాతీయగా ప్రేమ వ్యవహారమే కారణమని తెలిసిందని వివరించారు. ప్రేమించిన అమ్మాయి ఇటీవలే మృతిచెందిందని, అది జీర్ణించుకోలేకనే ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించినట్లు తెలిపారు. సమాచారాన్ని తల్లిదండ్రులకు అందించి, మెరుగైన వైద్యసేవలు అందించాలని విద్యార్థి సంఘాల నేతలు కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయానికి కృషి : అందెల



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తామని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ అందెల శ్రీరాములు యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. రంగారెడ్డి అర్బన్ జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన వనపల్లి శ్రీనివాస్‌రెడ్డిని ఆదివారం ఆయన నివాసంలో అందెల శ్రీరాములు పలువురు నాయకులతో మర్యాధ పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అందెల మాట్లాడుతూ అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్ రెడ్డి నియమితులు కావడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వినర్ దేవేందర్‌రెడ్డి, నడికుడ యాదగిరి, బడంగ్‌పేట కార్పోరేషన్ అధ్యక్షులు రాళ్ళగూడెం రామకృష్ణారెడ్డి, రామిడి వీరకర్ణరెడ్డి, అంబోజి శ్రీనివాస్, అమరేందర్‌రెడ్డి, రేసు నరసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సమస్యల్లేకుండా డివిజన్ అభివృద్ధికి కృషి

### కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి



**ప్రజాపక్షం/సరూర్‌నగర్ :** డివిజన్‌లో సమస్యలేకుండా పరిష్కరించడమే లక్ష్యమని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. అదివారం డివిజన్ పరిధిలోని సాయిబాబానగర్ కాలనీ వాసులతో కలిసి కార్పోరేటర్ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరుచూ డ్రైనేజీ బ్లాక్ కావడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు ఆయన స్పందించారు. జలమండలి సిబ్బందితో సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఎలాంటి సమస్య ఉన్న ఒక ఫోన్ కాల్‌తో అందుబాటులో ఉంటానని వెల్లడించారు. డివిజన్‌లో సమస్యలు లేకుండా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జలమండలి సిబ్బంది నర్సింగ్, నరేష్, కాలనీ అధ్యక్షులు పవన్, మురళీ, వెంకట్, శ్రీధర్ పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

### ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్‌గౌడ్




**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ తుర్కయంజల్ మున్సిపాలిటీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య, ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శివకుమార్‌లు మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, యువతకు భగత్‌సింగ్ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దర్శన్, బిఎస్‌పి తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు పట్నం రమేష్ కురుమ, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ నాయకులు శ్రీకాంత్, గండికోట శివ, వివేక్, రెడ్డినాయక్, పిల్లి కృష్ణ ,బ్రహ్మయ్య, హనుమంతు, కోట్య నాయక్, నాగేశ్వర్, సురేష్, నాని పాల్గొన్నారు

**ఎల్బీ నగర్ :** హయత్ నగర్ మండల కేంద్రంలో ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో విప్లవ వీరులు షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని నిర్వహించారు. వారి చిత్రాపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, జిల్లా గర్ల్స్ కన్వీనర్ శ్రావణి మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు చిరుప్రాయంలోనే దేశ స్వాతంత్రం కోసం ప్రాణత్యాగం చేసి ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్ని ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో విద్యార్థులు విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు చేయాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి మర్రి శోభన్, ఎఐఎస్ఎఫ్ నాయకులు బొంగు అరుణ్‌కుమార్‌గౌడ్, ఈనపల్లి ఉపేందర్, వీరమల్ల శివ, జూనోతల భాను ప్రకాష్, గాలెంక కాశి, గంగరాజు కృష్ణ, సాయి, సురేష్ పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని నేటి యువత సమాజ సేవలో ముందుకు సాగాలని ఎఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆకాష్ నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం షాహిద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ నేటి యువత చెడు అలవాట్లకు పోకుండా సమాజ అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యేందుకు కృషి చేయాలన్నారు.

**సరూర్‌నగర్ :** విప్లవ వీరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం యువత కృషి చేయాలని మహేశ్వరం నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి బి.దత్తునాయక్ అన్నారు. అదివారం అమరవీరుల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ పరిధిలో భగత్‌సింగ్ జీవిత చరిత్ర పుస్తకాలను దత్తునాయక్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లు రగిల్చిన జాతీయోద్యమ స్ఫూర్తి నిప్పుకణంలా కోట్లాది మంది గుండెల్లో వెలుగుతూనే ఉందన్నారు. వందేమాతరం, అహింస, సత్యాగ్రహం వంటి మాటలే వినిపిస్తున్న రోజున భగత్‌సింగ్ ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ యువతను స్వాతంత్ర ఉద్యమాల్లో ముందుకు తీసుకెళ్ళారన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కర్నాటి మనోహర్, వత్తుల రఘుపతి, చంద్రన్న, నాజు, నరసింహ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.








ఫోకస్

# ఆరోగ్యం



## హంటావైరస్‌తో జాగ్రత్త!

వ్యాధి సోకిన 18 వారాలను ప్రోడ్రోమల్ దశగా పేర్కొంటారు.




హంటావైరస్‌తో జాగ్రత్తగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) హెచ్చరిస్తున్నది. ఇది అరుదైనదేగానీ తీవ్రమైన వైరస్. ఎలుకలు లేదా రోడెంటియా జాతి క్షీరదాల మూత్రం, మలం, లాలాజలం ద్వారా వ్యాపిస్తుంది. ఈ వైరస్ పల్మనరీ సిండ్రోమ్ (హెచ్‌పిఎస్), మూత్రపిండ సిండ్రోమ్‌తో రక్తస్రావం జ్వరం (హెచ్‌ఎఫ్‌ఆర్‌ఎస్) వంటి ప్రాణాంతక అనారోగ్యాలకు కారణమవుతుంది. ప్రధానంగా ఎలుకల వ్యర్థాల ఏరోసోలైజేషన్ ద్వారా, ప్రత్యక్ష స్పర్శ ద్వారా లేదా అరుదుగా కాటు ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందని నిపుణులు అంటున్నారు. మానవుని నుండి మానవునికి సంక్రమణ చాలా అరుదు. వ్యాధి సోకిన 18 వారాలను ప్రోడ్రోమల్ దశగా పేర్కొంటారు. ఆ సమయంలో జ్వరం, చలి, కండరాల నొప్పులు, అలసట, వికారం, వాంతులు, విరేచనాలు వంటి ఫ్లూ సంబంధిత లక్షణాలు కనిపిస్తాయి. ఈ దశలో సరైన చికిత్స చేయించుకోకపోతే, తీవ్రమైన దశ (హెచ్‌పిఎస్) ప్రారంభమవుతుంది. శ్వాస ఆడకపోవడం, దగ్గు, ఛాతీ బిగుతుగా ఉండటం, ఊపిరితిత్తులలో ద్రవం పేరుకుపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఒక్కోసారి గుండె ఆగిపోయే అవకాశం కూడా ఉంది. రైతులు, నిర్మాణ కార్మికులు, హైకర్లు, శిబిరాలకు వెళ్లేవారు లేదా ఎలుకలు అధికంగా ఉన్న ప్రాంతాలను నిర్వహించేవారు ఈ వ్యాధిన బారినపడే అవకాశాలున్నాయి. ముందు జాగ్రత్తగా, ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు, గర్భిణులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులు ఎలుకలకు దూరంగా ఉండాలి. ఎందుకంటే, ప్రస్తుతానికి ఈ వ్యాధికి నిర్దిష్ట యాంటీవైరల్ చికిత్స లేదు. వైద్య సమయంలో ఆక్సిజన్ థెరపీని ఉపయోగిస్తారు. తీవ్రమైన కేసులను ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉంచి చికిత్స జరిపిస్తారు. ఇళ్ళు, కార్యాలయాలను ఎలుకల రహితంగా ఉంచడం ద్వారా ఈ వ్యాధి ప్రబలకుండా జాగ్రత్తపడాలి. ప్రవేశ ద్వారాలను మూసివేయడం, ఎలుకలు తిరిగే ప్రాంతాలను శుభ్రపరిచేటపుడు గ్లోవ్స్ వంటి రక్షణ పరికరాలు వాడడం వల్ల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు.

## గుర్తించదగిన వ్యాధిగా కేన్సర్!



కేన్సర్‌ను చాలా మంది గుర్తించదగిన వ్యాధిగా పేర్కొంటూ, అధికారికంగా ఈ విషయాన్ని ధ్రువీకరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అయితే, కేన్సర్ అంటు వ్యాధిలా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించేది కాదని, అందుకే, గుర్తించదగిన వ్యాధుల జాబితాలో చేర్చలేమని కేంద్రం వాదిస్తున్నది. మొత్తం మీద కేన్సర్‌పై ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చ జోరందుకుంది. పాముకాటును 2024లో నోటిఫై చేయదగిన వ్యాధిగా గుర్తించడం, లెడ్ పాయిజనింగ్‌ను అమెరికా నోటిఫై చేయదగిన వ్యాధిగా 1995లో తీర్మానించడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకుంటే, ప్రభుత్వం చెప్తున్న అభ్యంతరాలకు విలువ లేదని స్పష్టమవుతుంది. గుర్తించదగిన వ్యాధి అంటే రియల్ టైమ్ ఎపిడెమియోలాజికల్ ట్రాకింగ్, వనరుల కేటాయింపు, ముందస్తు చర్యల కోసం ఆరోగ్య సంరక్షణ ప్రదాతలు ప్రభుత్వ అధికారులకు చట్టబద్ధంగా నివేదించాలి. అంటువ్యాధి వ్యాధుల చట్టం, 1897 ప్రకారం, పెద్ద సంఖ్యలో ఒక వ్యాధి వేగంగా వ్యాప్తి చెందడాన్ని అంటు వ్యాధిగా పేర్కొంటుంది. కాగా, ప్రపంచ వ్యాధుల పర్యవేక్షణ, నియంత్రణకు సహాయపడే దిశగా, ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌ఒ) కొన్ని వ్యాధులకు నోటిఫికేషన్‌ను తప్పనిసరి చేసింది. ఉదాహరణకు క్షయ, మలేరియా, కోవిడ్ 19 వంటి అంటు వ్యాధులు సాధారణంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున వాటిని నోటిఫై చేయాల్సి ఉంటుంది. అయితే, భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పాముకాటును ఈ వర్గంలో చేర్చింది. నిజానికి పాముకాటు అంటు వ్యాధి కోవలోకి రాదు. అయినప్పటికీ, గుర్తించతగిన వ్యాధిగా ప్రకటించింది. భారతదేశ జనాభాలో కేవలం 16 శాతం మందికి మాత్రమే కేన్సర్ వ్యాధి సోకుతున్నట్టు నేషనల్ కేన్సర్ రిజిస్ట్రీ ప్రోగ్రామ్ (ఎన్‌సిఆర్‌పి) పేర్కొంటున్నది. అయితే, అక్కడ సమగ్ర డేటా లేకపోవడంతో, కేన్సర్ తీవ్రతను అర్థం చేసుకోవడంలో పార్లమెంటరీ కమిటీకి ఇబ్బందులు తప్పలేదు. మెరుగైన విధానాలను అనుసరించడం ద్వారా సరైన లెక్కలను తేల్చాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తున్నది. మెరుగైన డేటాతో, ధూమపానం, వాయు కాలుష్యం వంటి కేన్సర్ ప్రమాద కారకాలను నియంత్రించడం ద్వారా దాదాపు 50 శాతం కేన్సర్ మరణాలను నివారించవచ్చని అంటున్నారు. గర్భాశయ కేన్సర్ వంటి కొన్ని కేన్సర్లు స్పర్శ ద్వారా వ్యాపించే హ్యూమన్ పాపిల్లోమావైరస్‌తో ముడిపడి ఉంటాయి. అందుకే, కేన్సర్‌ను 'డాక్యుమెంట్ చేయదగిన వ్యాధి' గా వర్గీకరించాలని నిపుణులు ప్రతిపాదిస్తున్నారు. కేన్సర్‌ను నోటిఫై చేయడం వల్ల పొగాకు, వాయు కాలుష్యం, రసాయనాలు వంటి ప్రమాద కారకాలను నియంత్రించాలి. తద్వారా, కేన్సర్ ప్రమాదాలు తగ్గించాలి. దేశంలో 17 రాష్ట్రాలు అంతర్గత పరిపాలనా ఆదేశాల ద్వారా కేన్సర్‌ను నోటిఫై చేశాయి. జాతీయ స్థాయిలో ఇలాంటి అదేశం అవసరమనే విషయాన్ని హైలైట్ చేశాయి. కేరళ, మిజోరం వంటి కేన్సర్ సంభవం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల నుంచి ఈ డిమాండ్ పెరుగుతున్నది. నోటిఫై చేసిన జాబితాలో కేన్సర్ ఉంటే, చికిత్స, కారకాల నియంత్రణ వంటి అంశాలపై కేంద్ర ప్రభుత్వ మద్దతు పొందవచ్చు. కాగా, ఆస్ట్రేలియా వంటి దేశాలు కేన్సర్‌ను నోటిఫై చేయదగినవిగా ప్రకటించాయి. యునైటెడ్ కింగ్‌డమ్ కేన్సర్ నమోదును తప్పనిసరి చేసింది. దీనికి విరుద్ధంగా, భారతదేశంలో ఎన్‌సిఆర్‌పి నమోదు ఐచ్ఛికంగా కొనసాగుతున్నది. కేన్సర్ అనేది అంటువ్యాధుల జాబితాలోకి రాదని, దీని వల్ల ప్రజారోగ్యానికి తక్షణ ముప్పు అంటూ ఏదీ లేదని ప్రభుత్వం అంటున్నది. అందుకే, నోటిఫికేషన్ అవసరం లేదని స్పష్టం చేస్తున్నది. ఇలావుంటే, నోటిఫై చేయదగిన వ్యాధులు వ్యక్తిగత గోప్యత కంటే ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తాయి. ఇది రోగ నిర్ధారణ కోరకుండా ప్రజలను నిరోధించవచ్చు. కేన్సర్ రోగుల పట్ల సమాజం విచిత్రంగా ప్రవర్తించడం కొత్తకాదు. అందుకే, చాలా మంది కేన్సర్ రోగులు తమ వ్యాధి గురించి బయటకు చెప్పేందుకు ఇష్టపడరు. ప్రభుత్వం నోటిఫై చేస్తే, అలాంటి వారు కూడా తప్పనిసరిగా రోగ వివరాలను తప్పక నమోదు చేయించుకోవాలి.కేన్సర్‌కు వ్యక్తిగతీకరించిన దీర్ఘకాలిక చికిత్స అవసరమని, నోటిఫికేషన్ సాధారణంగా దీర్ఘకాలిక వ్యాధులకు కాకుండా అత్యవసర నియంత్రణకు మాత్రమే జారీ అవుతుందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ పేర్కొంటున్నది. ప్రస్తుతానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) కింద ఎన్‌సిఆర్‌పి, హాస్పిటల్‌బేస్డ్ (హెచ్‌బిఆర్), పాపులేషన్‌బేస్డ్ రిజిస్ట్రీలు (పిబిఆర్) ద్వారా కేన్సర్ జనాభా, రోగ నిర్ధారణ, చికిత్స, మనుగడ ట్రాకింగ్ జరుగుతున్నది. కానీ, సమగ్రమైన సమాచారం మాత్రం అందడం లేదు. 2022 నాటికి , భారతదేశంలో 269 హెచ్‌బిఆర్‌లు, 38 పిబిఆర్‌లు ఉన్నాయి. రోగ తీవ్రతను లేదా దాని బారి పడుతున్న వారి సంఖ్యతో పోల్చుకుంటే, ఇవి ఏమాత్రం సరిపోవు. 2023లో, 14 లక్షలకు పైగా కేన్సర్ కేసులు నమోదయ్యాయి. ప్రతి లక్ష మందికి 100 మందికి వ్యాధి నిర్ధారణ అయింది. అయితే, నమోదుకాని కేసులు ఇంకా చాలానే ఉంటాయన్న అభిప్రాయం బలంగా వినిపిస్తున్నది. ఈ పరిస్థితుల్లో కేన్సర్ నిఘాను బలోపేతం చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గర్భాశయ, ఊపిరితిత్తుల కేన్సర్ వంటి అధిక ప్రమాదకర కేన్సర్‌లను తప్పనిసరి డేటా సేకరణ కోసం డాక్యుమెంట్ చేయదగిన వ్యాధులుగా వర్గీకరించాలి. కేంద్రీకృత కేన్సర్ రిజిస్ట్రీని రూపొందించడానికి కేన్సర్ డేటా సేకరణను ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ఎబిడిఎం) తో అనుసంధానించాలి. లక్ష్యాన్ని చేరుకోవడానికి వీలుగా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ, చికిత్సకు కట్టుబడి ఉండేలా చూసుకోవడానికి కేన్సర్ స్క్రీనింగ్ రికార్డులను కొవిన్ లాంటి ప్లాట్‌ఫామ్‌లతో అనుసంధానించడం అవసరం. దేశవ్యాప్తంగా కేన్సర్ పరీక్ష, సంబంధిత సౌకర్యాలను విస్తరించడానికి పిబిఆర్‌ల సంఖ్యను పెంచాలి. అధికప్రమాదకర కేన్సర్‌ల కోసం సార్వత్రిక స్క్రీనింగ్‌ను అమలు చేయాలి. స్థానిక ఆరోగ్య కార్యకర్తలుకేన్సర్ కేసులను చురుగ్గా నివేదించడానికి, ఇంటింటికి అవగాహన ప్రచారాలను నిర్వహించాలి. ఈ అధికారం వారికి కల్పించాలి. ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన కింద కేన్సర్ కవరేజీని విస్తరించాలి. కేన్సర్ వ్యాధికి అత్యంత ఖరీదుతో కూడిన దీర్ఘకాలిక చికిత్స అవసరం కాబట్టి బీమా మద్దతును పెంచాలి. కేన్సర్ సోకినప్పటికీ, దానిని జయించిన వారిని 'రాయబారులు'గా ప్రోత్సహించాలి. ఇలాంటి చర్యలు తీసుకుంటే, కేన్సర్ వ్యాధిగ్రస్తులకు ఊరట లభిస్తుంది. కేన్సర్‌పై స్పష్టమైన సమాచారం లభిస్తుంది. అవగాహన పెరుగుతుంది.

### 'టి'సెల్ థెరపీతో ఉత్తమ ఫలితాలు



భారత మొట్టమొదటి చిమెరిక్ యాంటిజెన్ రిసెప్టర్ (సిఎఆర్/ కార్) నిర్వహించిన 'టి'సెల్ థెరపీతో లుకేమియా, లింఫోమా వంటి ప్రాణాంతకమైన వ్యాధుల్లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. 'ది లాన్సెట్ హెమటాలజీ'లో ప్రచురించిన వ్యాసాన్ని అనుసరించి, కార్ 'టి' సెల్ థెరపీ 73 శాతం ప్రతిస్పందన రేటును నమోదు చేసింది. ఐఐటి బాంబే, టాటా మెమోరియల్ సెంటర్, ఇమ్యునోయాక్ట్ (ఐఐటి బాంబే అనుబంధ సంస్థ) సంయుక్తంగా నిర్వహించిన ఈ ట్రయల్‌లో, లుకేమియా (బ్లడ్ కేన్సర్), బోన్ మారో (ఎముక మజ్జ) కేన్సర్ వంటి పునఃస్థితి లేదా వక్రీభవన 'బి' కణ కేన్సర్లతో పాటు లింఫోమా (శోషరస వ్యవస్థ కేన్సర్) ఉన్న రోగులను పరీక్షించారు. వారికి చికిత్సా ఎంపికలు చాలా పరిమితంగా ఉంటాయి కాబట్టి, ఇలాంటి రోగులను అధ్యయనానికి ఎంపిక చేశారు. 'టి' సెల్ థెరపిని ప్రయోగించిన రోగుల్లో 73 శాతం మందిలో సానుకూల స్పందన కనిపించింది. దీనితో అత్యంత భయంకరమైన, ప్రాణాంతకమైన కేన్సర్ సోకిన వారిలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. మన దేశంలో అభివృద్ధి చేసిన 'టి' సెల్ థెరపీ ప్రపంచ వ్యాప్తంగా ఇతర దేశాల్లో ఉండే చికిత్సా విధానానికి దీటుగానే ఉంది. కానీ, వాటి కంటే 20 రెట్లు చౌకైనది. ఈ చికిత్సకు ఇతర దేశాల్లో సగటున 34 కోట్ల రూపాయలు ఖర్చయితే, ఇక్కడ కేవలం 25 లక్షల రూపాయలతో చికిత్స లభిస్తుంది. మొత్తం ఖర్చు సుమారు 8 కోట్ల వరకూ ఉండవచ్చు. కాగా, కార్ 'టి' సెల్ థెరపీ క్లినికల్ ట్రయల్స్‌లో వెలుగు చూసిన దుష్ప్రభావాలు చాలా సాధారణమైనవి, వాటిని నయం చేయడం లేదా అధిగమించడం కష్టం కాకపోవచ్చని నిపుణులు అంటున్నారు. కొంత మంది రోగులు న్యూట్రోపెనియా (తక్కువ తెల్ల రక్త కణాలు), థ్రోంబోసైటోపెనియా (తక్కువ ప్లేట్‌లెట్లు), అభివృద్ధి చెందుతున్న రక్తహీనత (తక్కువ ఎర్ర రక్త కణాలు) వంటి సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, కేన్సర్ తీవ్రతతో పోలిస్తే ఇవి సాధారణమైనవి అభిప్రాయపడుతున్నారు. కొంత మంది రోగులకు సైటోకిన్ రిలీజ్ సిండ్రోమ్ (సిఆర్‌ఎస్) కనిపించింది. దీని వలన జ్వరం , వాపును గుర్తించారు. కార్ 'టి' సెల్ థెరపీని ఒక అధునాతన కేన్సర్ చికిత్సగా పేర్కోవచ్చు. ఇది కేన్సర్‌ను మరింత సమర్థవంతంగా పోరాడటానికి రోగి యొక్క 'టి' కణాలను తయారు చేస్తుంది. రోగి యొక్క 'టి' కణాలను వారి రక్తం నుండి సంగ్రహించి జన్యుపరంగా మార్పు చేస్తారు. తద్వారా కేన్సర్ కణాలను గుర్తించి దాడి చేయడానికి వాటిని ఉపయోగిస్తారు. ఈ మార్పు చెందిన కణాలను కార్ 'టి' కణాలు అని పిలుస్తారు , ఇవి 'బి' కణాలను లక్ష్యంగా చేసుకుని, పునఃస్థితిని నివారించడానికి రోగిలోకి ప్రవేశపెడతారు. 'బి' సెల్ కణితులు తిరిగి వచ్చినప్పుడు లేదా వక్రీభవనంగా మారినప్పుడు చికిత్స ఎంపికలు పరిమితంగా ఉంటాయి. అలాంటి పరిస్థితుల్లో రోగి మరణించే అవకాశాలు ఎక్కువ. కార్ 'టి' సెల్ థెరపీ రోగికి నిర్దిష్ట చికిత్సా విధానాలను అందించగలుగుతుంది. ఎందుకంటే సవరించిన 'టి' కణాలు శరీరంలోనే ఉంటాయి. కేన్సర్ పునరావృతం కాకుండా దీర్ఘకాలిక రోగనిరోధక శక్తిని అందిస్తాయి. ఈ విధానం పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే, లుకేమియా, బోన్ కేన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులకు మెరుగైన చికిత్స లభిస్తుంది.

## రాజ్యాంగ మూల సూత్రాలను దెబ్బతీస్తున్న బిజెపి ప్రభుత్వం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్



**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ మూల సూత్రాలను దెబ్బతీస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ ఆరోపించారు. ఆదివారం బెల్లంపల్లి పట్టణంలోని బాశెట్టి గంగారం విజ్ఞాన్ భవన్ సిపిఐ కార్యాలయంలో పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సమావేశానికి కలవేన శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మతతత్వ రాజకీయాల ను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. నియోజకవర్గాల డీలిమిటేషన్ పేరుతో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించే కుట్రలు జరుగుతున్నాయన్నారు. రైతుచట్టాలను రద్దు చేసినప్పటికీ, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా బడాపెట్టుబడిదారులకు మద్దతుగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. భారత కమ్యూనిస్టు పార్టీ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జిల్లావ్యాప్తంగా శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, మేకల దాసు, రేగుంట చంద్రశేఖర్, చిప్ప నరసయ్య, దాగం మల్లేష్, బికెఎంయు జాతీయ సమితి సభ్యులు అక్కపల్లి బాబు, పట్టణ సహాయకార్యదర్శి కొంకుల రాజేష్, తాండూర్ మండల కార్యదర్శి సాలిగామ సంతోష్, బికెఎంయు జిల్లా కార్యదర్శి గుండా చంద్రమాణిక్యం, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు డిఆర్ శ్రీధర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొండు బానేష్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల కోసం నిరంతరం శ్రమిస్తున్న పార్టీ సిపిఐ : బాల్‌నర్సింహ్మా



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** పేదలకోసం నిరంతరంగా శ్రమిస్తూ, బలహీనవర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న పార్టీ భారత కమ్యూనిస్టుపార్టీ అని పార్టీ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని లక్ష్మణాచారి భవనం సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తాడూరు గ్రామానికి చెందిన గొర్ల సత్యం, కొత్తల్ల బుచ్చయ్య, గొర్ల రామచంద్రయ్య, గడ్డం రాములు, జంపయ్యలు సిపిఐలో చేరారు. బాల్‌నర్సింహ్మా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాల్‌నర్సింహ్మా మాట్లాడుతూ సిపిఐ చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. విద్యుత్ ఉద్యమం, ఇండ్లపోరాటం, సీలింగుభూమి, ఇందిరమ్మ, జాతీయ ఉపాధిహామీ పథకం, సమాచారహక్కుచట్టం సాధించడంలో సిపిఐ ప్రధానపాత్ర పోషించింద న్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్ల వెంకటయ్య, డిహెచ్‌పిఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి లక్ష్మి పతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్, ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శివకృష్ణ, సభ్యులు కేశవులుగౌడ్, పెద్దకుర్మయ్య, పి.కృష్ణాజి, బాబు పాల్గొన్నారు.

## పట్టణ పేదలకు 'ఇందిరమ్మ' భరోసా

సిపిఐ నేత బాగం డిమాండ్



**ప్రజాపక్షం/ఖమ్మం :** పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న పేదలకు జాతీయ ఉపాధి హామీ పథకంతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలు చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. వ్యవసాయరంగం సంక్షోభం కారణంగా చిన్న, సన్నకారు రైతులు, గ్రామీణ పేదలు నగరం, పట్టణాలకు వలస బాట పట్టారని ఆయన తెలిపారు. ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 49, 50,51,58 డివిజన్ల సిపిఐ సంయుక్త మహాసభ ఆదివారం వివిసి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. సిపిఐ పతాకాన్ని మేకల వీరమ్మ ఆవిష్కరించారు. మేకల రవికుమార్, జ్వాలా నర్సింహారావు, బోడ రమేష్ అధ్యక్షవర్గంగా వ్యవహరించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై హేమంతరావు మాట్లాడుతూ పట్టణీకరణ వేగవంతమైన తర్వాత పట్టణ పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు. ఖమ్మంజిల్లాలో మూడింట ఒక వంతు జనాభా ఖమ్మం నగరంలోనే నివసిస్తున్నారని పెరిగిన జనాభాకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన జరగాలని ఆయన కోరారు. రోడ్లు, డ్రైనేజీలతో పాటు తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. పట్టణాల్లో నివసిస్తున్న ప్రజలకు నివాస స్థలం ప్రధానమైందని పట్టణ పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలన్నారు. సంక్షేమ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ భరోసా అమలు చేయాలన్నారు. నగరంలో నెలకొన్న సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఖమ్మం నగరంలో వేలాది మందికి ప్రభుత్వ భూములు నాగార్జునసాగర్ కాలువ కట్టలపై జీవించే అవకాశాన్ని కల్పించిన పార్టీ సిపిఐ మాత్రమేనన్నారు. ప్రభుత్వపరంగా నగరానికి దూరంగా గతంలో కాలువలపై నివసించిన వారికి నివాస స్థల అవకాశం కల్పించడంలో సిపిఐ కీలక భూమిక పోషించిందన్నారు. పోరాటాలు మాత్రమే ప్రజా సమస్యలను పరిష్కరిస్తాయని ఆయన తెలిపారు. నగరంలో పార్టీ విస్తృతికి, ప్రజా పోరాటాలకు కార్యకర్తలను సన్నద్ధం చేయాలని హేమంతరావు పిలుపునిచ్చారు. సభలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు మహ్మద్ సలాం, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, బోడ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## అసమానతలులేని సమాజమే లక్ష్యం

సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** అసమానతలు లేని సమాజమే సిపిఐ లక్ష్యమని పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. ఆదివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశం సమావేశంలో సాబీర్ పాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సిపిఐ పార్టీ అధికారం ఉన్నా లేకున్నా ప్రజల గుండెల్లో ఉందన్నారు. పేద ప్రజల కోసం పుట్టిన పార్టీ పేద ప్రజలు ఉన్నంత వరకు ఉంటుందన్నారు. భారతదేశ పోరాట వీరులని తయారు చేసింది కమ్యూనిస్టు పార్టీ అన్నారు. నిత్యం పోరాటాలు చేస్తుంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ కమిటీలు వేసుకోవాలని, ఏప్రిల్ 1 నుండి 15 వరకు అన్ని గ్రామ కమిటీలు పూర్తి చేసి మండల మహాసభ జరపాలన్నారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి నరెడ్ల రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేసు ఎల్లయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షుడు పరమ ఇమ్మానియేల్, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు వజ్జ పగడలయ్య, కొమరం హనుమంతరావు, రహీం, ఎఐటియుసి మండల కార్యదర్శి కుంట సహదేవ్, నాయకులు మల్లేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మీ, శివ, సురేందర్, సూర్యనారాయణ, నర్సింహారావు, కాంతారావు, సతీష్, శివ, ఎ ప్రశాంత్, గణేష్, నాగరాజు పాల్గొన్నారు.



## భగత్‌సింగ్ పోరాటస్ఫూర్తితో ఉద్యమాలు

బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు





**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి చిరునవ్వుతో ఉరికొయ్యలను ముద్దాడిన విప్లవ యోధులు సర్దార్ భగత్ సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను స్ఫూర్తిగా తీసుకొని దోపిడీ లేని, సమ సమాజ నిర్మాణం కోసం పోరాడాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. వరంగల్ కొత్తవాడలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ అమరవీరులు కలలుగన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సమ సమాజ నిర్మాణానికి యువతరం ఉద్యమించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆడెపు దేవేందర్, రమేష్, మనుబోతుల కుమార్, బొద్దుల బిక్షపతి,షేక్ హాఫీజ్ , వొల్లాల కిషోర్, మాదాసి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు

**నిజామాబాద్ ప్రతినిధి :** భారత స్వాతంత్రోద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవకారులలో భగత్ సింగ్ ఒకరని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ అన్నారు. ఆదివారం సిపిఐ జిల్లా కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ ఆశయాలను ఆలోచనలను స్ఫూర్తిగా యువత సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి ఓమయ్య, రాజేశ్వర్, రఘురాం, అంజలి, రాధాకుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

**దేవరకొండ :** ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో దేవరకొండ పట్టణంలోని పర్వత్‌రెడ్డి భవన్‌లో ఆదివారం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించి ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వలమల్ల ఆంజనేయులు మాట్లాడుతూ సమసమాజ నిర్మాణానికి యువతరం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పునుంతల వెంకటయ్య, జ్యోతిబస్, వెంగళయ్య, కృష్ణారెడ్డి, అంతయ్య, పర్వ, వెంకటయ్య, నాసిం, కిరణ్, రమేష్, సిద్దు, కిరణ్, శ్రీకాంత్, శివ, చరణ్, ప్రణేష్, శ్రీశాంత్, శివాజీ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

**సూర్యాపేట :** స్వాతంత్రోద్యమంలో ఉరికొయ్యలను ముద్దాడుతూ ప్రాణాలర్పించిన గొప్ప విప్లవకారుడు భగత్‌సింగ్ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాఘవప్లాజ సెంటర్‌లో భగత్‌సింగ్ వర్ధంతిని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు గోపగాని రవి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతే భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో నేటి యువత సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కంబాల శ్రీనివాస్, గుండు వెంకటేశ్వర్లు, గుగులోతు రాజారాం నాయక్, బూర వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, శ్రీకాంత్, మహేష్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.








# స్థానికం REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## భగత్‌సింగ్ స్ఫూర్తితో సమసమాజనిర్మాణానికి ఉద్యమించాలి



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** భగత్‌సింగ్ స్ఫూర్తితో సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించాలని డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము భరత్ పిలుపునిచ్చారు. ఆదివారం తాడూరు మండలం అంతారం గ్రామంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఘనంగా దేశ స్వాతంత్ర్యం కోసం అతిచిన్న వయసులో ఉరికంభం ఎక్కిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల 94వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రతి ఒక్కరూవారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లానాయకులు కొమ్ము కుర్మయ్య, బంగారయ్య, జక్కయ్య, శివుడు, ఆంజనేయులు, కిష్టమ్మ, రేణుక, శాంతమ్మ, పెద్దకిష్టమ్మ, శైలజ, శివాని, శిరీష, యమున, చంద్రం పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాటం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాం




**ప్రజాపక్షం/పాన్‌గల్ :** ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పార్టీ నిరంతర పోరాటం కొనసాగిస్తుందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాం అన్నారు. పాన్‌గల్ , వీపనగండ్ల మండలాల నుంచి వనపర్తిలో నిర్వహించే శత జయంతి ఉత్సవాలకు సిపిఐ నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కాక పేద బడుగు బలహీన వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమమే అజెండాగా సీపీఐ పార్టీ పని చేస్తుందన్నారు. దేశంలో ఎన్నో రాజకీయ పార్టీలు పుట్టి అధికారం కోల్పోగానే అడ్రస్ లేకుండా పోయాయన్నారు. సిపిఐ వందేళ్లైనా దేశంలో సజీవంగా ఉందన్నారు. కారణం ప్రజా పోరాటాలు ప్రజల గుండెల్లో ఉండటమే అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ పోరాడుతోందని పార్టీలో చేరి సమస్యలను పరిష్కరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కాకం బాలస్వామి, వంక గోపాల్ , పాన్‌గల్ మండల కార్యదర్శి కుర్మయ్య, మాజీ వార్డు సభ్యుడు పెంటయ్య, పెద్ద హన్మంతు, కాకం నారాయణ, కాకం కాశన్న, ఎం. కుర్మయ్య, సహదేవుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎకరాకు నలభై వేల నష్టపరిహారం అందించాలి

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:**మహబూబ్‌నగర్ జిల్లా పరిసర గ్రామాల్లో శనివారం కురిసిన వడగళ్ల వానకు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.40000 నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి డా.వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండు చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని బొక్కలోనిపల్లి, రామచంద్రపూర్, తెలుగుగూడెం , జమిస్తాపూర్ తదితర గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నామని వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయినట్లు మహిళా రైతు జ్యోతి కంటతడి పెట్టుకుంది. ఆమెకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తక్షణం ఆర్థిక సహాయం అందించారు. వ్యవసాయ అధికారులకు ఫోన్ చేస్తే సెలవులో ఉన్నామని చెప్తున్నారని ఎవరు రాలేదని రైతులు మాజీ మంత్రి దృష్టికి తీసుకురాగా వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై అంచనాలు వేయాలని అధికారులను కోరారు. వడగండ్ల వాన తో పంటలు నష్టపోతే అధికారులు ఎవరు రాలేదు. కనీసం రైతులని ఓదార్చడానికి ఎవరు రాకపోవడం దుర్మార్గం అన్నారు. అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని ప్రతి ఎకరాకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలన్నారు. తక్షణ సహాయం కింద రూ.10 వేలు ఇవ్వాలని కెసిఆర్ కేటీఆర్ దృష్టికి సమస్య తీసుకెళ్లి ప్రభుత్వం ఆదుకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి వెంట గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మహబూబ్‌నగర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజగోపాల్ యాదవ్, పాల్గొన్నారు.

## కెఎల్ఐ కాలువలో గుర్తు తెలియని యువకుడి శవం లభ్యం



**ప్రజాపక్షం/బిజినేపలి:** మండలంలోని కారుకొండ గ్రామ సమీపంలోని కేఎల్ఐ కాలువలో గుర్తు తెలియని 25 సంవత్సరాల యువకుడి శవం లభించినట్లు పోలీసులు తెలిపారు. ఆదివారం సాయంత్రం అటుగా వెళ్తున్న రైతులు కేఎల్ఐ కాలువలోని నీటి పై తేలిన యువకుడి శవాన్ని చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని కాలువలో నుంచి బయటకు తీసి శవ పంచనామా చేసి నాగర్ కర్నూల్ జిల్లా ఆసుపత్రిలోని మార్చురికి తరలించారు. మృతుడిని ఎవ్వరైనా గుర్తిస్తే బిజినేపల్లి పోలీసు స్టేషన్లో సంప్రదించాలని సూచించారు. ఈ ఘటన పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకోండి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రాజీవ్ యువవికాసంకోసం నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తుచేసుకోవాలని జిల్లాకాంగ్రెస్‌పార్టీమైనార్టీసెల్‌వైస్‌చైర్మన్ మహ్మద్‌నిజాముద్దిన్ కోరారు. తెలంగాణ యువతకోసం ప్రభుత్వం రాజీవ్‌యువవికాసంపేరుతో రూ.6వేలకోట్లతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన రాజీవ్‌యువవికాసం పథకంకింద రాష్ట్రంలో అర్హులైన యువకులకు రూ.లక్షనుండి 4లక్షలరుణం మంజూరు చేయనుంది. ఏప్రిల్ 5వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. మొత్తాన్నిబట్టి 60నుంచి 80శాతంవరకు సబ్సిడి ప్రభుత్వం ఇస్తుందని ఈపథకంద్వారా తెలంగాణవ్యాప్తంగా ఉన్న ఎస్‌సి, ఎస్‌టి,బిసి,మైనార్టీవర్గాలకుచెందిన 5లక్షలమంది నిరుద్యోగులు లబ్ధిపొందనున్నారని తెలిపారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక చేయూత

**ప్రజాపక్షం/ఊర్కొండ :** ఊర్కొండ మండలంలోని రాచాలపల్లి గ్రామానికి చెందిన జెల్లజంగమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాదారం మాజీసర్పంచ్ , కాంగ్రెస్‌మండలపార్టీ వర్కింగ్‌ప్రెసిడెంట్ ధ్యాపనిఖిల్‌రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ యువనాయకులద్వారా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ యువనాయకులు మధురెడ్డి, అఖిల్, వెంకటేష్, తిరుపతయ్య, విక్కి పాల్గొన్నారు.

# మట్టితవ్వకాలు, డి-వాటరింగ్ ప్రక్రియ పనులు వేగవంతం

నిరంతరాయంగా కొనసాగుతున్న సహాయక చర్యలు
కలెక్టర్ బదావత్‌సంతోష్







**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** మట్టి తవ్వకాలు, డివాటరింగ్ ప్రక్రియ పనులు వేగవంతంగా, నిరంతరాయంగా సహాయ క చర్యలు కొనసాగుతున్నాయని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. ఆదివారం ఎస్ఎల్‌బి సిటన్నెల్ ఆఫీసువద్ద సహాయక బృందాల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో టన్నెల్‌లోపల కొనసాగించాల్సిన సహాయక చర్యలపై జిల్లా చర్చించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ టన్నెల్‌లోని డి1,డి2 ప్రదేశాలలో మట్టితవ్వకాలు, ఊటనీటిని బయటకుపంపే ప్రక్రియ నిరంతరాయంగా, వేగంగా జరుగుతున్నాయని, సహాయకబృందాలు పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. టన్నెల్‌లోని అత్యంత ప్రమాద ప్రదేశంగా భావిస్తున్న ప్రాంతంలో తప్పా మిగిలిన ప్రదేశాలలో సహాయక పనులను వేగవంతం చేసినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు చెందిన సహాయక బృందాలు సంఘటన జరిగిననాటినుండి అవిశ్రాంతంగా ప్రతికూల పరిస్థితుల్లో 24గంటల పాటు సహాయక చర్యలలో పాల్గొంటు టన్నెల్ లోపల ప్రమాదంలో చిక్కుకున్నవారి ఆచూకి తెలుసుకునేందుకు జిల్లా యంత్రాంగం, సహాయక బృందాలు నిరంతరంశ్రమిస్తున్నతీరును అభినందించారు. టిబిఎం కత్తిరించిన భాగాలను పక్కకు తొలగిస్తూ వాటర్‌జెట్‌ద్వారా బురదను తొలగిస్తూ, ఎస్కవేటర్ల ద్వారా మట్టిని కన్వేయర్ బెల్టుగుండా బయటికి తరలించే ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతున్నట్లు తెలిపారు. సహాయక బృందాలవారిగా అప్పగించిన పనిని వారు విజయవంతంగా పూర్తిచేస్తున్నట్లు వివరించారు. ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్, సింగరేణి మైన్స్‌రెస్క్యూ, దక్షిణమధ్యరైల్వే బృందాలు నిరంతరం శ్రమిస్తున్నట్లు వివరించారు. ప్రమాద ప్రదేశం వరకు పూర్తిస్థాయిలో విద్యుత్, వెంటిలేషన్ పనులను పునరుద్ధరించినట్లు తెలియజేశారు. సహాయక చర్యల్లో నిరంతరం పాలుపంచుకుంటున్న సహాయక బృందాలకు కావాల్సిన సదుపాయాలను వసతులను పర్యవేక్షిస్తూవారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలురాకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. ఈసమీక్ష సమావేశంలో ఎన్‌డిఆర్ఎఫ్ అధికారులు డాక్టర్ హరిష్, ఎస్‌డిఆర్ఎఫ్, హైడ్రా, దక్షిణమధ్యరైల్వే అధికారులు, అన్విరోబోటిక్స్, జేపికంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గత రాత్రి కురిసిన అకాల వర్షాలకు, వడగండ్ల వాన వలన భారీ ఎత్తున పంట నష్టం జరిగిందని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే గత రాత్రే అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం మండలం లోని పలు గ్రామాల్లో నాయకులు, అధికారులు, భారీ ఎత్తున తరలి వచ్చిన రైతులతో కలిసి ఆయన ఆకాల వర్షాలకు పాడైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులను ఆయన పరామర్శించారు. ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాల వర్షాల వల్ల మహబూబ్ నగర్ మండలం లోని చౌదర్ పల్లి, జనంపల్లి , బొక్కలోని పల్లి, జమిస్తాపూర్, రాంచంద్రాపూర్, మొత్తం 1520 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ఆయన తెలిపారు. అకాల వర్షాల వల్ల చేతికి వచ్చిన పంటను రైతులు నష్టపోయారని, ఇది చాలా బాధాకరం అని ఆయన అన్నారు. వెంటనే పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులను ఆయన ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తో మాట్లాడి పంటనష్టం పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. మల్లు నర్సింహారెడ్డి, సుధాకర్ రెడ్డి, గోవింద్ యాదవ్, రాంపూర్ నర్సింహారెడ్డి, వెంకటేష్ యాదవ్, నాగిరెడ్డి, రైతుఉ రామచంద్రయ్య, యాదయ్య, సిద్దయ్య, శ్రీనివాసులు, దాసు, వెంకట్ రాములు యాదవ్, అశోక్, పాండురంగ రెడ్డి, ఎఓ శృతి పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరంలో యువవీరులు ప్రాణ తాగ్యం

ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.రాజు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి:** దేశ స్వాతంత్రం కోసం అసమాన పోరాటం చేసిన యోధులు యువతకు స్ఫూర్తి కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు కోరారు. ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లు అమృత్వం పొందిన రోజు అని, అమర త్యాగాలకు దేశం గర్విస్తుందనీ ఆయన అన్నారు. భారతమాత ను పరాయి పాలకుల నుంచి విడిపించడానికి అసమాన పోరాటం చేసిన ముగ్గురు వీరులను నాటి వలస పాలకులు అన్యాయంగా ఉరికంభం ఎక్కించారనీ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న వయసులోనే ఆ ముగ్గురు వీరులు దేశం కోసం ప్రాణత్యాగం చేశారనీ, ఉరిని కూడా ఆనందంగా స్వీకరించిన మహానుభావులు భగత్ సింగ్ అని ఆయన అన్నారు. ఆ వీరులు బలిదానం చేసిన మార్చి 23 రోజునే వారి జ్ఞాపకార్థంగా షహీద్ దివాస్ గా జరుపుకుంటున్నామనీ ఆయన తెలిపారు. ఆ ముగ్గురూ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ్ గురులు, బ్రిటిష్ పాలన అంతం కావాలని పరాయి పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపట్టి 23 ఏళ్ల వయసులోనే ప్రాణత్యాగం చేసిన ఈ ముగ్గురు వీరులు నాటి తరానికే కాదు. నేటి యువతకు కూడా ఆదర్శమన్నారు. ఉరి కంభం ఎక్కడానికి ముందు కూడా తమ ముఖంలో చిరునవ్వు చెరగనివ్వని ఈ యోధులనీ, చావును కూడా ఎంతో ఆనందంగా స్వీకరించా రన్నారు. భారతమాతను బ్రిటిషర్లు చెర నుంచి విడిపించి, దేశ స్వతంత్రం కోసం పోరాడిన అత్యంత ప్రభావశీల విప్లవ కారుల్లో భగత్ సింగ్ ఒకరు, అందుకే ఈ విప్లవ వీరుడ్ని షహీద్ భగత్ సింగ్ గా పిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మ ణ్, జిల్లా నాయకులు కృష్ణ, పవన్, మధు, నితిన్, శశి, అజయ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పరిశీలించిన మక్తల్ ఎమ్మెల్యే డా.వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మఖ్తల్:**ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం కొరకు స్టేజ్ 2 పంప్ హౌస్ గొల్లపల్లి శివారు దగ్గర ఉన్నటువంటి ప్రభుత్వ భూములను మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి, పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, మాజీ జడ్పిటిసి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీపీ చంద్రకాంత్ గౌడ్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్‌ఆఫీసర్ పేరుతో వార్డెన్లకు బెదిరింపులు

**ప్రజాపక్షం/అచ్చంపేట :** అచ్చంపేట నియోజకవర్గంలోని పలు హాస్టల్ వార్డెన్లకు ఫుడ్ ఆఫీసర్‌నంటూ బెదిరింపుఫోన్‌లుచేస్తున్నారంటూ పలువురు వార్డెన్లు ఆరోపించారు. వారు తమబాధను వివరిస్తూ ఫుడ్‌ఆఫీసర్‌నంటూ బెదిరింపుకాల్స్ చేస్తూ విద్యార్థులకు నాసిరకం బోజనంపెడుతున్నారని, నిత్యావసర కొనుగోళ్లలో నాణ్యతలేదని తమకు నిధులుపంపాలని లేకుంటే సస్పెండ్‌చేయిస్తామంటూ వారు హెచ్చరిస్తున్నారని వాపోయారు. ఈవిషయంపై అమ్రాబాద్ వార్డెన్ రాములు మాట్లాడుతూ విజయ్‌కుమార్ అనేవ్యక్తి సెల్‌నెం.70138112731 పేరుమీద పలుసార్లు తమకు ఫోన్‌చేసి బెదిరిస్తున్నాడని తెలిపారు. ఆదివారం ఉదయంనుండి ఫోన్‌చేసి మొదట మాకుటుంబసభ్యుల వివరాలు అడిగి బెదిరిస్తున్నాడని ఆరోపించారు. ఇటీవలతమతోటి వార్డెన్లకుకూడా ఫోన్‌చేసి బెదిరించినట్లు తెలిపారు. అదేవిధంగా బల్మూర్ మండలం చెంచుగూడెం ఆశ్రమపాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌కు ఫోన్‌చేసి లక్షల్లోడబ్బుకావాలని డిమాండ్‌చేశాడని శంకర్ తెలిపారు. ఈవిషయంపై మహబూబ్‌నగర్ జిల్లా ఏటిడిఓ అధికారిణి యాదమ్మకు ఫోన్‌చేసి రూ.5లక్షలు పంపాలని డిమాండ్‌చేసినట్లు తెలిసిందని వారు తెలిపారు. ఈవిషయంపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేసినట్లు తెలిపారు.

## వనపర్తిలో 66 వాహనాలు సీజ్



డిఎస్‌పి వెంకటేశ్వరావు

**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి:** నేరాల నిర్మూలన శాంతి భద్రత పరిరక్షణ కొరకై కార్డెన్ అండ్ సెర్చ్ తనిఖీలు నిర్వహిస్తున్నామని డిఎస్పీ వెంకటేశ్వరావు అన్నారు. ఆదివారం వనపర్తి పట్టణ కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వనపర్తి జిల్లా రావుల గిరిధర్ ఆదేశాల మేరకు వనపర్తి సిఐ , ఎం. క్రిష్ణ, వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు 2, ఎస్ఐలలు 12 మంది మొత్తం 88 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంనగర్ కాలనీలో పోలీసులు ఆకస్మికంగా కార్డెన్ అండ్ సెర్చ్ తనిఖీలు నిర్వహించి సుమారు 300 ఇళ్లను సోదాలు చేశారు. పత్రాలు సరిగా లేని , నంబర్ ప్లేట్ లేని 1 కార్లు, 3 ఆటో, 62 ద్విచక్ర వాహనాలు మొత్తం 66 వాహనాలు అదుపులోకి తీసుకొని సీజ్ చేసి వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లామన్నారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటి కాంట్రాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటి కల్పించడం గురించి ఎవరైనా కొత్త వ్యక్తులు గాని, నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా నిషేదిత గుట్కాల , గుడుంబా తయారీ, గంజాయిని విక్రయించడం , పీడీఎస్ రైస్ అక్రమ రవాణా, కలప అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గుడుంబా, గుట్కా, గంజాయి లాంటి అక్రమ వ్యాపారం, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడకూడదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహనాల సంబంధించిన ధృవపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలని అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఉండి ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఇన్సూరెన్స్ వర్తించదని, ఇన్సూరెన్స్ గడువు ముగిశాక ముందే దానిని రెనివల్ చేపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి సిఐ, ఎం. కృష్ణ, కొత్తకోట సీఐ, రాంబాబు, వనపర్తి పట్టణ ఎస్ఐ హరిప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్ఐ జలేందర్ రెడ్డి, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, మహిళ కానిస్టేబుళ్లు, హోంగార్డ్స్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగకు పాలాభిషేకం



**ప్రజాపక్షం / కొత్తకోట:** కొత్తకోట టౌన్‌లో ఎస్సీ వర్గీకరణ సాధకుడు మందకృష్ణ మాదిగకి పాలాభిషేకం చేసిన దళిత అన్ని పార్టీల నాయకులు కొత్తకోట మున్సిపాల్టీ టౌన్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో 30 ఏళ్లుగా సుదీర్ఘంగా పోరాటం చేసి ఎన్నో పదవులు ఇస్తామన్నా కూడా ఏ పార్టీకి తలగ్గకుండా దేశంలోనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరిగే విధంగా పోరాటం చేసిన మందకృష్ణ మాదిగకి కొత్తకోట మున్సిపల్ టౌన్ లో దళిత, అన్ని పార్టీల నాయకులు పాల్గొని ఆయనకి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడిన వనపర్తి మాదిగ జేఏసి జిల్లా అధ్యక్షులు జనంపల్లి కిరణ్ , అన్ని దళిత సంఘాల నాయులు, అన్ని పార్టీల నాయకులకు , కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

## విస్తరిస్తున్న డ్రోన్లు... రైతన్నకు మరింత సాంకేతిక చేరువ



**ప్రజాపక్షం/బిజినేపలి:** శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకు అభివృద్ధి చెందుతుంది. నిత్య నూతన ప్రయోగాలు పరిశోధనలతో సరికొత్త ఆవిష్కరణలు యంత్రాలు సులభంత్రం చేసే నూతన యంత్ర పరికరాలు ప్రస్తుతం రైతన్న ముంగిట్లో నూతన యంత్ర పరికరాలు అందుబాటులోకి వస్తున్నాయి. డ్రోన్ ఇది ఆధునిక సాగు పద్ధతి నీ మార్చగలిగే పరిశోధన పొలాల ఫలంగా నిలుస్తుంది రెండు దశాబ్దాల క్రితం వరకు రక్షణ కార్యకలాపాలకి పరిమితమైన ఈ బుల్లి మానవ రహిత విమానం నేడు ప్రతిచోట తన ఉనికిని చాటుకుంటుంది రక్షణ భద్రత మొదలు వైద్యం ఆర్థికం మైనింగ్ వ్యవసాయ విపత్తుల నిర్వహణ సరుకు రవాణా వరకు ప్రతి రంగంలో విశిష్ట సేవలందిస్తుంది బహుళ ఉపయోగాలు బహుముఖ సేవ లతో ప్రపంచాన్ని ఆకట్టుకున్నది ప్రస్తుతం ప్రధానంగా వ్యవసాయంగా వెలుగు దివ్వేగా కనిపిస్తుంది కూలీలు మందుల పిచికారి సమస్యలకు ప్రత్నేయంగా ఆశలు కల్పిస్తుంది ఆ గ్రామాలతో ఆటు పురుగుల మందులు పిచికారి చేయడానికి రసాయనికి ఎరువులు వేయడానికి డ్రోన ద్వారా వివిధ రకాల రసాయన మందులపిచికారి చేస్తున్నారు. పురుగుమందుల పిచికారీ, ఎరువుల చల్లకం, విత్తనాటు చేయడం వంటి పనులకు వాటిని వినియోగిస్తున్నారు. విద్యావంతులైన కొందరు అభ్యుదయ రైతులు సొంతంగా కొనుగోలు చేసి విని యోగిస్తుండగా. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని సుమారు 100 కు పైగా ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మిగిలిన జిల్లాల్లో సుమారు 500 కు పైగా డ్రోన్లు వ్యవసాయ రంగంలో విస్తరించి వివిధ రకాల మందులు రసాయనైయులను పిచికారి చేస్తున్నాయి. ఎన్నో ప్రయోజనాలు సాధారణంగా ఎకరం పొలంలో పురుగుమందుల పిచికారీకి 56 గంటల సమయం పడుతుంది. ఒక్కో వ్యక్తికి కూలీ కింద రూ. 800 నుంచి రూ.1000 వరకు చెల్లించాల్సి ఉంటుంది. డ్రోన్ల యజమానులు రూ.500 600లకే ఈ సేవలు అందిస్తున్నారు. పైపెచ్చు ఎకరం పొలంలో పిచికారీ ప్రక్రియ మొత్తం 510 నిమిషాల్లోనే పూర్తవుతుంది. కూలీలలతో పిచి కారీ చేయిస్తే మదులు తొక్కేసే ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా వరి పొలాల్లో ఈ ముప్పు ఎక్కువ. డ్రోన్లతో అయితే ఈ సమస్య ఉండదని తెగుళ్లనూ గుర్తించవచ్చు డ్రోన్లకు అమర్చే కెమెరాతో పంటలను ఫోటో తీయడం, చీడపీడలను గుర్తించడం కూడా చేయవచ్చు తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలోని పొలాలను ఫోటోలు తీయడం ద్వారా చీడపీడల సోకాయా లేదా అనేది సులువుగా గుర్తించవచ్చు.

## అత్యాచారం కేసులో నిందితులకు శిక్ష

**ప్రజాపక్షం/కొత్తకోట:** 2018 సంవత్సరంలో సైబరాబాద్ పోలీస్ సర్కిల్ పరిధిలో జరిగిన అత్యాచారం కేసుల్లో ఇన్వెస్టిగేషన్ నిర్వహించి నిందితులకు 10 సంవత్సరాల జైలు శిక్ష విధించిన కేసులో ప్రతిభ చూపిన వనపర్తి జిల్లా కొత్తకోట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గా పని చేస్తున్న రాంబాబుకు ప్రతిభ అవార్డు ప్రశంస పత్రం అందుకున్నారు. శిక్ష విధించడంలో కీలక పాత్ర పోషించి ప్రతిభ చూపించి ఇన్వెస్టిగేషన్ చేసిన ప్రస్తుతం కొత్తకోట సీఐగా పని చేస్తున్న రాంబాబు గతంలో సైబరాబాద్ సర్కిల్ పరిధిలో పని చేసిన సందర్భంలో అప్పట్లో జరిగిన అత్యాచారం కేసులో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తూ సాక్షులను న్యాయస్థానం ముందు హాజరు పర్చడంతో న్యాయమూర్తి నిందితులకు పది సంవత్సరాల పాటు జైలు శిక్ష విధించిన సందర్భంగా సీఐ హైదరాబాద్‌లోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ మెయిన్ హాల్ లో జరిగిన రివార్డు మేళ సందర్భంగా ఈ ప్రశంస పత్రం అందుకోవడం విశేషం. విధి నిర్వహణలో చక్కటి నైపుణ్యత చూపిస్తూ ఇన్వెస్టిగేష్ లో ప్రతిభ చూపడమే కాక అటు కేసుకు సంబంధించిన సాక్షాధారలతో పాటు అన్ని ఆధారాలను న్యాయస్థానంలో పొందపర్చడం వల్లనే నిందితులకు శిక్ష పడిందని అందువల్లనే ఇలాంటి కేసుల్లో కీలకపాత్ర పో,ఇంచిన సిఐ రాంబాబు అభినందిస్తూ ప్రశంస పత్రాన్ని అందజేశారు. ప్రశంస పత్రం పొందిన కొత్తకోట సీఐ రాంబాబు సేవలను ప్రతి ఒక్కరు అభినందిస్తూ ప్రశంస పత్రాన్ని అందజేశారు. ప్రశంస పత్రం పొందిన కొత్తకోట సీఐ రాంబాబు సేవలను ప్రతి ఒక్కరు అభినందిస్తూ ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.



# స్థానికం
REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## రైతులను మోసగిస్తున్న ప్రభుత్వం

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(గరిడేపల్లి):** అసెంబ్లీ ఎన్నికల సమయంలో రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయకుండా ప్రజలను మోసం చేయడం క్షమించరానిదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల కేంద్రంలో జరిగిన సిపిఐ మండల సమితి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాటను నెరవేర్చకుంటే భవిషత్తులో రైతుల ఆగ్రహానికి గురై తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధాకర్‌రెడ్డి,సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు యడ్ల అంజిరెడ్డి,కడియాల అప్పయ్య,కుందూరు వెంకటరెడ్డి,ప్రతాని సైదులు, పోకల ఆంజనేయులు, ఏఐవైఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు పంగ సైదులు,మెండె లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

డ్రైవర్లపై కేసు నమోదు



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్:** మండలంలోని కాసరబాద శివారులో మూసీ వాగు నుండి రాయినిగూడెం గ్రామ శివారులో గల మూసీ వాగు వరకు ఏలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు డ్రైవర్లపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ బాలు నాయక్ తెలిపిన వివరాల ప్రకారం ఇసుకను ఏలాంటి అనుమతి లేకుండా తరలిస్తున్న కాసరబాద గ్రామానికి చెందిన చింతల కిరణ్, డాకూరి బాబు, రాయినిగూడెం గ్రామానికి చెందిన నల్లమేకల నాగరాజుల ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీరు గత కొంత కాలంగా అక్రమ ఇసుక రవాణాను చేస్తుండగా అరికట్టేందుకు , రాయినిగూడెం, కెటి అన్నారం, కాసరబాద వెళ్లే దారుల్లో తాము తనిఖీలు చేస్తుండగా పట్టుబడినట్లు చెప్పారు.

## అలరించిన సినీ స్వరాభిషేకం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడలో ఒక నూతన ఒరవడిలో కొత్త కొత్త కళాకారులను ప్రోత్సహించే ఉద్ధేశ్యంతో ఇప్పటికీ ఎనిమిదిసార్లు సినీ స్వరాభిషేకం నిర్వహించినట్లు కళావేదిక నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక మిర్యాలగూడలోని శాంతి నగర్‌లో గల శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ సహాయ, సహకారాలతో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని సినీ స్వరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి గాయకులు హాజరై పాటలు పాడి అలరించారు. ఈ సందర్భగా ఆలయ కమిటీ నిర్వాహకులు మాట్లాడుతూ మిర్యాలగూడ కళాకారులకు నిలయమని కళాకారుల అభివృద్ధి కోసం భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఏలె సత్యనారాయణ, ఎం.సత్యనారాయణచారి, జె.శ్రీనివాసచారి, కె.శ్రీనివాస్, కందుకూరి సుదర్శన్, మురళీధర్, ప్రతాప్, షేక్ బాబా, సత్యనారాయణ, ఎల్లయ్య, ఆండాలు, సుజాత, సరస్వతి, నవ్య, మౌనిక, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## రెండు నియోజకవర్గాలు కైవసం చేసుకుంటాం : ఎంపి



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని రెండు నియోజకవర్గాలలో బిజెపి శాసనసభ స్థానాలు కైవసం చేసుకుంటామని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బిజెపి జిల్లా నూతన అధ్యక్షుడుగా రామాంజనేయులు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన బండల వెంకట రాములు, అక్కల రమా సాయిబాబా, జయలక్ష్మి, లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నూతన జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రామాంజనేయులు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నెట్టెంపాడు రిజర్వాయర్ కింద ఉన్నా పోలాలకు సాగునీరు లేక పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో హజరయ్యారు.

## ఆలంపూర్ నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయం



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** అల్లంపూర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి నా శాయశక్తుల కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే విజయుడు అన్నారు. ఆదివారం అల్లంపూర్ చౌరస్తాలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మానవపాడు ఉండవెల్లి ఇటిక్యాల ఐజ రాజోలి వడ్డేపల్లి అల్లంపూర్ మండలాల్లోని లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు ఈ సందర్భంగా నియోజకవర్గంలోని 306 మందికి మూడు కోట్ల పైగా చెక్కుల ద్వారా లబ్దిదారులకు అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిస్సాయ స్థితిలోని వాళ్లకు ఆసరాగా 161 మందికి చెక్కులు పంపిణీ చేశారు. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చేయడానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి చొరువతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల్లోని తాసిల్దార్‌లో మండల స్థాయి అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## గోపాల మిత్రల వేతనాలు పెంచి ఖాళీలను భర్తీ చేయాలి

**ప్రజాపక్షం/గుండాల:** గోపాల మిత్రలకు వేతనాలు పెంచి ఖాళీలను భర్తీ చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్య గోపాల మిత్రల తరుపున అసెంబ్లీలో మాట్లాడుతూ గడిచిన 24 సంవత్సరాలుగా పశుగణాభివృద్ధికి దోహదపడుతున్న గోపాల మిత్రలకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా గోపాల మిత్రలకు పెద్ద పీట వేసి వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, అలాగే వ్యవసాయ శాఖలో ఖాళీగా ఉన్న 634 పోస్టులను భర్తీ చేయాలని, దామాష ప్రకారం ఇప్పుడున్న 1530 మంది గోపాల మిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా అవకాశం కల్పించి నెలకు వేతనం రూ. 24వేలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళారు. అసెంబ్లీలో గోపాల మిత్రల తరుపున మాట్లాడి గోపాల మిత్రల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఏ బీర్ల అయిలయ్యకు యాదాద్రి భువనగిరి జిల్లా గోపాల మిత్రల గౌరవ అధ్యక్షులు గోవింద్ ధన్యవాదాలు తెలిపారు.

# గుండెల్లో గుబులు

### అక్రమంగా ఇసుక తరలిస్తే రూ.5వేల ఫైన్

రూ.1లక్ష బైండోవర్
రెండోసారి తప్పు చేస్తే
రూ. 1.5లక్షలు



**ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి:** అక్రమ ఇసుక రవాణాకు సూర్యాపేట జిల్లా అడ్డగా మారింది. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా సహజ వనరులను అక్రమార్కులు దోచుకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలో మూసీ పరివాహక ప్రాంతాలైన నాగారం, జాజిరెడ్డిగూడెం, సూర్యాపేట, పెన్‌పహాడ్, నేరేడుచర్ల మండలాల్లో విస్తరించి ఉండడంతో ఇక్కడి నుండి ప్రతి రోజు వేలా ది వాహనాల్లో ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. ఇదిలా ఉంటే తిరుమలగిరి మండలంలోని బిక్కేరు వాగు, మద్దిరాల, నూతనకల్, ఆత్మకూర్ (ఎస్), మోతె, నడిగూడెం, అనంతగిరి మం డలాల పరిధిలో విస్తరించిన పాలేరు వాగుతో పాటు కృష్ణపరివాహక ప్రాంతాలైన పాలకవీడు, మఠంపల్లి, చింతలపాలెం, మేళ్ళచెరువు నుండి కూడా పెద్ద ఎత్తున ఇసుక అక్రమ రవాణ సాగుతుంది. దీంతో ప్రభుత్వం అక్రమ రవాణాకు చెక్ పెట్టేందుకు నూతన ఇసుక పాలసీని రూపొందించింది. జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాల నుండి మూసీ పరివాహన ప్రాంతా ల్లో అవవసరం ఉన్న వారికి ఇసుకను అందించేందుకు టెండర్ విధానాన్ని అమలు చేస్తుంది. అయినా అక్రమ ఇసుక రవాణా ఏ మాత్రం ఆగకపోవడంతో నూతన ఇసుక పాలసీని తీసుకవచ్చింది. ఈ పాలసీలోని అంశాలను పకడ్బందీగా అమలు చేసి అడ్డుకట్ట వేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు పుడుతుంది. ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే మొదటి సారి రూ.5 వేల ఫైన్, రూ.1లక్ష వరకు బైండోవర్ విధించనున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ప్రకటించారు. శనివారం జరిగిన సంబంధిత శాఖల అధికారుల సమావేశంలో ఈ విషయంపై చర్చించారు. అక్రమ ఇసుక రవాణాదారులు రెండోసారి కూడా తప్పు చేస్తూ ఇసుకను తరలిస్తే రూ.1.5లక్షలఫైన్ వేయనున్నట్లు చెప్ప డం ఇసుక అక్రమ రవాణదారుల్లో ఆందోళన మొదలైంది. ఇసుక లభ్యమయ్యే పరివాహక ప్రాంతా ల్లో వేలాది మంది ట్రాక్టర్‌లను కొనుగో లు చేసి అక్రమ ఇసుక రవాణను కొనసాగిస్తున్నా రు. జిల్లాలో అధికారులు దీనిని పకడ్బందీగా అమలు చేస్తే తమ పరిస్థితి ఏంటన్న చర్చ మొదలైంది. కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో మైనింగ్, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు.

**ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఇసుక పాలసీతో అక్రమ ఇసుక రవాణాదారుల గుండెల్లో గుబులు పుడుతుంది. అక్రమంగా ఇసుక తరలిస్తే రూ.5వేల ఫైన్‌తో పాటు రూ.1లక్ష బైండోవర్, రెండవ సారి అదే తప్పు చేస్తూ ఇసుకను తరలిస్తే రూ.1.5లక్షలు ఫైన్ వేయనున్నట్లు ఈ పాలసీలో పొందుపర్చడం జరిగింది. దీనిని పకడ్బందీగా అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ప్రకటించారు.**

## ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం అందించాలి

మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండు

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ జిల్లా పరిసర గ్రామాల్లో శనివారం కురిసిన వడగళ్ల వానకు నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.40,000 నష్టపరిహారం అందించాలని మాజీ మంత్రి డా.వి.శ్రీనివాస్ గౌడ్ డిమాండు చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ అర్బన్ మండలం పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని బొక్కలోనిపల్లి, రామచంద్రపూర్, తెలుగుగూడెం , జమిస్తాపూర్ తదితర గ్రామాల్లో ఆయన ఆదివారం పర్యటించారు. కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నామని వడగండ్ల వానతో తీవ్రంగా నష్టపోయినట్లు మహిళా రైతు జ్యోతి కంటతడి పెట్టుకుంది. ఆమెకు మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తక్షణం ఆర్థిక సహాయం అందించారు. వ్యవసాయ అధికారులకు ఫోన్ చేస్తే సెలవులో ఉన్నామని చెప్తున్నారని ఎవరు రాలేదని రైతులు మాజీ మంత్రి దృష్టికి తీసుకురాగా వ్యవసాయ అధికారులకు ఫోన్ చేసి వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టంపై అంచనాలు వేయాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనా వేయాలని ప్రతి ఎకరాకు రూ.40 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించాలన్నారు. తక్షణ సహాయం కింద రూ.10 వేలు ఇవ్వాలని కెసిఆర్ కేటీఆర్ దృష్టికి సమస్య తీసుకెళ్లి ప్రభుత్వం ఆదుకుంటే రైతులకు న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు. మాజీ మంత్రి వెంట గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, మహబూబ్‌నగర్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవేందర్‌రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాజగోపాల్ యాదవ్, బొక్కలోనిపల్లి మాజీ ఉపసర్పంచు అశోక్ గౌడ్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ తిరుపతయ్య యాదవ్, పాల్గొన్నారు.



# విప్లవకారుడు భగత్ సింగ్




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(పాలకవీడు):** సర్దార్ భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతిని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధూళిపాళ ధనుంజయ్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పాలకవీడు మండల కేంద్రంలో భగత్‌సింగ్,రాజ్‌గురు,సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధనుంజయ్‌నాయుడు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసి చిన్న వయసులోనే ఉరికొయ్యను ముద్దాడిన భగత్‌సింగ్,సుఖ్‌దేవ్,రాజ్‌గురుల త్యాగాలను,పోరాటాలను స్మరించుకుని వారిని ఆదర్శంగా తీసుకుని వారి ఆశయ సాధన కోసం యువత అంకితం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సమాఖ్య జిల్లా నాయకులు కొమ్మరాజు వెంకట్,పి.ప్రసాద్ కిరణ్,చరణ్,గుజ్జుల సైదిరెడ్డి,దీరావత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం /మునుగోడు:** దేశ స్వాతంత్ర పోరాటంలో ఉరికంబమెక్కి ప్రాణాలను అర్పించిన భగత్ సింగ్ ఆశయాల సాధనకు యువత నడుము బిగించాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు నలగొండ జిల్లా కేంద్రంలోని మగ్దుంభవన్లో భగత్ సింగ్ 94వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డం నవీన్,జిల్లా కౌన్సిల్ సభ్యులు బండారు శంకర్, పులకరం ఆంజనేయులు, బొడ్డుపల్లి నరేష్, చాపల విప్లవ్, బొలుగురి వంశీ, ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు గాదెపాక సూర్యతేజ,సైదులు, సిపిఐ పట్టణ కార్యదర్శి గాదపాక రమేష్ ,అక్కలయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధిః** దేశ స్వాతంత్రం కోసం అసమాన పోరాటం చేసిన యోధులు యువతకు స్ఫూర్తి కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు కోరారు. ఆదివారం భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేడు షహీద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్ లు అమృత్వం పొందిన రోజు అని, అమర త్యాగాలకు దేశం గర్విస్తుందని ఆయన అన్నారు. జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు రాజశేఖర్, లక్ష్మ ణ్, జిల్లా నాయకులు కృష్ణ, పవన్, మధు, నితిన్, శశి, అజయ్, భరత్ పాల్గొన్నారు.





## రుణమాఫీపై అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధాలు

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** రైతుల పంట రుణమాఫిపై అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు పచ్చి అబద్దాలు ఆడారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ఎన్నికల ముందు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో వచ్చిన తరువాత రూ.2లక్షలకు పైబడి రుణాలు తీసుకున్న రైతులు పై డబ్బులు చెల్లిస్తే మిగతా రెండు లక్షలు ప్రభుత్వం మాఫీ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ మాఫీ చేయకుండా రైతులను నిలువున ముంచిందన్నారు. స్వయంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు రుణమాఫీ ప్రక్రియ ముగిసిందనడం పచ్చి అబద్ధమన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని ఆత్మకూర్(ఎస్) మండలం పాతసూర్యాపేటలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలో వచ్చిన కాంగ్రెస్ నేడు చేతులు ఎత్తివేయడం సిగ్గు చేటు అన్నారు. చేయని రుణమాఫీని చేసినట్లు గొప్పలు చెప్పుకోవడం యావత్ రైతాంగం గమనిస్తుందన్నారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులు పై ఉన్న అసలు, మిత్తి చెల్లిస్తే రూ.2లక్షల వరకు ప్రభుత్వం రుణం మాఫీ చేస్తుందని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుండి మంత్రివర్గం మొత్తం పదేపదే చెప్పారని గుర్తు చేశారు. బ్యాంకర్ల లెక్కల ప్రకారం రూ. 48.500 కోట్లు ఉందని చెప్పిన కాంగ్రెస్ కేవలం రూ.20కోట్లకు కుదించి కేవలం రూ.12.500కోట్లు మాత్రమే మాఫీ చేసిందని చెప్పారు. ఆయన వెంట నాయకులు గోపగాని వెంకటనారాయణ గౌడ్, నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మారిపెద్ది శ్రీనివాస్, తూడి నర్సింహ్మారావు ఉన్నారు.



## పల్టీకొట్టి నెలలు గడుస్తున్నా పట్టించుకునే వారేరీ?

### తేల్దేవరపల్లి గ్రామపంచాయతీ వాటర్ ట్యాంకర్ పరిస్థితి



**ప్రజాపక్షం/చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం భగ భగ మండే వేసవి కాలం వచ్చిన గ్రామాలలో నీటి ట్యాంకర్లు పల్టీ కొట్టి, తుప్పు పట్టిపోయి, టైర్లు పక్కకు పడిపోయిన పరిస్థితి..సర్పంచ్‌ల పదవులు ముగిసిన తర్వాత గ్రామాలలో పనులు జరగడం లేదని గ్రామ పంచాయతీ కార్యదర్శులు మరియు స్పెషల్ అధికారులు నియమించినప్పటికి ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు. వేసవికాలం ముందే రాష్ట్ర ప్రభుత్వం , జిల్లా అధికారులు ఎక్కడ కూడా నీటి సమస్య ఉండకూడదని పదే పదే చెప్పినప్పటికి కింది స్థాయి అధికారులు అత్యవసరానికి ఉపయోగపడే వాటర్ ట్యాంకర్‌ను పట్టించుకోకపోవడం కారణాలు ఏమిటని ప్రజలు ఆగ్రహంతో చెబుతున్నారు. అధికారులు అక్కడకు వెళ్ళిచూడకపోవడం, అదేవిధంగా చూసి చూడనట్లు ప్రజలకు ఉపయోగపడే వాటర్ ట్యాంక్‌ను అలా చేసిన వారిపైన కూడా చర్యలు తీసుకోకపోవడం కారణం ఏమిటని అక్కడి ప్రజలు చెబుతున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసి కూడా ఏడాది కాలం గడిచిన సర్పంచ్ ఎన్నికలు ఎప్పుడు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదని వివిధ గ్రామాల ప్రజల సమస్యల నిలయంగా మారాయని వివిధ గ్రామాల ప్రజలు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడ ఉన్నాయని పలు గ్రామాలలో విద్యుత్ , నీటి సమస్యలు ముంచుకొస్తున్నాయని అన్నారు. పల్టీ కొట్టి నెలదాటుతున్న ట్యాంకర్‌ను పట్టించుకునే నాదుడే కరువయ్యారని. గ్రామ పంచాయతీ తేల్దేవరపల్లి స్పెషల్ అధికారుల, కార్యదర్శి నీటి ట్యాంకర్‌ను మరిచారని ప్రజలు అన్నారు. న్యూ తేల్దేవరపల్లి ఇంత పెద్ద గ్రామ పంచాయతీలో హోలీ పండుగ జరిగిన వాటర్ ట్యాంక్ ఎక్కడ ఉందో ఎవరికి తెలియని పరిస్థితి అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## రైతులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. గత రాత్రి కురిసిన అకాల వర్షాలకు, వడగండ్ల వాన వలన భారీ ఎత్తున పంట నష్టం జరిగిందని స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే గత రాత్రే అధికారులను అప్రమత్తం చేశారు. ఆదివారం మండలం లోని పలు గ్రామాల్లో నాయకులు, అధికారులు, భారీ ఎత్తున తరలి వచ్చిన రైతులతో కలిసి ఆయన ఆకాల వర్షాలకు పాడైన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పంట నష్టపోయిన రైతులను ఆయన పరామర్శించారు. ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకాల వర్షాలవల్ల మహబూబ్ నగర్ మండలంలోని చౌదర్ పల్లి, జనుంపల్లి , బొక్కలోని పల్లి, జమిస్తాపూర్, రాంచంద్రాపూర్, మొత్తం 1520 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ఆయన తెలిపారు. అకాల వర్షాల వల్ల చేతికి వచ్చిన పంటను రైతులు నష్టపోయారని, ఇది చాలా బాధాకరం అని ఆయన అన్నారు. వెంటనే పూర్తి స్థాయిలో నివేదిక ఇవ్వాలని రెవెన్యూ, అగ్రికల్చర్ అధికారులను ఆయన ఆదేశించారు. వ్యవసాయ శాఖ మంత్రి తో మాట్లాడి పంటనష్టం పోయిన రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తానని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. మల్లు నర్సింహ్మారెడ్డి, సుధాకర్ రెడ్డి, గోవింద్ యాదవ్, రాంపూర్ నర్సింహారెడ్డి, వెంకటేష్ యాదవ్, నాగిరెడ్డి, రైతుఉ రామచంద్రయ్య, యాదయ్య, సిద్దయ్య, శ్రీనివాసులు, దాసు, వెంకట్ రాములు యాదవ్, అశోక్, పాండురంగ రెడ్డి, నయాబ్ తహశీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎఓ శృతి తదితరులు పాల్గొన్నారు.



## క్రీడ

# ఇషాన్



# శతకగర్జన..

**ఉప్పల్ మైదానంలో ఆరెంజ్ ఆర్మీకి భారీ విక్టరీ**





### ఇషాన్ సెంచరీ..

హెడ్, నితీశ్ రెడ్డిలతో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన ఇషాన్.. ఆ తర్వాత క్లాసెన్(34)తోనూ ఇన్నింగ్స్ నిర్మించాడు. 24 బంతుల్లోనే 55 రన్స్ కొట్టిన ఈ ద్వయాన్ని సందీప్ శర్మ విడదీసి రాజస్థాన్‌కు బ్రేకిచ్చాడు. అయితే.. అదే ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు బాది.. 2 రన్స్ తీసిన ఇషాన్ తొలి సెంచరీ సాధించాడు. 20వ ఓవర్లో వరుస బంతుల్లో రెండు వికెట్లు కోల్పోయిన హైదరాబాద్.. తమ రికార్డు స్కోర్ 287ను అధిగమించే అవకాశాన్ని చేజార్చుకుంది.

ఐపిఎల్ 2025 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ శుభారంభం చేసింది. గత సీజన్ ఫామ్‌ను కొనసాగిస్తూ విధ్వంసకర బ్యాటింగ్‌తో రాజస్థాన్ రాయల్స్‌ను మట్టికరిపించింది. ఆదివారం ఉప్పల్ వేదికగా సిక్సర్ల వర్షం కురిసిన హై స్కోరింగ్ మ్యాచ్‌లో ఆరెంజ్ ఆర్మీ 44 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. సన్‌రైజర్స్ పరుగుల విధ్వంసంతో ఈ మ్యాచ్ పూర్తిగా ఏకపక్షంగా సాగింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 286 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇషాన్ కిషన్(47 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సలతో 106 నాటౌట్) అజేయ శతకంతో చెలరేగగా.. ట్రావిస్ హెడ్31 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సలతో 67) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. నితీష్ కుమార్ రెడ్డి(15 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 30), హెన్రిచ్ క్లాసెన్(14 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 34)దూకుడుగా ఆడారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో తీక్షణ(2/52) రెండు వికెట్లు తీయగా.. తుషార్ దేశ్‌పాండే(3/38) మూడు వికెట్లు పడగొట్టాడు. సందీప్ శర్మ(1/51) ఒక వికెట్ తీసాడు. సన్‌రైజర్స్ ఇన్నింగ్స్‌లో మొత్తం 34 ఫోర్లు, 12 సిక్సర్లు నమోదయ్యాయి.

అనంతరం రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 242 పరుగులు చేసి ఓటమిపాలైంది. ఇంపాక్ట్ ప్లేయర్ సంజూ శాంసన్(37 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సలతో 66), ధ్రువ్ జురెల్(35 బంతుల్లో 5 ఫోర్లు, 6 సిక్సలతో 70) హాఫ్ సెంచరీలతో రాణించినా ఫలితం లేకపోయింది. చివర్లో షిమ్రాన్ హెట్‌మైర్(23 బంతుల్లో ఫోర్, 4 సిక్సలతో 42), శుభమ్ దూబే(11 బంతుల్లో ఫోర్, 4 సిక్సలతో 34 నాటౌట్) దూకుడుగా ఆడినా.. చేయాల్సిన లక్ష్యం ఎక్కువగా ఉండటంతో ఏం చేయలేకపోయారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ బౌలర్లలో సిమర్జిత్ సింగ్, హర్షల్ పటేల్ రెండేసి వికెట్లు తీయగా.. మహమ్మద్ షమీ, ఆడమ్ జంపా తలో వికెట్ పడగొట్టారు. రాజస్థాన్ రాయల్స్ ఇన్నింగ్స్‌లో 17 ఫోర్లు, 18 సిక్సర్లు నమోదయ్యాయి.

**పోటీ పడి మరీ ఫోర్లు, సిక్సర్లు**

గత సీజన్ రన్నరప్‌తో సరిపెట్టుకున్న సన్ రైజర్స్ హైదరాబాద్ ఈసారి మరింత కసితో ఆడుతోంది. అభిమానులతో కిక్కిరిసిన ఉప్పల్ స్టేడియంలో ఆరెంజ్ ఆర్మీ బ్యాటర్లు ఊచకోత కోశారు. టాస్ ఓడినప్పటికీ.. బౌండరీల మీద బౌండరీలు బాదేస్తూ రాజస్థాన్ బౌలర్లకు మూడు చెరువుల నీళ్లు తాగించారు. నువ్వా నేనా అన్నట్టు పోటీ పడి మరీ ఫోర్లు, సిక్సర్లు కొడుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. ఓపెనర్లు ట్రావిస్ హెడ్(67), అభిషేక్ శర్మ (24)లు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. ఈ జోడీని విడదీసేందుకు రాజస్థాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ స్పిన్నర్ థీక్షణకు బంతి ఇచ్చి ఫలితం రాబట్టాడు. కవర్స్‌లో భారీ షాట్ ఆడిన అభిషేక్ .. యశస్వీ జైశ్వాల్ ఒడుపుగా క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. 45 పరుగుల వద్ద తొలి వికెట్‌గా అభిషేక్‌ను వెనుదిరిగాక.. ఇషాన్ కిషన్(106) జతగా హెడ్ దంచాడు. ఆర్చర్ ఓవర్లో.. వరుసగా 4, 6, 4.. ఆఖరి రెండు బంతుల్ని సైతం ఫోర్లుగా మలిచాడు. ఇక థీక్షణ బౌలింగ్‌లో ఇషాన్ , హెడ్ తలా రెండేసి ఫోర్లు బాదడంతో.. ఆరెంజ్ ఆర్మీ జట్టు పవర్ ప్లేలో వికెట్ నష్టానికి 94 రన్స్ కొట్టింది. ఆ తర్వాత అర్ధ శతకం సాధించిన హెడ్‌ను తుషార్ దేశ్‌పాండే పెవిలియన్ చేర్చాడు. 134 వద్ద ఎస్ఆర్‌హెచ్ రెండో వికెట్ కోల్పోయినా.. నితీశ్ కుమార్ రెడ్డి(30)తో హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించాడు ఇషాన్. వీళ్ల జోరుతో 15వ ఓవర్లోనే జట్టు స్కోర్ 200 దాటింది.

## ముంబైకి షాక్..

### రచిన్ అజేయ అర్ధశతకంతో సీఎస్కే జయభేరి

ఐపిఎల్ 18వ సీజన్‌లో థ్రిల్లింగ్ మ్యాచ్. విజయం ఇరుజట్లతో దోబూచులాడిన వేళ.. చెపాక్ స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్ మురిసింది. స్వల్ప ఛేదనలో ఆద్యంతం ఉత్కంఠ నెలకొన్నప్పటికీ ముంబై ఇండియన్స్‌ను 4 వికెట్ల తేడాతో చిత్తుగా ఓడించింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ53) అర్ధ శతకంతో మంచి పునాది వేయగా.. ఓపెనర్ రచిన్ రవీంద్ర(65 నాటౌట్) ఆఖరి వరకూ నిలబడి విజయతీరాలకు చేర్చాడు. స్పిన్నర్ విఘ్నేశ్ పుతుర్ కట్టుదిట్టంగా బంతులు వేసినా.. రెండు సిక్సర్లతో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు రచిన్. దాంతో, సీఎస్కే తమ గెలుపుతో టోర్నీని ఆరంభించింది. ముంబై నిర్దేశించిన స్వల్ప ఛేదనలో చెన్నై ఇన్నింగ్స్ తడబడుతూ సాగింది. ఓపెనర్ రాహుల్ త్రిపాఠి(2) నిరాశపరచగా.. రచిన్ రవీంద్ర(65 నాటౌట్) క్రీజులో పాతుకుపోయాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ53) అండగా స్కోర్ బోర్డును ఉరికించాడు. సెట్ అయ్యాక దంచేసిన గైక్వాడ అర్ధ శతకం బాదేయడంతో సీఎస్కే విజయం నల్లేరు మీద నడకే అనిపించింది. కానీ, యంగ్ స్పిన్నర్ విఘ్నేశ్ పుతూర్(332) మ్యాచ్‌ను ఉత్కంఠగా మార్చేశాడు. స్లో డెలివరీలతో అతడు.. వరుసగా గైక్వాడ శివం దూబే(9), దీపక్ హుడా(3)లను బోల్తా కొట్టించాడు.





## ‘అఖండ 2’లో ఊహించని ప్లానింగ్స్?

నందమూరి నటసింహం బాలకృష్ణ హీరోగా నటించిన రీసెంట్ చిత్రం డాకు మహారాజ్‌తో సెన్సేషనల్ హిట్ అందుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రం తర్వాత బాలయ్య నుంచి రాబోతున్న అవైటెడ్ చిత్రమే అఖండ 2 తాండవం. దర్శకుడు బోయపాటి శ్రీను కలయికలో తెరకెక్కిస్తున్న ఈ భారీ చిత్రంపై సాలిడ్ అంచనాలు నెలకొన్నాయి. అఖండ మొదటి భాగమే ఎంతో గ్రాండ్‌గా ప్లాన్ చేయగా ఇపుడు అఖండ 2 పై మరిన్ని ఇంట్రెస్టింగ్ అంశాలు వినిపిస్తున్నాయి. దీనితో పార్ట్ 2 కోసం మాత్రం ఆడియెన్స్, అభిమానులు ఊహించని లెవెల్ ప్లానింగ్స్‌ని బోయపాటి చేస్తున్నట్టుగా తెలుస్తుంది. మెయిన్‌గా సినిమా కోసం బోయపాటి భారీ సెట్టింగ్స్‌ని వేయించారట. అంతే కాకుండా లాస్ట్ సినిమా ఇంటర్వెల్ బ్యాంగ్‌లో ఉన్నట్టుగానే పరమ శివుని భారీ విగ్రహం లానే పార్ట్ 2కి దానికి మించిన పవర్ఫుల్ సెట్టింగ్ ని రెడీ చేయించినట్టుగా తెలుస్తుంది. దీనితో ఈసారి పార్ట్ 2 తాండవం మాత్రం మామూలుగా ఉందని సినీ వర్గాల్లో టాక్. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తుండగా 14 రీల్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



## ‘ఎల్లమ్మ’లో కీర్తి సురేశ్

భోళా శంకర్, దసరా చిత్రాల తర్వాత కీర్తి సురేశ్ తెలుగు తెరపై కనిపించలేదు. ఆమె తెలుగు సినిమాలో కనిపించి ఏడాదిన్నర పైనే అయింది. బాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను మాత్రం అలరించింది. తాజా సమాచారం ప్రకారం ఆమె తెలుగు సినిమాపై స్పష్టత వచ్చినట్లు తెలుస్తోంది. ‘బలగం’ చిత్రంతో దర్శకుడిగా తొలి అడుగులోనే సినీప్రియుల్ని మెప్పించారు వేణు యెల్దండి. ఆయన తదుపరి సినిమాగా నితిన్‌తో ‘ఎల్లమ్మ’ పట్టాలెక్కిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో నాయికగా సాయిపల్లవి కనిపించనున్నట్లు వార్తలొచ్చినప్పటికీ.. డేట్లు సమస్యతో ఆమె తప్పుకొన్నట్లు సమాచారం. ఇప్పుడు ఆ పాత్ర కోసం దర్శకుడు వేణు.. కీర్తి సురేశ్‌ను సంప్రదించారని సమాచారం. ప్రస్తుతం ఈ చిత్ర విషయమై చర్చలు కొనసాగుతున్నాయని.. కీర్తికి ఇప్పటికే కథ వినిపించారని.. త్వరలోనే ఆమె నుంచి సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఒకవేళ అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఇది నితిన్ కీర్తిల కాంబోలో రెండో సినిమా అవుతుంది. వీళ్లిద్దరూ ‘రంగ్ దే’లో జంటగా నటించిన సంగతి తెలిసిందే!

## రీల్



## ‘రాబిన్‌హుడ్’ డేవిడ్ వార్నర్ ఎంట్రీ

నితిన్ డైరెక్టర్ వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం ‘రాబిన్‌హుడ్’. శ్రీలీల హీరోయిన్. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ఈ సినిమాలో అతిథి పాత్రలో సందడి చేయనున్నారు. 28న విడుదల కానుంది. ఈ సందర్భంగా.. ట్రైలర్‌ను చిత్ర బృందం ఆదివారం విడుదల చేసింది.

## లంకకు వెళుతున్న రౌడీ హీరో



రౌడీ హీరో విజయ్ దేవరకొండ, జెర్సీ ఫేమ్ గౌతమ్ తిన్ననూరి కాంబినేషన్‌లో రాబోతున్న తాజా చిత్రం కింగ్‌డమ్. సితార ఎంటర్టైనమెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తుండగా.. భాగ్య శ్రీ బోర్సే కథానాయికగా నటిస్తుంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం సమ్మర్ కానుకగా మే 30న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను ఆకట్టుకుంది. అయితే తాజాగా మూవీ నుంచి అప్‌డేట్‌ను పంచుకున్నాడు విజయ్ దేవరకొండ. ఈ సినిమా లవ్ సాంగ్ షూట్ కోసం శ్రీలంకకి బయలుదేరినట్లు విజయ్ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టాడు. పాస్‌పోర్ట్ పట్టుకుని ఎయిర్‌పోర్ట్‌లో విమానం కోసం ఎదురు చూస్తున్న ఫొటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా రాబోతుండగా.. అణచివేయబడుతున్న ప్రజలకోసం విజయ్ నాయకుడిగా ఎలా నిలబడ్డాడు అనే కథతో ఈ సినిమా రాబోతుంది.



## అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఆసన్నమైంది

### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలో ఉన్న వ్యవస్థీకృత అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. దళితుల హక్కుల కోసం చేస్తున్న పోరాటాలు, సాధించిన విజయాలపైన సంబురాలు జరుపుకోవాలని, తద్వారా అమరుల త్యాగాలను, వారు సాధించిన విజయాలను స్మరించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. కేరళ రాజధాని తిరువంతపురంలో ఆదివారం జరిగిన దళిత ప్రగతి సదస్సును కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ప్రారంభించారు. అనంతరం సదస్సునుద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ అయ్యంగర్ పోరాటం మొదలు నంగేలీ వరకు అనేక పోరాటాలు జరిగాయని, వారు భావితరాల బాగు కోసం పని చేశారని గుర్తు చేశారు. దేశ దళిత ఆదివాసులుగా ఒక గొప్ప ప్రతిఘటన, విప్లవ చరిత్ర ఉన్నదని, బ్రిటీష్ మొదలు ఈ రోజు వరకు మా ర్పు కోసం చేస్తున్న అస్తిత్వ ఉద్యమాలు కూడా అందులో భాగమేనని వివరించారు. మానవాళి చరిత్రలో దళితులుగా తాము అనేక చీకటి రోజులను చూశామని, కానీ, ప్రతీసారి ఎదురొడ్డి నిలబడ్డామని తెలిపారు. పోరాట పటిమను ఒకరికి ఒకరం సహాయం చేసుకుంటూ భావి తరాలకు మంచి భవిష్యత్ కోసం పాటు పడాలని మంత్రి సీతక్క సూచించారు. అణగారిన వర్గాలు ఎదుర్కొనే కష్టాలు, అన్యాయాలను తాను ఒక ఆదివాసి మహిళాగా ప్రత్యక్ష్యంగా ఎదుర్కొన్నానని వివరించారు. మూడు సార్లు ఎంఎల్‌ఎగా, ప్రస్తుతం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా స్త్రీ సంక్షేమ శాఖ మంత్రిగా తన ప్రయాణంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నానని సీతక్క తెలిపారు

## భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో

# మతోన్మాద శక్తులను ఓడిద్దాం

యువతకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపు

ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో షహీద్ దివాస్ ర్యాలీ






**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భగత్ సింగ్ పోరాట స్ఫూర్తితో దేశ యువతకు మత రాజకీయాలను నూరిపోస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నిరంకుశ విధానాలను ఎండగట్టాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు యువతకు పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 94వ వర్ధంతిని పురస్కరించుకుని ‘షహీద్ దివాస్ ర్యాలీని‘ హిమాయత్ నగర్ లోని సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి రామ్ కోఠి లోని భగత్ సింగ్ విగ్రహం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధకద్రవ్యాలను నిర్మూలించాలి ఇంక్విలాబ్ జిందాబాద్.... భగత్ సింగ్ అమరేహే అనే నినాదాలతో భారీ యువజన ర్యాలీ ముందుకు సాగింది. ఈ సందర్భంగా సిపిఐరాష్ట్ర కార్యదర్శి, కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య పోరాటంలో భగత్ సింగ్ నిర్వహించిన పాత్ర యావత్తు దేశం విస్మరించరానిదన్నారు., 12ఏళ్ళ అతి చిన్న వయసులోనే స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 23 ఏళ్ళ యువప్రాయంలోనే దేశం కోసం ప్రాణాలర్పించి ఎందరో యువతకు స్ఫూర్తిగా నిలిచి దేశ భక్తిని రగిలించిన సమరయోధుడు, విప్లవ మూర్తి భగత్ సింగ్ అని కొనియాడారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పోరాడిన అత్యంత ప్రభావ శీల విప్లవకారులలో భగత్ సింగ్ అగ్రగణ్యుడని, ఈ కారణంగానే షహీద్ గా దేశ ప్రజలు కొనియాడారని వారు గుర్తు చేశారు.సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటీ. నర్సింహా మాట్లాడుతూ పరాయి పాలకులను దేశం నుండి తరిమి కొట్టే మహోన్నత పోరాటంలో పాల్గొనడంతోపాటు, దేశ యువకులందరు సామాజిక, ఆర్థిక, మత విషయాలలో సైతం సమగ్ర శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకొని, గతకాలపు భావాలకు పాతరేసి మార్పువైపు ఉద్యమించాలని భగత్ సింగ్ పిలుపునిచ్చారన్నారు. ఆ విప్లవకర భావాలను తాను స్వయంగా ఆచరించి దేశ యువతకు మార్గదర్శిగా నిలిచాడని తెలిపారు.ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ మతోన్మాత ముక్త భారతం సాధించడానికి భగత్ ఆలోచనలు, ఆయన చూపిన కార్యచరణ, మనకు తరగని స్ఫూర్తిగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. . మతోన్మాద రాజకీయాలను సమూలంగా ఓడించడమే భగత్ సింగ్ కు నేటితరం అందించగలిగే నిజమైన నివాళి అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహా, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్,ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి ఆర్. బాల కృష్ణ ,నెర్లకంటి శ్రీకాంత్, ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి మధు, శివ కుమార్... ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, రాష్ట్ర సమితి సభ్యులు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్,అనీల్ కుమార్, వంశీ,మహేష్, శేఖర్, గిరి బాబు, విజయ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలు పెరుగుతున్నాయ్

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలుంటాయి. నిందితుల ప్రమేయం నేరుగా ఉండడం. సీసీ పుటేజీలు, వేలిముద్రలు, ఇతర సాంకేతిక ఆధారాలతో తేలిగ్గా చిక్కుతారు. అయితే సైబర్ నేరాలు ఎక్కడ నుంచి జరుగుతున్నాయో కూడా తెలువదు. సైబర్ నేరాల్లో రికవరీ రేటు మాత్రం సరాసరి 5 శాతం కూడా ఉండడం లేదు. నిందితులు కటకటాలు లెక్కించడమూ కష్టసాధ్యంగా మారుతోంది. ఉదాహరణకు హైదరాబాద్ కమిషనరేట్లో గతేడాది చోరీ కేసుల్లో మొత్తం రూ.38.38 కోట్లు సొత్తు కాజేయగా పోలీసులు రూ.28.45 కోట్లు రికవరీ చేశారు. అంటే రికవరీ రేటు 74.15 శాతం. అదే సైబర్ నేరాల్లో రికవరీ సమస్యగా మారుతోంది. సైబర్ క్రైమ్ పోలీసులు అంచనా ప్రకారం తెలంగాణలోనే ప్రజలు సైబర్ నేరాల బారినపడి రోజూ సగటున రూ.3 కోట్లకు పైనే పోగొట్టుకుంటున్నారు. వాస్తవానికి సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టే సొమ్ము ఇంతకు 10 రెట్ల కంటే ఎక్కువగా ఉంటుందని కూడా పోలీసులు అంటున్నారు.ఒక్క హైదరాబాద్ లోనే రోజుకు రూ. కోటికి పైగా సైబర్ నేరగాళ్ల ఖాతాల్లోకి వెళ్తున్నాయి.

**సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఉద్యోగుల సహకారం**

కేంద్ర హోంశాఖను సైబర్ ఇంటిలిజెన్స్ అందించిన నివేదికకు బలం చేకూర్చే కేసులను ఇటీవల తెలంగాణ పోలీసులు వెలుగులోకి తెచ్చారు. సైబర్ నేరగాళ్ల ఆగడాలకు కొందరు బ్యాంకు ఉద్యోగులు దన్నుగా ఉంటున్నారు. ఖాతా వివరాలు అడిగో.. ఓటీపీ నంబరు అడిగో& లేదంటే డిజిటల్ అరెస్టు అయ్యారని భయపెట్టో అమాయక ప్రజలను మోసం చేసి.. వారి నుంచి కోట్లు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లకు ఆ ఉద్యోగులే సహకరిస్తున్నారు. సైబర్ నేరగాళ్ల కోసం మ్యూల్ ఖాతాలను సృష్టించి ఆ దొంగ డబ్బు దాచుకునేలా వేర్వేరు ఖాతాలకు బదిలీ చేయించుకునేలా అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. తెలుగు రాష్ట్రాలు సహా గుజరాత్, కర్ణాటక, న్యూఢిల్లీ, యూపీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బిహార్లో సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు భారీ ఆపరేషన్ నిర్వహించి 52 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశారు. దీంతో బ్యాంకు ఉద్యోగుల సహకారం తేటతెల్లమైంది. ఈ సైబర్ నేరగాళ్లు తెలంగాణలో 74 సైబర్ నేరాలు సహా దేశవ్యాప్తంగా 576 నేరాలకు పాల్పడి రూ.88.32 కోట్లు కొల్లగొట్టారని పోలీసులు తేల్చారు.

## విచిత్ర ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

ఓటమిలో ప్రజల తప్పేమీ లేదని, కెసిఆర్ మీద ద్వేషం నింపి జనాల మనసు మార్చారన్నారు. అసూయ, ద్వేషం, బిఆర్‌ఎస్ ఓటమికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. కరీంనగర్‌లో రజతోత్సవ సన్నాహక ఉమ్మడి కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు నగరంలో భారీగా వాహనాల ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కెటిఆర్ ప్రసంగించారు. ఏప్రిల్ 27న జరిగే వరంగల్ సభకు లక్షలాదిగా ప్రజలు, కార్యకర్తలు తరలివచ్చి బిఆర్‌ఎస్ పని అయిపోయిందని మాట్లాడుతున్న వాళ్ల నోళ్లు మూతలు పడేలా చేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్‌లో బిఆర్‌ఎస్ పార్టీ చాలా బలంగా ఉందని, కెసిఆర్‌కు కరీంనగర్ సెంటిమెంట్ అని, ఇక్కడి నుంచి ఏ కార్యక్రమం మొదలుపెట్టినా సూపర్‌హిట్ అవుతుందని నమ్ముతారని తెలిపారు. టిఆర్‌ఎస్ పార్టీ పెట్టిన తర్వాత మొట్టమొదటి బహిరంగ సభ సింహగర్జన 2017 మే 17న ఇదే కరీంనగర్‌లో ఎస్ఆర్ఆర్ మైదానంలో కెసిఆర్ పెట్టి తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కడుంది తెలంగాణ అని అప్పటి పిసిసి అధ్యక్షుడు పిచ్చి ప్రేలాపనలు చేస్తే దానికి స్పందించి కెసిఆర్ రాజీనామా చేస్తే రెండు లక్షల ఓట్లతో గెలిపించి కరీంనగర్ దమ్ము చూపించిందని గుర్తు చేశారు. అధికార పక్షానికి ముచ్చెమటలు పట్టిస్తూ ప్రతిపక్షం అంటే ఎలా ఉండాలో 15 నెలల నుంచి బిఆర్‌ఎస్ చూపోస్తోందన్నారు. కాలం బాలేనప్పుడు వానపాములు సైతం నాగుపాముల లెక్క బుసకొడతాయని, గ్రామ సింహాలు సైతం నిజమైన సింహాల లెక్క గర్జిస్తాయన్నారు. బిజెపి, కాంగ్రెస్‌లు దొందూ దొందేన్నారు. రెండు పార్టీలు తెలంగాణ ప్రయోజనాలకు శత్రువులేనన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే పోలీసు రాజ్యం, అణచివేతల రాజ్యం అన్నారు. మళ్లీ బిఆర్‌ఎస్ అధికారంలోకి తప్పకుండా వస్తుందని, బిఆర్‌ఎస్ కార్యకర్తలను వేధించే ఏ ఒక్కరినీ వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. బిజెపి, కాంగ్రెస్ మోసాన్ని ఎండకట్టాలని, తెలంగాణలోని అన్ని వర్గాలకు జరిగిన అన్యాయాన్ని లెక్కలతో సహా చెప్పే సత్తా బిఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులకు ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవడానికి మేమంతా కష్టపడతామని, రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 13కు 13 స్థానాల్లో గులాబీ జెండా ఎగరాలని దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, సంజయ్, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకె రవిశంకర్, కోరుకంటి చందర్, సత్యనారాయణ, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తదితరులున్నారు.

## ఇజ్రాయెల్ దాడులు

(మొదటి పేజీ తరువాయి)

ఐడిఎఫ్ సైన్యం హెలికాప్టర్లు, యుద్ధ టాంకులతో దాడులు చేస్తోంది. ఖాన్ యూనిస్, రఫా ప్రాంతాలపై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. దక్షిణ గాజాలోని రెండు ఆసుపత్రుల ప్రకటన ప్రకారం 17 మృతదేహాలను అక్కడికి చేరవేశారు. మృతుల్లో పిల్లలు ఉన్నారు. ఖాన్‌యూనిస్‌లో జరిగిన దాడుల్లో ఐదుగురు పిల్లలు, వారి తల్లిదండ్రులు మరణించినట్లు యూరోపియన్ ఆసుపత్రి వర్గాలు చెప్పాయి. మరోవైపు ఇరాన్ మద్దతు ఉన్న హౌతీ తిరుగుబాటుదారులు ఇజ్రాయెల్‌పై మరోసారి క్షిపణి ప్రయోగించారు. దీంతో ఇజ్రాయెల్ సైరన్లు మోగించింది. ఐతే ఎక్కడా నష్టం జరగలేదు. గడచిన మంగళవారం (మార్చి 18) నుండి గాజాలో ఇజ్రాయెల్ పూర్తిస్థాయి యుద్ధ దాడులను పునఃప్రారంభించింది. దీంతో వేలాదిమంది ప్రజలు భయంతో మళ్ళీ ఇళ్ళువదిలి పారిపోతున్నారు. ఇంకా మూడు వారాలుగా ఆహార సరఫరా కూడా నిలిపివేయడంతో ప్రజలు త్రాగునీరు, ఆహారం కోసం అన్వేషిస్తూ అనేక ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. గాజాలో జనవరి 19వ తేదీన ఇజ్రాయెల్–హమాస్ మధ్య ప్రారంభమైన 45 రోజుల కాల్పుల విరమణ అనుమానాలు, ఆగ్రహాలు, ఉల్లంఘనలమధ్య మార్చి ఒకటో తేదీతో ముగిసింది. ఆ తర్వాత రెండో విడత కాల్పుల విరమణకు ఇజ్రాయెల్–హమాస్ నాయకులు ఎవరి కారణాలు వారు చెప్పి ఒప్పందానికి దూరమయ్యారు. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణ ఒప్పందాన్ని హమాస్ తిరస్కరించిందనీ, మిగిలిన బందీల విడుదలకు తిరస్కరిస్తోందనీ, గొంతెమ్మ కోర్కెలు తీర్చమంటోందనీ ఇజ్రాయెల్ విమర్శిస్తూ గాజాలోకి ఆహారసరఫరాను పూర్తిగా అడ్డుకుంది. గడచిన ఆరు రోజులుగా తిరిగి యుద్ధ మొదలుపెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తున్నది. గాజాలో తమ అధీనంలో లేని ఇతర ప్రాంతాలను కూడా శాశ్వత ప్రాతిపదికపై ఆక్రమిస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ప్రకటించారు. ఈ మేరకు ఐడిఎఫ్‌కు ఆదేశాలిచ్చారు. హమాస్ వద్ద ఇంకా మిగిలిఉన్న 59 మంది బందీలలో సజీవంగా ఉన్న 24 మంది బందీలను వెంటనే విడుదల చేయకపోతే యుద్ధాన్ని మరింత విస్తరిస్తామని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజిమన్ నేతన్యాహూ ఇప్పటికే ప్రకటించారు.

**టెబనాన్‌పై పెరిగిన దాడులు అమెరికా మధ్యవర్తిత్వం?**

అదేవిధంగా దక్షిణ లెబనాన్‌లో కూడా ఇజ్రాయెల్ ఆదివారంనాడు వైమానిక దాడులను పెంచింది. హిజ్బుల్లా ఉగ్రవాదులే లక్ష్యంగా పాలస్తీనా శరణార్థ శిబిరాలపై దాడులు చేస్తున్నది. 1948లో ఇజ్రాయెల్ నుండి పాలస్తీనియన్లను వెళ్ళగొట్టిన తర్వాత పాలస్తినా ప్రజలు దక్షిణ లెబనాన్‌లో తలదాచుకున్నారు. కానీ హిజ్బుల్లా ఉగ్రవాదులు భద్రతా మండలి తీర్మానాన్ని ఉల్లంఘించి భూగర్భంలోంచి సొరంగాలు తవ్వి ఇజ్రాయెల్‌లోకి ప్రవేశించి ఉగ్రవాద కార్యకలాపాలు చేస్తున్నదని ఆ ప్రభుత్వం ఆరోపిస్తున్నది. హౌతీ ఉగ్రవాదులు కూడా ఇజ్రాయెల్ దాని మిత్రుల వాణిజ్య నౌకలపై ఎర్ర సముద్రంలో దాడులు పెంచుతామని ప్రకటించింది. ఈ వంకతో హౌతీలపై అమెరికా సైనిక దాడులు చేసింది. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు సర్దుమణినట్టే కనిపించినప్పటికీ ఈ రూపేణా మరింతగా పేట్రేగుతున్నాయి. ఈ పరిస్థితులకు గాజాలో శాంతి లేకపోవడమే కారణమని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తున్నది. ఇజ్రాయెల్–హమాస్ తిరిగి కాల్పుల విరమణ చేపట్టేందుకు మధ్యవర్తిత్వం చేసేందుకు అమెరికా ప్రభుత్వం ఆదివారంనాడు సంసిద్ధత వ్యక్తం చేసింది.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com